పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 122 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శనివారం 14 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 122 PAGES : 12 EDITOR : G. A. RAO (ANAND GANTYADA) PUBLISHED : HYDERABAD SAT 14 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

వారిని అంతం చేస్తున్నా

ఇరాన్‌కు మరోసారి డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా అధ్యక్షుడిగా వారిని అంతం చేస్తున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. మతిచెడిన నేతలకు ఈరోజు ఏం జరుగుతుందో మీరే చూస్తారని అన్నారు. ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యిందని, ఇక వైమానిక దళం కూడా ఉండదని

మిగతా 2లో

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూత

హైదరాబాద్ పెన్ పవర్:ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర (82) కన్నుమూశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమిం చడంతో, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. హెచ్ జే దొర కొంతకాలంగా కిడ్నీ సమస్యల తో బాధపడుతున్నారు. ఆయన క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఉదయం హైదరాబాద్ లోని నిమ్స్ లో డయాలసిస్

మిగతా 2లో

మూసీ ప్రాజెక్టుకు బీజేపీ వ్యతిరేకం కాదు.. పేదలను దెబ్బతీస్తే మాత్రం పోరాటమే

హైదరాబాద్ పెన్ పవర్:మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తమ పార్టీ వైఖరిని స్పష్టం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాము మూసీ నది శుద్ధికి లేదా అభివృద్ధికి ఎప్పుడూ వ్యతిరేకం కాదని, కానీ అభివృద్ధి పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూల్చడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన విమర్శలకు కౌంటర్‌గా మాట్లాడిన ఆయన, మూసీ నది హైదరాబాద్ నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని బీజేపీ కోరుకుంటోందని తెలిపారు. అయితే, 'గాంధీ సరోవర్' వంటి ప్రాజెక్టుల కోసం మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించుకున్న ఇళ్లను కూల్చడం అంగీకారయోగ్యం కాదని, ఇళ్లకు నష్టం కలగకుండానే నదిని శుద్ధి చేయవచ్చని ఆయన సూచించారు.గుజరాత్‌లోని సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును ఉదాహరణగా తీసుకునే వారు, అక్కడ నరేంద్ర మోదీ అనుసరించిన విధానాలను గమనించాలని

మిగతా 2లో

రేవంత్ రెడ్డి బినామీ కంపెనీపై

కేసులను ప్రభుత్వం తారుమారు చేసింది

అమిత్ షాకు కేటీఆర్ లేఖ

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బినామీ కంపె నీ కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్‌పై కేసులను ప్రభుత్వం తారుమారు చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి బినామీ వ్యాపారాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు కేటీఆర్ లేఖ రాశారు. ఈ లేఖ ప్రతులను కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, అర్జున్ రామ్ మేఘవాల్‌లకు కూడా పంపించారు. తెలంగాణలో శాంతిభద్రతలు దిగజారాయని ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. కేఎల్ఎస్ఆర్ సంస్థపై కేసులు నమోదు కాగా, విచారణ వేళ ముఖ్యమంత్రి ఆదేశాలతో ప్రభుత్వం సాక్ష్యాధారాలను తారుమారు చేసిందని ఆరోపించారు. సాక్ష్యాలు పోయాయని చెప్పడం దారుణమని అన్నారు. అధికారులపై ముఖ్యమంత్రి ఒత్తిడి తెచ్చి సాక్ష్యాలను మాయం చేయించారని మండిపడ్డారు.రాష్ట్రంలో విచారణ సంస్థలు, పోలీసులను నమ్మే పరిస్థితి లేదని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోయే పరిస్థితి

మిగతా 2లో

గాంధీ విగ్రహానికి 200 కోట్లు ఖర్చు చేస్తే తప్పేంటి?

గాంధీ సరోవర్‌కు రూ.200 కోట్లు కేటాయిస్తే.. రూ.5000 కోట్లు అని ప్రచారం చేస్తున్నారు: సీఎం రేవంత్

- వారి జోలికి వెళితే మళ్లీ అధికారంలోకి రాలేమని మాకు తెలుసు: రేవంత్ రెడ్డి
- అభివృద్ధిని అందుకోవాలనే మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టును తీసుకున్నాం
- నిపుణులు మేధావులతో చర్చించాకే నిర్ణయం
- నల్గొండ గురించి ఒక్కరైనా ఆలోచన చేస్తున్నారా?
- మేం తెచ్చే ప్రాజెక్టు ఎవరికీ వ్యతిరేకం కాదు
- ఈ ప్రాజెక్టును అడ్డుకునే వాళ్లు అక్కడ నివసించండి
- వద్దనే వారందరికీ కంటైనర్ ఇళ్లు ఇస్తాం

హైదరాబాద్ పెన్ పవర్:పేదల జోలికి వెళితే మాకు మళ్లీ అధికారం వస్తుందా, అలాంటప్పుడు మేం పేదలకు అన్యాయం ఎందుకు చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నిం చారు. పేదలకు మేం మంచి చేస్తే, తాము అధికారం లోకి రాలేమని ప్రతిపక్ష నాయకులకు భయం పట్టుకుందని విమర్శించారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యం లో నిర్వహించిన 'మూసీ ఇన్వైట్స్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.మూసీ అభివృద్ధిని బాధ్యతా యుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. రెండేళ్లుగా అధికారులతో క్షుణ్ణంగా ప్రతి అంశం పరిశీలించాకే ముందడుగు వేస్తున్నామని తెలిపారు. వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాలు ఇప్పటికీ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని పేర్కొన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ వంటి ప్రాజెక్టులకు కొంతమంది అడ్డుపడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.మూసీ, ఈసా సంగమ స్థానం లంగర్ హౌస్ వద్ద బాపూఘాట్‌ను పర్యాటక కేంద్రంగా చేస్తామని అన్నారు. మూసీ, గోదావరి జలాలతో ప్రజల దాహార్తిని తీర్చే ప్రయత్నం చేస్తామని అన్నారు. ఘనమైన చరిత్ర కలిగిన మూసీ చరిత్ర కాలగర్భంలో కలిసిపోతే ఎలా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే ప్రాజెక్టులు ఎవరికీ వ్యతిరేకం కాదని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రాజెక్టులను అడ్డుకోవద్దని కోరారు.

పాతబస్తీలో మెట్రో, రోడ్ల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో చెరువులను పునరుద్ధరిస్తున్నామని, ప్రజలు కూడా తమను స్వాగతిస్తున్నారని తెలిపారు. మూసీ అభివృద్ధిని అడ్డుకుంటున్న వారు ఇప్పుడు అదే కాలువ పక్కన నివసించగలుగుతారా అని ప్రశ్నించారు. అలాంటి వారికి కంటైనర్‌లు ఇస్తానని, నివసించాలని సవాల్ చేశారు.మూసీ ప్రక్షాళన చేయకపోతే నల్గొండ తీవ్రంగా దెబ్బతింటుందని, భవిష్యత్తు తరాలు కోలుకోలేని విధంగా నష్టపోతాయని అన్నారు. అన్నింటిని పరిగణనలోకి తీసుకుని

మిగతా 2లో

సమ్మె నోటీసు ఇచ్చిన తెలంగాణ ఆర్టీసీ జేఏసీ

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులు యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంలో చేయడంతో పాటు వివిధ డిమాండ్లపై కార్మికులు

మిగతా 2లో

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో

భారీ పేలుడు

హైదరాబాద్ పెన్ పవర్:ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు చోటుచేసుకుంది. పాలస్తీనాకు మద్దతుగా భారీ ఎత్తున నిర్వహిస్తున్న 'కుద్స్ డే' ర్యాలీలో ఊహించని విధంగా తీవ్ర విస్ఫోటనం సంభవించింది. ఇజ్రాయెల్ సైన్యం బహిరంగంగా హెచ్చరికలు జారీ చేసిన కొద్దిసేపటికే ఈ ఘటన జరగడం గమనార్హం. దాడికి ముందు ఇజ్రాయెల్ సైన్యం తమ అధికారిక పెర్షియన్ (ఫార్సీ) సోషల్ మీడియా ఖాతా ద్వారా మూడు మ్యాప్‌లను పంచుకుంది. టెహ్రాన్‌లోని చహర్రా-ఇ వెలియాస్ర్, మేయ్దాన్-ఇ తౌహిద్, విల్లాస్ ప్రాంతాలను ఎరుపు రంగుతో మార్క్ చేసింది. ఈ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు వెంటనే సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని, త్వరలోనే దాడులు జరుగుతాయని చాలా స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది.ఈ హెచ్చరికలు వెలువడిన కొద్ది సమయానికే, టెహ్రాన్ యూనివర్సిటీ వైపు వెళుతున్న కుద్స్ డే ర్యాలీ సమీపంలో

మిగతా 2లో

ఎల్‌పీజీ కొరత.. గ్యాస్ గోడౌన్ల వద్ద బారులు

హైదరాబాద్ పెన్ పవర్:ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఎల్పీజీ కొరత వినియోగదా రులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే బెంగళూరు, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ తదితర నగరాల్లో వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా హోటళ్లు, రెస్టారెంట్లు తాత్కాలికంగా మూతపడ్డాయి. వంట గ్యాస్ కొరత కారణంగా గృహ వినియోగదారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంట గ్యాస్ ఇళ్ల వరకు రావడానికి రోజుల సమయం పడుతుండటంతో వినియోగదారులు వివిధ ప్రాంతాల్లో గ్యాస్ గోడౌన్ల వద్దకు వచ్చి క్యూ కడుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో,

మిగతా 2లో

గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్రానిదే బాధ్యత...

సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు

పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ పెన్ పవర్:ప్రస్తుతం నెలకొన్న గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా విమర్శించారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాల వల్ల సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని ధ్వజమెత్తారు.దేశంలో నెలకొన్న గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్రానిదే పూర్తి బాధ్యతని, అంతర్జాతీయంగా యుద్ధ వాతావరణం ఉన్న నేపథ్యంలో కేంద్రం తక్షణమే స్పందించి సరఫరాను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు

మిగతా 2లో

గ్యాస్ కొరత లేదు.. వదంతులు నమ్మొద్దు

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణలో గ్యాస్ సిలిండర్ల కొరత ఉందంటూ వస్తున్న వదంతులపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. రాష్ట్రంలో గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన

మిగతా 2లో

హిడ్మాను చిత్రహింసలకు గురి చేసి చంపేశారు

హైదరాబాద్ పెన్ పవర్:మాజీ మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ (తిప్పిరి తిరుపతి) లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఆయుధాలను వదిలేసి ఆయన జన జీవన స్రవంతిలో కలిసిపోయారు. ఆయన ఈరోజు ఒక మీడియా ప్రతినిధితో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. హిడ్మా లొంగిపోతానని చెప్పినప్పుడు తాము వారించామని, అయితే

మిగతా 2లో

ఎడిటర్ వ్యూ

ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

జర్మనీలోని ఉల్మ్ అనే ప్రాంతంలోనే ఒక యూదు కుటుంబంలో హెర్మన్–పౌలిన్ దంపతులకు 14 మార్చి 1879 రోజు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ జన్మించారు. చిన్నతనంలో మాట్లాడడమే కష్టంగా ఉండేది. కుటుంబం పలు ప్రాంతాలకు మారిన తర్వాత పావియా నగరంలో స్థిరపడ్డాడు. చిన్నతనంలో మతపరమైన వ్యక్తిగా మారిన తర్వాత పిల్లల సైన్స్ సీరీస్ పుస్తకాలను చదవడంతో మత విశ్వాసాలకు విరుద్ధంగా శాస్త్రీయ కోణంలో ఆలోచించడం మొదలు పెట్టాడు. 1880లో మునిచ్‌కు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ కుటుంబం మారిన తర్వాత అక్కడే ప్రాథమిక పాఠశాల విద్య చదివారు. సిట్జర్‌లాండ్‌లో మాధ్యమిక విద్య, జురిచ్‌లో పాలిటెక్నిక్ పూర్తి చేసాడు. 1905లో జురిచ్ యూనివర్సిటీ నుంచి పి హెచ్‌డి పట్టా అందుకున్నారు. జురిచ్/బెర్న్/చార్లెస్/హంబోల్ట్/లైడెన్/ఆక్స్‌ఫర్డ్ లాంటి పలు యూనివర్సిటీల్లో ప్రొఫెసర్‌గా పని చేస్తూ పరిశోధనలు కొనసాగిస్తూ 1916లో "సాధారణ సాపేక్షత సిద్ధాంతాన్ని" ప్రతిపాదించారు. స్విస్, జర్మన్, అమెరికా పౌరసత్వాలు కలిగిన ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ చేసిన పరిశోధనా ఫలితాల ఆధారంగా 1921లో భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి పొందారు. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ఒక శరణార్థిగా ఇతర శరణార్థుల చేయూతను ఇచ్చారు. జాత్యహంకారాని వ్యతిరేకంగా గళం ఎత్తిన ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ చిన్నతనంలో ఆలస్యంగా మాట్లాడడం ప్రారంభించారు. ప్రసిద్ధ ఆవిష్కరణలు చేస్తూనే పేటెంట్స్ క్లర్క్‌గా పని చేశారు. మానవత్వ సంక్షోభాల బారినపడిన అభాగ్యుల జీవితాల్లో వెలుగులు నింపడానికి "ఐఆర్‌సి (ఇంటర్నెషనల్ రిలీఫ్ అసోసియేషన్)"ను స్థాపించి ప్రపంచ శాంతి స్థాపనకు పునాదులు వేశారు.

జర్మనీకి చెందిన ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ భౌతికశాస్త్రంలో ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తగా "సాధారణ సాపేక్షత సిద్ధాంతాన్ని (జనరల్ థియరీ ఆఫ్ రిలెటివిటీ)" ప్రతిపాదించడంతో పాటు "ద్రవ్యరాశి–శక్తి తుల్యతానియమాన్ని (మాస్ ఎనర్జీ ఈక్వివలెన్స్)" లేదా "ఇ = ఎఇ2 సమీకరణం" అందించారు. ఒక తత్వశాస్త్రవేత్తగా కూడా ప్రభావవంతమైన కృషి చేశారు. క్వాంటం థియరీ పరిణామ క్రమంలో అతి ముఖ్యమైన "ఫోటో ఎలెక్ట్రిక్ ఎఫెక్ట్"ను కనిపెట్టి 1916లో నోబెల్ బహుమతిని పొందారు. స్టాటిస్టికల్ మెకానిక్స్, క్వాంటం థియరీ, పార్టికల్ థియరీ, అణువుల చలనాల గూర్చి లోతైన అధ్యయనాలు చేశారు. హిట్లర్ అధికారంలోకి వచ్చాక జర్మనీ వదిలి అమెరికాలోకి బెర్లిన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో ఆచార్యులుగా పని చేసారు. సాధారణ సాపేక్షత సిద్ధాంతంతో పాటు ప్రత్యేక సాపేక్షత సిద్ధాంతం, బ్రౌనియన్ మోషన్ సిద్ధాంతం, ఐన్‌స్టీన్ ఫీల్డ్ సమీకరణం, కాస్మలాజికల్ సిద్ధాంతం, బోస్–ఐన్‌స్టీన్ గణాంకాలు, బోస్–ఐన్‌స్టీన్ కండెన్సేట్, గురుత్వాకర్షణ తరంగం, ఏకీకృత క్షేత్ర సిద్ధాంతం, ఈపిఆర్ పారడాక్స్, సమిష్టి వివరణ లాంటి పలు అంశాలను కనుగొన్నారు. తన జీవితకాలంలో 300లకు పైగా శాస్త్రీయ పరిశోధనా వ్యాసాలు, 150కి పైగా ఇతర వ్యాసాలను వివిధ అంతర్దాతీయ జర్నల్స్‌లో ప్రచురించి ప్రపంచ భౌతిక శాస్త్రవేత్తలకు దారి దీపంగా నిలిచారు. 2014లో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ పరిశోధనలకు చెందిన 30,000 శాస్త్రీయ పత్రాలను విడుదల చేయడం కూడా జరగడం మహా అద్భుతం. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ శాస్త్ర పరిజ్ఞానానికి మెచ్చిన అంతర్జాతీయ పౌర శాస్త్ర సమాజం నోబెల్ బహుమతితో పాటు మాక్స్ ప్లాంక్ మెడల్, 20వ శతాబ్దపు ప్రముఖ వ్యక్తి, బర్నాల్డ్ మెడల్, మాట్టూచి మెడల్, కోప్లీ మెడల్, రాయల్ ఆస్ట్రనామికల్ సొసైటీ బంగారు పతకం లాంటి అనేక పురస్కారాలను పొందారు. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ఒక నోబెల్ బహుమతి గ్రహీత మాత్రమే కాదని, ఆయన ఒక ప్రపంచ శాంతి దూతగా నిలిచాడని ఆయన సుసంపన్న జీవితం వివరిస్తున్నది. మితిమీరిన జాతీయతావాదం ఒక శిశు వ్యాధి లాంటిదని, దానితో ప్రమాదమని ప్రచారం చేశారు. అణుశక్తి, ఆయుధాల అవసరం లేదని ప్రపంచ శాంతి పాఠాలను ప్రచారం చేసిన ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ఆధునిక భావాలు నేటి తరం పౌరులకు దారి దీపాలుగా నిలుస్తున్నాయని గమనించారు. ఐన్‌స్టీన్ అద్భుత మేధస్సు నేటి డిజిటల్–ఏఐ యుగానికి కూడా పునాదిగా మారిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఆయన శాస్త్రీయ ఆవిష్కరణలను ఆకళింపు చేసుకుంటూ ముందుకు సాగాలని నేటి యువతను కోరుకుందాం.

గాంధీ విగ్రహానికి 200 కోట్లు ఖర్చు చేస్తే తప్పేంటి?

- మొదటి పేజీ తరువాయి

మూసీ ప్రాజెక్టుపై ముందుకు వెళుతున్నామని అన్నారు. శుక్రాచార్యుడు, ఆయన శిష్యులు నిత్యం యజ్ఞాలను భగ్నం చేసేవారని, కానీ దేవుళ్లు ఆ యజ్ఞాలను ఆపకుండా కొనసాగించారని అన్నారు. ప్రజల మంచి కోసం ప్రాజెక్టులపై తాము కూడా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. తాను హిందువునని, కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతానని తెలిపారు. వేరే మతాలను కూడా గౌరవిస్తానని అన్నారు. హైదరాబాద్ నగరం కాంక్రీట్ జంగిల్‌లా మారిపోయిందని ముఖ్యమంత్రి అన్నారు. తన ఇంట్లో 1,300 ఫీట్లు వేస్తే కానీ బోరులో నీళ్లు రాలేదని చెప్పారు. అండర్ గ్రౌండ్ వాటర్ పడిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ పరివాహక ప్రాంతంలో 10 వేల కుటుంబాలు ఉన్నాయని, ప్రక్షాళన నేపథ్యంలో ఒక్కో కుటుంబానికి ఎంత ఇద్దామో ప్రతిపక్షాలు చెప్పాలని సూచించారు. బాధిత కుటుంబాలకు ఇప్పటికే రూ.10 వేల బెడ్రూంలు ఇచ్చామని తెలిపారు. పేద ప్రజలతో తాను శత్రుత్వం ఎందుకు పెంచుకుంటానని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. వారితో కంటతడి పెట్టించాల్సిన అవసరం తనకేమిటని అన్నారు. పేదలకు మంచి చేస్తేనే మళ్లీ అధికారంలోకి వస్తామనే విషయం తనకు తెలుసని అన్నారు. దుబాయ్ కంటే హైదరాబాద్ సురక్షితమైన ప్రాంతమని ఆయన అన్నారు.ప్రస్తుతం సోషల్ మీడియా అబద్ధాల వేదిక అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. గాంధీ సరోవర్‌కు రూ.200 కోట్లు కేటాయిస్తుంటే రూ.5 వేల కోట్లు అని ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు గొప్ప గొప్ప చదువులు చదువుకోవచ్చు, నేను ప్రభుత్వ కాలేజీలో చదువుకోవచ్చు, కానీ అన్నీ నేర్చుకుంటున్నానని ముఖ్యమంత్రి అన్నారు.అయినా అభివృద్ధి వద్దని మీరంతా చెబితే ఆపేస్తానని ముఖ్యమంత్రి అన్నారు. మీకు అవసరం లేని అభివృద్ధి నాకెందుకని ప్రశ్నించారు. తాను మంచికి ప్రతినిధిగా కావాలనుకుంటున్నానని అన్నారు. తెలంగాణకు రెండో ముఖ్యమంత్రి అయ్యే అవకాశం తనకు వచ్చిందని, రెండు మంచి పనులు చేయాలనే ఆలోచనతో ఉన్నానని అన్నారు. గాంధీని చంపిన వాళ్లు కూడా ఈరోజు నీతులు చెబుతున్నారని ఎద్దేవా చేశారు.

మూసీ ప్రాజెక్టుకు బీజేపీ వ్యతిరేకం కాదు..
పేదలను దెబ్బతీస్తే మాత్రం పోరాటమే

- మొదటి పేజీ తరువాయి

రాంచందర్ రావు హితవు పలికారు. అక్కడ సుమారు 4 వేల కుటుంబాలకు ముందుగా పునరావాసం కల్పించి, ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు పనులు చేపట్టారని గుర్తుచేశారు. ప్రజల జీవితాలను దెబ్బతీయకుండా చేసేదే నిజమైన అభివృద్ధి అని అన్నారు. గాంధీ విగ్రహాన్ని ఎంత ఎత్తులో నిర్మించినా తమకు అభ్యంతరం లేదని, కానీ పేదల జీవనాధారాన్ని దెబ్బతీస్తే మాత్రం పోరాటం తప్పదని హెచ్చరించారు.మరోవైపు, దేశంలో ఇంధన కొరతపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన బాధ్యతారాహిత్యంగా అభివర్ణించారు. అంతర్జాతీయంగా యుద్ధ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్ ఇప్పటికే సంబంధిత దేశాలతో మాట్లాడి చమురు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారని తెలిపారు.

భారతదేశం కేవలం ఒక ప్రాంతంపైనే ఆధారపడదని, 40 శాతం ముడి చమురు ఇతర దేశాల నుంచి వస్తుందని చెప్పారు. రవాణాలో స్వల్ప ఆలస్యాలు ఉండొచ్చని, కానీ గ్యాస్, పెట్రోల్ కొరత మాత్రం ఉండదని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హామీ ఇచ్చిందని, ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

సమ్మె నోటీసు ఇచ్చిన తెలంగాణ ఆర్టీసీ జేఏసీ

- మొదటి పేజీ తరువాయి

ఈ నోటీసు ఇచ్చారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు వెళతామని హెచ్చరించారు. సమ్మె తేదీపై 14 రోజుల తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఆర్టీసీ జేఏసీ తెలిపింది. ఆర్టీసీ ఎండీ అందుబాటులో లేకపోవడంతో పేషీలో నోటీసులు ఇచ్చింది. లేబర్ కమిషనర్ కార్యాలయంలోనూ నోటీసులు ఇచ్చింది.2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని ఆర్టీసీ జేఏసీ కోరింది. మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెల రూ.350 కోట్లు కోత లేకుండా ఇవ్వాలని, పాత బకాయిలు రూ.2,500 కోట్లు వెంటనే విడుదల

చేయాలని డిమాండ్ చేసింది. ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేయాలని, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, ఉద్యోగులపై అధిక పనిభారం తగ్గించాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు.

గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్రానిదే బాధ్యత...

- మొదటి పేజీ తరువాయి

ఈ కొరతపై రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని, వారు తమ బాధ్యతను విస్మరిస్తున్నారని విమర్శించారు.మూసీ నదిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి ఒక స్పష్టమైన విజన్ ఉందని, ఈ ప్రాజెక్టుపై ఉన్న అన్ని అనుమానాలను పీపీటీ ద్వారా నివృత్తి చేస్తామని తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతాల్లోని నిర్వాసితులకు ప్రభుత్వం అన్ని విధాలా న్యాయం చేస్తుందని, వారిని ఇబ్బంది పెట్టే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. మహాత్మా గాంధీ మనవడు తుషార్ గాంధీకి మూసీ ప్రాజెక్టుపై ఎవరో తప్పుడు సమాచారం ఇచ్చారని, అందుకే ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు.బీజేపీకి రాష్ట్రంలో ఒక అజెండా, దేశంలో మరో అజెండా ఉందని పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులకు తీవ్ర అన్యాయం

జరిగిందని, బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని మండిపడ్డారు. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశం అనేది కేంద్ర ప్రభుత్వ నిర్ణయమని, దీనిపై అనవసర రాద్ధాంతం చేయవద్దని సూచించారు.

గ్యాస్ కొరత లేదు.. వదంతులు నమ్మొద్దు

- మొదటి పేజీ తరువాయి

అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. గ్యాస్ కొరతపై నెలకొన్న అపోహల నేపథ్యంలో మంత్రి ఇవాళ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో గ్యాస్ నిల్వలు, సరఫరా పరిస్థితిపై మంత్రి కూలంకషంగా సమీక్షించారు. ప్రజల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తప్పవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్లు, ఎస్పీలు,

పోలీసు కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, ప్రభుత్వ హాస్టళ్లకు సరిపడా గ్యాస్ సరఫరా అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ఎక్కడా ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు.

హిడ్మాను చిత్రహింసలకు గురి చేసి చంపేశారు

- మొదటి పేజీ తరువాయి

పోలీసుల ట్రాప్‌లో పడి ఆయన ప్రాణాలు కోల్పోయారని దేవ్‌జీ అన్నారు. హిడ్మాది వంద శాతం బూటకపు ఎన్‌కౌంటర్ అని, ఆయనను చిత్రహింసలకు గురిచేసి చంపేశారని ఆయన ఆరోపించారు. 'ఆపరేషన్ కగార్' సమయంలో బస్వరాజు చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోకపోవడం వల్లే ప్రతిఘటన అనివార్యమైందని, ఆ పోరాటంలోనే బస్వరాజును కోల్పోయామని వెల్లడించారు. మరోవైపు, అగ్రనేత గణపతి గురించి స్పందిస్తూ.. 2023లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో ఆయనను చివరిసారిగా చూశానని, ఆ తర్వాత ఆయనతో సంబంధాలు లేవని దేవ్‌జీ స్పష్టం చేశారు. సమాజంలో దోపిడీ రూపం మార్చుకుందే తప్ప తొలగిపోలేదని... దోపిడీ ఉన్నంత కాలం ఉద్యమం కొనసాగుతుందని ఆయన వ్యాఖ్యానించారు. మావోయిస్టు పార్టీపై నిషేధాన్ని ఎత్తివేసి, జైళ్లలో ఉన్న వారిని రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయ పదవుల కోసం తాను ఎన్నికల్లో పోటీ చేయబోనని, చట్టం పరిధిలోనే ఉండి ప్రజా సమస్యలపై పోరాడతానని దేవ్‌జీ ప్రకటించారు.

రేవంత్ రెడ్డి బినామీ కంపెనీపై కేసులను
ప్రభుత్వం తారుమారు చేసింది

- మొదటి పేజీ తరువాయి

వచ్చిందని అన్నారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీ దివాలా తీసినా రేవంత్ రెడ్డి కాంట్రాక్టులు కేటాయించడం సరికాదని అన్నారు. ఈ సంస్థపై విచారణ జరగాలని, అది నిష్పక్షపాతంగా జరగాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేంద్ర ఏజెన్సీలు విచారణ చేయాలని సుప్రీంకోర్టు సూచించినా రాష్ట్రం పట్టించుకోలేదని అన్నారు.

వారిని అంతం చేస్తున్నా

- మొదటి పేజీ తరువాయి

హెచ్చరించారు. క్షిపణులు, డ్రోన్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయని ఆయన అన్నారు. ఇప్పటికే వారి నాయకులు తుడిచిపెట్టుకుపోయారని అన్నారు. అక్కడి పాలకులు 47 ఏళ్ళుగా అమాయకులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. అందుకే అగ్రరాజ్యం అధ్యక్షుడిగా వారి అంతు చూస్తున్నానని ట్రంప్ అన్నారు. ఇదిలా ఉండగా, అమెరికాకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కేసీ–135 ట్యాంకర్ ఉత్తర ఇరాక్‌లో కుప్పకూలింది. ఈ ఘటనలో నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం సమయంలో విమానంలో ఆరుగురు ఉన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, ఘటనకు దారి తీసిన చర్యలపై దర్యాప్తు చేస్తున్నామని అమెరికా మిలిటరీ సెంట్రల్ కమాండ్ తెలిపింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూత

- మొదటి పేజీ తరువాయి

చేయించుకుని ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత ఆయన బాత్రూంలో పడిపోయినట్టు తెలుస్తోంది. హెచ్‌జే దొర తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు నిమ్స్ కు తరలించారు. అత్యవసర చికిత్స అందించినప్పటికీ డాక్టర్ల ప్రయత్నాలు ఫలించలేదు.

1965 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన హెచ్‌జే దొర శ్రీకాకుళం జిల్లాకు చెందినవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డీజీపీగా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఆయన విశేష సేవలు అందించారు. ముఖ్యంగా, రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాదాన్ని (నక్సలిజం) అణచివేయడంలో కీలక పాత్ర పోషించి గుర్తింపు పొందారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌గా,

సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్‌గానూ జాతీయ స్థాయిలో పలు ఉన్నత పదవులు చేపట్టారు. దొర 1996లో డీజీపీగా ప్రమోషన్ పొందారు. ఆయన తన సుదీర్ఘ వృత్తి జీవితానుభవాలతో 'జర్నీ త్రూ టర్బులెంట్ టైమ్స్' పేరుతో ఆత్మకథను కూడా రచించారు.

ఎల్‌పీజీ కొరత.. గ్యాస్ గోడౌన్ల వద్ద బారులు

- మొదటి పేజీ తరువాయి

జనగాం జిల్లా రఘునాథపల్లిలో వంట గ్యాస్ కోసం ప్రజలు సిలిండర్లతో బారులు తీరారు. మూడు రోజుల క్రితం గ్యాస్ బుక్ చేసుకున్నప్పటికీ రాలేదని వరుసలో నిలబడిన వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు

- మొదటి పేజీ తరువాయి

పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. పవిత్ర రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పాలస్తీనాతో సంఘీభావం తెలుపుతూ ఇరాన్ ప్రజలు ఈ నిరసనలు చేపడుతుంటారు. పేలుడు దెబ్బకు ఆకాశంలోకి దట్టమైన పొగలు ఎగిసిపడటంతో జనం ప్రాణభయంతో పరుగులు తీశారు.ప్రస్తుతం ఈ ఘటనలో ఎంతమంది ప్రాణాలు కోల్పోయారు, ఎంతమంది గాయపడ్డారు అనే దానిపై ఇరాన్ ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో.. ఇజ్రాయెల్ ముందస్తు హెచ్చరికలు చేసిన వెంటనే ఈ పేలుడు జరగడం పశ్చిమాసియాలో మరింత ఆందోళనను రేకెత్తిస్తోంది.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

- బహదూర్‌పల్లిలో 1500 గజాల్లో భారీ అక్రమ షెడ్డుకు నోటీసులు ఏవి..?
- బిల్డర్ శ్రీకాంత్ అక్రమ కట్టడానికి ఫిబ్రవరి 20న నోటీసు జారీ..!
- డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో శుక్రవారం శ్రీకాంత్ అక్రమ నిర్మాణం సీజ్..
- బిల్డర్ సిద్ధార్థ గుప్త అక్రమ నిర్మాణంపై ప్రశ్నించగానే వెంటనే నోటీసులు జారీ..
- ఫిబ్రవరి 20న సిద్ధార్థ గుప్త బిల్డింగ్ కనిపించ లేదా..? ఎవరూ ప్రశ్నించక వదిలేశారా..?
- టౌన్‌ప్లానింగ్ అధికారులకు బాధ్యత లేదా..? ప్రశ్నిస్తేనే 'నోటీసులు-సీజ్'లా..?
- 1500 గజాల భారీ అక్రమ షెడ్డుకు నోటీసులు ఎందుకు ఇవ్వలేదో మరి..?
- కాంగ్రెస్ నేత సిఫార్సులు ఉన్నట్టు సమాచారం.. అందుకే ఇవ్వలేదా..
- దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు పక్కా ప్రణాళికతో నోటీసుల డ్రామా..
- అక్రమ నిర్మాణాలు పూర్తయ్యే వరకు చోద్యం చూస్తారు..ఆతర్వాత నోటీసులు-సీజింగ్‌లు..
- ఇదంతా అక్రమార్కులకు- అధికారులకు నడుమ ఉన్న ఒప్పందాలే కారణమా..?

టిజి-బిపాస్ చట్టంలో "ఈసమంత" లొసుగు ఉంటే చాలు.. భారీ అక్రమ కట్టడాలకు, సహకరించడమే దుండిగల్ టౌన్‌ప్లానింగ్ ప్రత్యేకత.. దీనికి తోడు అధికారపార్టీ నేతల అండ, మంత్రి స్థాయి సిఫార్సులు ఉన్నాయంటే అతేసంగతులు..! మరోవైపు దుండిగల్ సర్కిల్‌కి బదిలీపై వచ్చిన టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎవరైనా, అక్రమ నిర్మాణాలకే ప్రాధాన్యత ఇవ్వడం గమనార్హం..! "జీహెచ్ఎంసి-సిఎంసి" టౌన్‌ప్లానింగ్ వ్యవస్థే..! అక్రమ నిర్మాణాల దందాకు మాఫియాగా తయారైందనే ఆరోపణలు లేకపోలేదు.. గతలో మల్లంపేట్ సర్వే నెంబర్ 170లో "శ్రీలక్ష్మి శ్రీనివాస కన్‌స్ట్రక్షన్"లో "అనుమతులు 60, అక్రమ నిర్మాణాలు 260..! కేసుల నమోదు అరెస్టులు అన్నీ హుష్‌కాకి అయ్యాయి.. నేటికీ అక్రమ కట్టడాల పరంపర కొనసాగుతూనే ఉంది.. ఈమధ్య దుండిగల్ సర్కిల్ మరో ఘనకార్యం కూడా ఉంది.. బౌరంపేట్ "వ్యాసా పాఠశాల" అక్రమ నిర్మాణాల వ్యవహారం మొత్తం టౌన్‌ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ లోనే కొనసాగిందంటే ఎవరైనా నమ్ముతారా.? అవును నిజమే..! సిఫార్సులకు ప్రాధాన్యత ఇవ్వడం తోపటు, అధికారుల స్వార్థపూరిత ముడుపుల వ్యవహారం కూడా తోడైంది.. మూడేళ్ళ క్రితమే కన్జర్వేషన్ జోన్‌లో నిర్మించిన వ్యాసా అక్రమ నిర్మాణాల, తప్పుడు పాఠశాల నిర్వహణను, సక్రమం చేసేందుకు బరితెగించి సహకరంపై పలువురు మండి పడుతున్నారు.. మూడు సంవత్సరాల తరువాత ఈ మధ్యనే వ్యాస పాఠశాలకు అనుమతులు ఇవ్వడం విశేషం.. ఫైర్, ఆర్ అండ్ బి, పలు ఎన్‌వోసిలు లంచాలు తీసుకుని ఇచ్చినట్లు స్పష్టతను ఇస్తుందని ఆరోపిస్తున్నారు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మార్చి 13:

1500 గజాల్లో భారీ అక్రమ షెడ్డు..!

'నో' నోటీస..!

దుండిగల్ సర్కిల్-59..! టౌన్'ప్లానింగ్' ఎత్తుగడలు..!

- దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్‌లో ద్వంద్వ వైఖరితో విధుల నిర్వహణ..
- ప్రమాదకర కట్టడాలు- ప్రోత్సహించడానికే ప్రథమ ప్రాధాన్యత..?
- మొదట నోటీసులతో సెటిల్మెంట్‌లు..? వినకుంటే సీజ్..! ఆరోపణలు..
- సిఫార్సులు ఉంటే..! ఆ సెకండ్ నోటీసు ప్రస్తావన కూడా ఉండదట..?
- నోటీసులు-సీజ్‌లు, టౌన్‌ప్లానింగ్ అధికారుల ఎత్తుగడలో భాగమేనా..?
- నాలుగు అంతస్తులు నిర్మించే వరకు నిద్రపోతున్నారా..?చైన్‌మెన్‌లు లేరా..?
- ఇప్పటివరకు 'నోటీసులు- సీజ్'లు చేసినవి శాశ్వత చర్యల దాఖలాలు ఉన్నాయా..?

దర్జాగా పనులు చేస్తున్న దృశ్యం..

శరవేగంగా అక్రమ షెడ్డు పనులు..

-4లో

బహదూర్‌పల్లిలో 1500 గజాల్లో భారీ షెడ్డు నిర్మాణం..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

గ్యాస్ కొరతపై.. భయాందోళనలు వద్దు..

బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరిక..

- తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌పీజీ కొరత లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం..
- అపోహలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు
- బ్లాక్ మార్కెట్‌పై ఇప్పటికే 288 కేసులు..
- గృహ వినియోగదారులకు సరిపడా సరఫరా గ్యాస్‌కు హామీ..
- బుకింగ్‌పై సమయ పరిమితికి సూచనలు.. పట్టణాల్లో 25-పల్లెల్లో 45 రోజులు..

- మిగతా 5లో...

నర్సాపూర్ రహదారిపై..! రోడ్డు ఆక్రమణల తొలగింపు..

జీడిమెట్ల సర్కిల్-55లో జీహెచ్ఎంసీ స్పెషల్ డ్రైవ్..

- చింతల్ హ్యాపీ చిల్డ్రన్స్ హాస్పిటల్ నుంచి కూరగాయల మార్కెట్ వరకు చర్యలు..
- డిప్యూటీ కమిషనర్ డి.శంకర్ సింగ్ ఆధ్వర్యంలో ఆక్రమణల తొలగింపు..
- రోడ్డు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో షెడ్లు, బండ్లు, విస్తరణలు తొలగింపు..
- మళ్లీ ఆక్రమణలకు పాల్పడితే..! కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

- మిగతా 4లో...

1500 గజాల్లో భారీ అక్రమ షెడ్‌కు..! 'నో' నోటీస్..!

బహుదూర్‌పల్లిలో సీజ్ చేసిన బిల్డర్ శ్రీకాంత్ అక్రమ నిర్మాణం..

ప్రశ్నించిన వెంటనే శుక్రవారం నోటీసులు ఇచ్చిన బిల్డర్ సిద్దార్థ అక్రమ నిర్మాణం..

సిఫార్సులంటే "న్యాయస్థానం" ఆదేశాలుగా భావిస్తున్న "టౌన్‌ప్లానింగ్"..

దుండిగల్ సర్కిల్-59లో సిఫార్సులకే అధిక ప్రాధాన్యత ఇస్తారు ఎందుకంటే.. "స్వామి కార్యం-స్వ కార్యం" సిద్ధించే ఏకైక ఆయుధం.. ఈ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల నియంత్రణలో టౌన్‌ప్లానింగ్ అధికారులు విఫలమయ్యారన్న విమర్శలే వ్యక్తమవుతున్నాయి.. సిఫార్సులు అంటే చట్టబద్ధత కల్పించినట్టు భయపడి పోతున్నారు.. ఒక్కోసారి కోర్టు ఆదేశాలను కూడా ధిక్కరించి చర్యలు సాలించిన సందర్భాలు ఉన్నాయి.. ఇదిలా ఉండగా ముఖ్యంగా బహుదూర్‌పల్లి ప్రాంతంలో సుమారు 1500 గజాల్లో నిర్మించిన భారీ అక్రమ షెడ్డుపై ఇప్పటివరకు ఎలాంటి నోటీసులు కూడా ఇవ్వకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుండగా..! అదే గ్రామంలో ఇద్దరు బిల్డర్‌లకు చెందిన రెండు అక్రమ నిర్మాణాల వ్యవహారం లోనూ టౌన్‌ప్లానింగ్ అధికారుల చేతివాటం బుద్ధిని బట్టబయలు చేస్తోంది.. అదేంటో చూడండి.. బహుదూర్‌పల్లి విలేజ్‌లో ఇద్దరు బిల్డర్‌ల రెండు అక్రమ నిర్మాణాలు పక్కపక్కనే ఉన్నప్పటికీ.. ఒకటి కమర్షియల్ ఏరియా, మరొకటి రెసిడెన్షియల్ ప్రాంతం.. మీడియా ప్రశ్నించి, వార్తలు వచ్చేవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.. ఫిబ్రవరి 20న "బిల్డర్ శ్రీకాంత్"కు 'షోకాజ్ నోటీసులు' ఇచ్చిన టౌన్‌ప్లానింగ్ అధికారులు.. పార్కింగ్ స్థలాన్ని ఆక్రమించి, కమర్షియల్ షట్టర్‌లు నిర్మించి, అదనపు అంతస్తుల అక్రమ నిర్మాణ దారుడు "బిల్డర్ సిద్దార్థ"కు ఆలస్యంగా శుక్రవారం (షోకాజ్ నోటీసు) ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తాయి.. అంటే ప్రశ్నిస్తేనే 'నోటీసులు-సీజ్‌లు'..! లేకుంటే సెటిల్మెంట్‌లా..?

- 3 పేజి తరువాయి

దుండిగల్ సర్కిల్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బహుదూర్‌పల్లిలోని అక్రమ నిర్మాణాల వ్యవహారంలో టౌన్‌ప్లానింగ్ అధికారుల పనితీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది.. సుమారు 1500 గజాల అక్రమ షెడ్‌కు అసలు నోటీసు ప్రస్తావనే లేదు..! ఒకేచోట రెండు అక్రమ నిర్మాణాలు ఉన్నప్పటికీ..! ఒకరికి 'నోటీసులు జారీ చేసి- సీజ్ చేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులు.. మరో అక్రమ నిర్మాణానికి నోటీసుల ఊసేలేదు..! ఎవరైనా ప్రశ్నిస్తే చూద్దమనే తీరుతో ఉన్న టౌన్‌ప్లానింగ్ అధికారులను, బిల్డర్ సిద్ధార్థ గుప్త నిర్మాణంపై ప్రశ్నించిన వెంటనే శుక్రవారం నోటీసులు జారీ చేయడం అధికారుల పనితీరును ఎలా పరిగణించాలి..? దుండిగల్ సర్కిల్-59లో అక్రమ నిర్మాణాల పట్ల అధికారులు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.. దీనికి తోడు బహుదూర్‌పల్లిలో తాజాగా 1500 గజాల్లో నిర్మించిన భారీ అక్రమ షెడ్డుకు ఇప్పటివరకు నోటీసులు ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది.. మరోవైపు సిఫార్సులు ఉన్న నిర్మాణాలకు నోటీసులు ఉండవన్న ఆరోపణలకు ఈ అక్రమ షెడ్డు బలం చేకూరే విధంగా ఉంది.. నోటీసులు, సీజింగ్‌లు టౌన్‌ప్లానింగ్ అధికారుల సెటిల్మెంట్ ఎత్తుగడల్లో భాగమేనని సర్వత్రా ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి..

ఇటీవల బహుదూర్‌పల్లిలో బిల్డర్ శ్రీకాంత్ నిర్మించిన అక్రమ కట్టడానికి ఫిబ్రవరి 20న నోటీసు జారీ చేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులు, డిప్యూటీ కమిషనర్ వెంకటేష్ నాయక్ ఆదేశాలతో సంబంధిత నిర్మాణాన్ని శుక్రవారం సీజ్ చేశారు.. అదేవిధంగా సహకరించే విధంగా నోటీసులు ఇవ్వని బిల్డర్ సిద్ధార్థ అక్రమ నిర్మాణంపై ప్రశ్నించిన వెంటనే శుక్రవారం నోటీసులు జారీ చేయడం గమనార్హం.. అయితే బహుదూర్‌పల్లిలోని 1500 గజాల భారీ అక్రమ షెడ్డుకు మాత్రం ఇప్పటివరకు అసలు నోటీసుల ఊసేలేదు ఎందుకనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. స్థానికుల ఆరోపణల ప్రకారం, కొంతమంది రాజకీయ నాయకుల సిఫార్సులు ఉన్న నిర్మాణాలను అధికారులు పట్టించుకోకుండా వదిలేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.. నోటీసులు, సీజింగ్‌ల పేరుతో సెటిల్మెంట్‌లు జరుగుతున్నాయనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.. బహుదూర్‌పల్లి విలేజ్‌లోని "శ్రీకాంత్-సద్దార్థ" అక్రమ కట్టడాల తోపాటు, కాంగ్రెస్ నేత భారీ షెడ్డుపై దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.. శాశ్వత చర్యలు చేపడతారా..? పాక్షికంగా ఉంటాయా అనే ప్రశ్నలు వస్తున్నాయి..

నర్సాపూర్ రహదారిపై..! రోడ్డు ఆక్రమణల తొలగింపు

- చింతల్ హ్యాపీ చిల్డ్రన్స్ హాస్పిటల్ నుంచి కూరగాయల మార్కెట్ వరకు చర్యలు..
- డిప్యూటీ కమిషనర్ డి.శంకర్ సింగ్ ఆధ్వర్యంలో ఆక్రమణల తొలగింపు..
- రోడ్డు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో షెడ్లు, బండ్లు, విస్తరణలు తొలగింపు..
- మళ్లీ ఆక్రమణలకు పాల్పడితే..! కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక..

జీడిమెట్ల సర్కిల్-55లో జీహెచ్ఎంసీ స్పెషల్ డ్రైవ్..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, మార్చి 13: కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని జీడిమెట్ల సర్కిల్--55లో రోడ్డు ఆక్రమణలపై జీహెచ్ఎంసీ అధికారులు శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.. నర్సాపూర్ మెయిన్ రోడ్డులో ఉన్న "హ్యాపీ చిల్డ్రన్స్ హాస్పిటల్" నుంచి "చింతల్ కూరగాయల మార్కెట్" వరకు రహదారి పక్కన ఏర్పాటు చేసిన అనధికారిక నిర్మాణాలు, తాత్కాలిక షెడ్లు, వ్యాపార దుకాణాల విస్తరణలను అధికారులు తొలగించారు.. జీడిమెట్ల సర్కిల్--55 డిప్యూటీ కమిషనర్ డి.శంకర్ సింగ్ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.. రహదారిపై వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించే విధంగా ఏర్పాటు చేసిన షాపుల ముందు భాగాల్లో, బండ్లు, షెడ్లు తదితర ఆక్రమణలను సిబ్బంది తొలగించారు. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా రహదారిని విస్తరించే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.. పట్టణ స్థానిక సంస్థల్లో, ముఖ్యంగా జీహెచ్ఎంసిలో ముఖ్యమైన విభాగం సాలీడ్ వేస్ట్ మేనేజ్మెంట్(ఘన వ్యర్థాల నిర్వహణ) (ఎస్‌డబ్ల్యుఎం) విభాగం కూడా ఇందులో పాల్గొన్నారు.. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యుఎం) కాశీఫ్ హుస్సేన్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యుఎం) జి.సాయి లిఖితా సేన్ తదితర అధికారులు పాల్గొన్నారు. జీహెచ్ఎంసీ సిబ్బంది, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, శానిటేషన్ సిబ్బంది కలిసి ఆక్రమణలను తొలగించి రోడ్డు మార్గాన్ని పునరుద్ధరించారు.. ఈ సందర్భంగా అధికారులు హెచ్చరిస్తూ, రోడ్డు మీద లేదా ఫుట్‌పాత్‌లపై మళ్లీ ఆక్రమణలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గించేందుకు, ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా అందించేందుకు ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతాయని వెల్లడించారు.

వారం రోజుల్లో ముగ్గురు దొంగలు అరెస్ట్..

- హోంగార్డులను అభినందించిన డీసీపీ కోటిరెడ్డి..
- దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించే హోంగార్డులు..
- బ్లూ కోట్స్‌లో పనిచేస్తున్న హోంగార్డుల ప్రతిభకు గుర్తింపు..
- వెయ్యి రూపాయల నగదు బహుమతి ప్రదానం..

దుండిగల్, పెన్ పవర్, మార్చి 13: దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ కేసులను ఛేదించడంలో విశేష ప్రతిభ కనబరిచిన హోంగార్డులను డీసీపీ అభినందించారు.. కుత్బుల్లాపూర్ డిసిపి కోటిరెడ్డి శుక్రవారం దుండిగల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, వారం రోజుల వ్యవధిలో ముగ్గురు దొంగలను పట్టుకునేందుకు సహకరించిన బ్లూ కోట్స్‌లో పనిచేస్తున్న హోంగార్డులు చిరంజీవి, రవీందర్లను పోలీసు సిబ్బంది సమక్షంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను ప్రశంసించిన డీసీపీ, ప్రజల భద్రత కోసం పోలీసులు, హోంగార్డులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.. కర్తవ్య నిర్వహణలో చూపిన చురుకుదనానికి గుర్తింపుగా చిరంజీవి, రవీందర్‌లకు వెయ్యి రూపాయల నగదు బహుమతిని కూడా అందజేశారు.. పోలీసు శాఖలో పనిచేస్తున్న సిబ్బంది ఇలాగే అప్రమత్తంగా ఉంటూ నేరాలను అరికట్టడంలో ముందుండాలని డీసీపీ కోరారు.. ఈ కార్యక్రమంలో దుండిగల్ ఎస్‌హెచ్‌ఓ ఇన్‌స్పెక్టర్ పి.సతీష్ కుమార్, ఎస్సైలు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు..

హోంగార్డులను సత్కరించి, బహుమతి అందజేస్తున్న డిసిపి కోటిరెడ్డి..

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

- తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌పీజీ కొరత లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం..
- అపోహలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు
- బ్లాక్ మార్కెట్‌పై ఇప్పటికే 288 కేసులు..
- గృహ వినియోగదారులకు సరిపడా సరఫరా గ్యాస్‌కు హామీ..
- బుకింగ్‌పై సమయ పరిమితికి సూచనలు.. పట్టణాల్లో 25-పల్లెల్లో 45 రోజులు..

సచివాలయం నుంచి మంత్రులు వీడియో కాన్ఫరెన్స్..

గ్యాస్ కొరతపై.. భయాందోళనలు వద్దు

బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరిక..

మేడ్చల్ జిల్లా నుంచి వీసిలో పాల్గొన్న కలెక్టర్ మను చౌదరి..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మార్చి 13: రాష్ట్రంలో ఎల్‌పీజీ గ్యాస్ కొరత ఉందన్న వదంతులతో ప్రజల్లో ఆందోళన పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. గ్యాస్ కొరతపై వస్తున్న ప్రచారాలను నమ్మి వినియోగదారులు గందరగోళానికి గురికావొద్దని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.. గృహ వినియోగదారులకు అవసరమైనంత గ్యాస్ సరఫరా అందుబాటులో ఉందని, బ్లాక్ మార్కెటింగ్ లేదా అక్రమ నిల్వలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.. శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రలతో కలిసి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని "బాటిలింగ్ ప్లాంట్ల"లో ఎక్కడా గ్యాస్ కొరత నమోదు కాలేదని తెలిపారు.. అయితే వదంతుల కారణంగా వినియోగదారులు భారీగా సిలిండర్లు బుక్ చేయడంతో రోజువారీ బుకింగ్స్ సుమారు 72 శాతం వరకు పెరిగినట్లు వెల్లడించారు.. పరిస్థితిని సమీక్షించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హై లెవల్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు..

రాష్ట్రంలో గ్యాస్ కొరత లేదని ప్రభుత్వం స్పష్టంగా చెబుతున్నప్పటికీ, సోషల్ మీడియా వదంతులు మరియు అక్రమ నిల్వల ప్రయత్నాలు వినియోగదారుల్లో అనవసర భయాన్ని పెంచుతున్నాయి. దీనివల్ల సాధారణ వినియోగదారులకు సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ పరిస్థితిని అదుపులో ఉంచేందుకు ప్రభుత్వం ఒకవైపు కఠిన చర్యలు తీసుకుంటుండగా, మరోవైపు ప్రజలకు అవగాహన కల్పించడంపై కూడా దృష్టి సారించింది. అపోహలను నమ్మకుండా, అవసరానికి తగినంత మాత్రమే సిలిండర్లు బుక్ చేసుకోవాలని ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది..

ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎం.మను చౌదరి, అడిషనల్ కలెక్టర్ డి.విజయేందర్‌రెడ్డి..

గ్యాస్ నిల్వలు- బ్లాక్ మార్కెట్‌కి తరలింపుపై హెచ్చరిక..

గ్యాస్ సరఫరాలో గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, విద్యాసంస్థలు, వృద్ధాశ్రమాలు, ప్రభుత్వ సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. అలాగే తాజా ప్రచారాన్ని అడ్డుపెట్టుకుని గ్యాస్ నిల్వలు చేయడం, అక్రమంగా మళ్ళించడం, బ్లాక్ మార్కెటింగ్ చేయడం వంటి చర్యలపై ఇప్పటికే 288 కేసులు నమోదు చేసినట్లు మంత్రి వెల్లడించారు.. వినియోగదారులు అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేయవద్దని, పట్టణ ప్రాంతాల్లో 25 రోజులకు ఒకసారి, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒకసారి మాత్రమే బుకింగ్ చేసుకోవాలని సూచించారు..

మేడ్చల్ జిల్లాలో అప్రమత్తత:కలెక్టర్..

ఈ నేపథ్యంలో వీడియో కాన్ఫరెన్స్ అనంతరం మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి జిల్లా ఎనర్జీ సప్లయ్ మానిటరింగ్ కమిటీతో సమీక్ష నిర్వహించారు. బాట్లింగ్ ప్లాంట్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, సరఫరా వాహనాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.. జిల్లాలో 52 డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతున్నదని, డెలివరీలో సమస్యలు ఎదురైతే జిల్లా కంట్రోల్ రూమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 040-29700820 ను సంప్రదించాలని తెలిపారు.. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, డియమ్ సివిల్ సప్లయ్ సుగుణ బాయి , జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, జిల్లా హర్టీకల్చర్ అధికారి శ్రీధర్, ఎల్పిజి జిల్లా కొ-ఆర్డినేటర్, ఎల్పిజి సేల్స్ ఆఫీసర్ సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు..

అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ వీక్షిస్తున్న కలెక్టర్ మను..

మార్చిలోనే మండుతోంది

హైదరాబాద్, మార్చి 13, పెన్ పవర్:
ఈ ఏడాది కాస్త ముందుగానే వేసవి పలకరించింది. మార్చి నెల ఆరంభం నుంచే బాణుడు ప్రతాపం చూపుతున్నాడు. తొలిసారి దేశ వ్యాప్తంగా పలు చోట్ల వడగాల్పులు వీశాయి. ముఖ్యంగా ఉత్తర భారతంలోని గుజరాత్‌లోని సౌరాష్ట్ర, కచ్ ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు చేసుకున్నాయి. సౌరాష్ట్ర, కచ్ ప్రాంతాలలో చాలా చోట్ల, గుజరాత్‌లో కొన్ని చోట్ల వేడి గాల్పులు నెలకొన్నాయి. అటు విదర్భలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల ప్రారంభంలో విదర్భలో వేడి తరంగ పరిస్థితులు నమోదైనప్పటికీ, బుధవారం నాటికి దేశంలోని పశ్చిమ ప్రాంతాలలో మొదటిసారి అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు గుర్తించింది. వాతావరణ మార్పుల వల్ల శీతాకాలం వేసవి మధ్య వ్యవధి యేటా కుంచించుకుపోతున్నట్లు, దీని పర్యావసానమే వేసవి త్వరగా ఆగమిస్తున్నట్లు నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రాజస్థాన్ మీదుగా వీచే యాంటీ సైక్లోన్ వేడి గాలులను గుజరాత్ వైపుకు తీసుకువెళుతోంది. దీని వలన ఈ ప్రాంతంపై గాలి తగ్గిపోతుందని స్కైమెట్ వెదర్‌లో క్లైమాట్ అండ్ మెటీరియాలజీ వైస్ ప్రెసిడెంట్ మహేష్ పలావత్ అన్నారు. ఇది యేటా పునరావృతమవుతున్నట్లు ఆయన తెలిపారు. మరోషాకింగ్ విషయం ఏమంటే.. వసంత కాలం కనుమరుగవుతుంది. శీతాకాలం నుంచి వేసవికి మార్పు చాలా త్వరగా జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ఇటీవలి సంవత్సరాల్లో ఈ ధోరణి అధికంగా కనిపిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రస్తుతం గుజరాత్, పశ్చిమ రాజస్థాన్, విదర్భ ప్రాంతాలలో చాలా చోట్ల, మధ్యప్రదేశ్, మరాఠ్వాడ ప్రాంతాలలో కొన్ని చోట్ల, ఛత్తీస్‌గఢ్, ఒడిశా ప్రాంతాలలో కొన్ని చోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు 38 నుంచి 42 డిగ్రీల సెంటిగ్రేట్ పరిధిలో ఉన్నాయి. ఢిల్లీలో గరిష్ట ఉష్ణోగ్రతలు 35 నుంచి 38ళీసెంటిగ్రేట్ మధ్య ఉన్నాయి. హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, పశ్చిమ రాజస్థాన్, తూర్పు రాజస్థాన్, పంజాబ్, గుజరాత్, సౌరాష్ట్ర, కచ్‌లలో చాలా చోట్ల పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5.1 డిగ్రీలకుపైగా ఉన్నాయి. ఉప-హిమాలయ పశ్చిమ బెంగాల్,

సిక్కింలలో చాలా చోట్ల, మధ్య మహారాష్ట్ర, తీర కర్ణాటకలో కొన్ని చోట్ల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3.1 నుంచి 5.0 డిగ్రీల సెంటిగ్రేట్ వరకు గణనీయంగా ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. మార్చిలో ఇటువంటి వేడిగాలులు సాధారణమేనని, దీనిని ముందుగానే అంచనా వేశామని ×వీణ డైరెక్టర్ జనరల్ ఎం మోహపాత్ర అన్నారు.గుజరాత్‌లో వేడిగాలులు, తీవ్రమైన వేడిగాలులు కొనసాగే అవకాశం ఉంది. అరుణాచల్ ప్రదేశ్‌లో మార్చి 12 నుంచి14 తేదీలలో, అస్సాం, మేఘాలయలో మార్చి 13 నుంచి 15 తేదీలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఇక మైదాన ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరినప్పుడు, పగటి ఉష్ణోగ్రత సాధారణం కంటే 4.5 డిగ్రీలు అధికంగా ఉంటే వడగాలులు వీస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. వేసవి త్వరగా ప్రారంభం కావడం వల్ల దేశ వ్యాప్తంగా విద్యుత్ మౌలిక సదుపాయాలపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ ఏడాది 2024 కంటే తీవ్రంగా ఎండలు ఉండే అవకాశం ఉంది. కేవలం భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకావం ఉందని, దీంతో విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.భారత్ చమురు, గ్యాస్ అవసరాలలో 85 శాతం విదేశీ సరఫరాదారులపై ఆధారపడి ఉంది. ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఇంధన దిగుమతులు దెబ్బతినడంతో ప్రస్తుత గ్యాస్ అవసరంలో 25 శాతం కోరత ఏర్పడినట్లు పెట్రోలియం, గ్యాస్ మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు తెలిపారు.

2050 నాటికి భాగ్యనగరానికి 4 లక్షల కోట్ల ప్రణాళిక

హైదరాబాద్ మార్చి 13, పెన్ పవర్:
హైదరాబాద్ నగరం రూపురేఖలు మార్చేందుకు హెచ్ఎండీఏ అనేక రకాల ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నగరంలో మెట్రోను భారీగా విస్తరించాలని భావిస్తోంది. నగరం నడిబొడ్డున మూసీ నదిపై భారీగా వంతెనలు నిర్మించనున్నట్లు తెలిపింది. ఇవే కాకుండా నగరంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, స్కైవాక్లు, రోడ్ల విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్లు, బ్రిడ్జిలు సహా సమగ్ర అభివృద్ధికి సంబంధించి ప్లాన్లు రెడీ చేస్తోంది.ప్రపంచంలోనే హైదరాబాద్ ఒక మహా నగరంగా అవతరిస్తోంది. గత 10 ఏళ్లలో హైదరాబాద్ రూపురేఖలే మారిపోయాయి. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వరకు శరవేగంగా విస్తరించిన హైదరాబాద్ మహా నగరం.. మరింతగా వ్యాపిస్తోంది. ఈ నేపథ్యంలోనే దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచే కాకుండా.. ప్రపంచ దేశాల నుంచి కూడా ప్రజలు ఇక్కడికి వచ్చి ఉద్యోగం, ఉపాధి, విద్య వంటి అవసరాల కోసం జీవిస్తున్నారు. ఈ క్రమంలోనే భవిష్యత్ అవసరాలకు తగ్గట్లుగా ప్రభుత్వాలు.. హైదరాబాద్లో మౌలిక సదుపాయాలను కూడా అదే వేగంతో కల్పిస్తున్నాయి. అయినప్పటికీ నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ఈ నేపథ్యంలోనే రానున్న రోజుల్లో మరింత మంది ప్రజలు, వాహనాలు పెరిగిపోతాయనే అంచనాలతో ట్రాఫిక్ రద్దీని నిర్వహించేందుకు మౌలిక వసతులను సర్కార్ కల్పిస్తోంది.2050 నాటికి హైదరాబాద్ మహా నగరాన్ని ఏ విధంగా మార్చాలి అనే దానిపై హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) సమగ్ర రవాణా వ్యవస్థపై కీలక ప్రణాళికను రెడీ చేసింది. 2050 నాటికి హైదరాబాద్ నగరంలో మెట్రో నెట్వర్క్ను ఏకంగా 556.6 కిలోమీటర్ల మేర విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం దాదాపు 70 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరించి ఉండగా.. రెండో విడతలో భాగంగా మరో 150 కిలోమీటర్ల వరకు విస్తరించేందుకు

అనుమతులు లభించాయి.ఇక మల్టీ మోడల్ ట్రాన్స్పోర్టు సిస్టమ్ (ఎంఎంటీఎస్) నెట్వర్క్ను 336.4 కిలోమీటర్ల వరకు పెంచాలని హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. ఇక హైదరాబాద్ నగరంలో రోడ్ల నెట్వర్క్ను 19,352 కిలోమీటర్లకు విస్తరించాలని భావిస్తోంది. అదే సమయంలో నగరంలో కొత్తగా 120 ఫుట్ ఓవర్ బ్రిడ్జు, స్కైవాక్ల నిర్మాణానికి హెచ్ఎండీఏ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.ఇవే కాకుండా 34 రైల్వే ఓవర్ బ్రిడ్జిలు (ఆర్వోబీలు), 16 రైల్ అండర్ బ్రిడ్జిలు (ఆర్యూబీలు), 8 ఎలివేటెడ్ రోడ్లను నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేసినట్లు హెచ్ఎండీఏ అధికారులు వెల్లడించారు. అదే సమయంలో హైదరాబాద్ నగరం మధ్య నుంచి వెళ్తున
న్న మూసీ నదిపై 29 బ్రిడ్జిలను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. 2050 నాటికి ప్రత్యేక బస్ లైన్ల కోసం 48 కిలోమీటర్ల మేర రోడ్ కారిడార్లను గుర్తించినట్లు తెలిపారు. 7 అంతర్రాష్ట్ర బస్సు, ట్రక్ టెర్మినల్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అయితే 2050 హైదరాబాద్ నగర సమగ్ర రవాణా వ్యవస్థ ప్రణాళిక కోసం రూ.4 లక్షల కోట్లు అవసరం అవుతాయని హెచ్ఎండీఏ అంచనాలు వేస్తోంది.

గ్రేటర్ లో పన్నుల్లో భారీ రాయితీలు

హైదరాబాద్ మార్చి 13, పెన్ పవర్:
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పెండింగ్లో ఉన్న ఆస్తి పన్ను బకాయిలపై ఏకంగా 90 శాతం వడ్డీ మాఫీ చేస్తూ వన్ టైమ్ సెటిల్మెంట్ పథకాన్ని ప్రకటించింది. పాత బకాయిల మీద పేరుకుపోయిన భారీ వడ్డీ భారాన్ని తగ్గించుకోవడానికి ఇది నగరవాసులకు ఒక సువర్ణావకాశం. ఈ ప్రయోజనాన్ని పొందాలనుకునే వారు మార్చి 31, 2026 లోపు తమ బకాయిలను చెల్లించాల్సి ఉంటుంది.పన్ను చెల్లింపుదారులు తమ సౌలభ్యం మేరకు వివిధ మార్గాల్లో ఈ నగదును చెల్లించవచ్చు. జీహెచ్ఎంసీ అధికారిక వెబ్సైట్ , మొబైల్ యాప్ల ద్వారా ఆన్లైన్లో సులభంగా చెల్లింపులు చేయవచ్చు. ఇవే కాకుండా, నేరుగా మీ-సేవా కేంద్రాలు , సిటిజన్ సర్వీస్ సెంటర్లకు వెళ్లి కూడా బకాయిలు చెల్లించి ఈ 90 శాతం వడ్డీ రాయితీని పొందవచ్చని అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా దీర్ఘకాలంగా పన్ను చెల్లించని వారికి వడ్డీ అసలు కంటే ఎక్కువగా పెరిగిపోయిన సందర్భాల్లో ఈ ఓటీఎస్ పథకం పెద్ద ఊరటనిస్తుంది. ప్రభుత్వం నిర్దేశించిన ఈ గడువు ముగిసిన తర్వాత మళ్లీ ఇటువంటి రాయితీలు ఉండకపోవచ్చని, కాబట్టి జాప్యం చేయకుండా త్వరితగతిన పన్ను కట్టాలని అధికారులు సూచిస్తున్నారు. సకాలంలో పన్నులు చెల్లించడం ద్వారా నగర ప్రజలు తమ బాధ్యతను నెరవేర్చడమే కాకుండా, నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరుతున్నారు.నగరంలో రోడ్ల నిర్మాణం, పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల వంటి మౌలిక సదుపాయాలన్నీ ప్రజలు కట్టే పన్నుల ద్వారానే సాధ్యమవుతాయి. అందుకే సకాలంలో ఆస్తి పన్ను చెల్లించండి.. మన నగరాభివృద్ధికి తోడ్పడండి అనే నినాదంతో ప్రభుత్వం ఈ ప్రచారాన్ని చేపట్టింది. ఈ ప్రత్యేక రాయితీని వినియోగించుకుని పన్ను బకాయిల చిక్కుల నుంచి బయటపడాలని జీహెచ్ఎంసీ కమిషనర్ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పంచాయతీని సందర్శించిన: విద్యాలత

సత్తుపల్లి, మార్చి 13 పెన్ పవర్: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి డిప్యూటీ కమిషనర్ విద్యాలత ఇల్లందు మండలం సూదమల్ల గ్రామ పంచాయతీని శుక్రవారం సందర్శించారు. 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గ్రామంలో పచ్చదనం, పారిశుద్ధ్యం పకడ్బందీగా నిర్వహించాలని, లైన్ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

రంజాన్ తోఫా పంపిణీ చేసిన ఎమ్మెల్యే

మధిర, మార్చి 13 పెన్ పవర్: దమ్మపేట మండల తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం రంజాన్ తోఫా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు పట్టుచీరలు, కుర్తా, పైజామా బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నందుకు సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, స్థానిక షాదీ ఖానా పునర్నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

మొల్లమాంబ జయంతి వేడుకలు

వైరా, మార్చి 13 పెన్ పవర్: శుక్రవారం మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తొలి తెలుగు మహిళా కవయిత్రి శ్రీ కుమ్మర మొల్లమాంబ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. రామాయణాన్ని సామాన్య ప్రజలకు సైతం సులభంగా అర్థమయ్యేలా తేటతెలుగులో అనువదించిన ధన్య జీవి కుమ్మర మొల్లమాంబ అని ఎమ్మెల్యే కొనియాడారు.

మందికి విద్యార్థులకు అశ్వస్థ

పాలేరు, మార్చి 13 పెన్ పవర్: దమ్మపేట మండలం గండుగలపల్లిలోని ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలో చికెన్ తిన్న 390 మంది విద్యార్థుల్లో 27 మందికి వాంతులు, విరోచనాలు అయ్యాయి. తీవ్ర అస్వస్థతకు గురైన ఇద్దరు విద్యార్థులను సత్తుపల్లికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం పాఠశాలకు వెళ్లి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

వరంగల్ లో లింగ నిర్ధారణ, అబార్షన్లు పెరిగిపోతున్నాయి!

వరంగల్ వెస్ట్, మార్చి 13 పెన్ పవర్: వరంగల్ జిల్లాలో లింగ నిర్ధారణ, పిండ హత్యలు విపరీతంగా పెరిగిపోతున్నాయని వార్తలు వస్తున్నాయి. స్కానింగ్ సెంటర్లు డబ్బులకు అమ్ముడుపోయి, కోడ్ భాషలో ఆడ, మగ అని చెప్పేస్తున్నాయని సమాచారం. గత రెండేళ్లలో 1500కు పైగా అక్రమ అబార్షన్లు జరిగినట్లు తెలుస్తోంది. వైద్య ఆరోగ్యశాఖ, శిశు సంక్షేమ శాఖ, పోలీసులు డెకాయి ఆపరేషన్లు నిలిపివేయడంతో కొన్ని ఆసుపత్రులు మధ్యవర్తుల ద్వారా అడ్డదారుల్లో లింగ నిర్ధారణ, అబార్షన్లు నిర్వహిస్తున్నాయని నివేదికలు సూచిస్తున్నాయి.

పాలకుర్తిలో ఉచిత గాలి కుంటా టీకాల కార్యక్రమం ప్రారంభం

పాలకుర్తి, మార్చి 13 పెన్ పవర్: పాలకుర్తి నియోజకవర్గంలో పశువైద్య మరియు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గాలి కుంటా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, జనగాం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమక్షంలో ఈ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. పశుసంవర్ధక రంగం రైతులకు ముఖ్యమైన ఆదాయ వనరు అని, పశువుల ఆరోగ్యం కాపాడటం చాలా ముఖ్యమని, గాలి కుంటా వంటి అంటువ్యాధులు సోకితే తీవ్ర నష్టం కలుగుతుందని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తెలిపారు. వ్యాప్తిని అరికట్టడానికి ప్రతి గ్రామంలో వైద్య బృందాలు టీకాలు వేయడానికి వెళ్తాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పశువుల ఆరోగ్యం బాగుంటేనే పాల ఉత్పత్తి పెరిగి రైతులకు అదనపు ఆదాయం వస్తుందని ఆమె పేర్కొన్నారు.

పంట రక్షణ పద్ధతులపై రైతులకు సూచనలు

నర్సంపేట, మార్చి 13 పెన్ పవర్: నర్సంపేట మండలం నల్లబెల్లి గ్రామానికి చెందిన రైతు కుమార్, శాంభవి సీడ్స్ డిహెచ్-633 రకం మొక్కజొన్నను సాగు చేశారు. ఈ సందర్భంగా శాంభవి ఆగ్రి సీడ్స్ కంపెనీ వారు పంట రక్షణ పద్ధతులపై శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం మేనేజర్ అఖిల్ సాయి గౌడ్ పంటను పరిశీలించి రైతులకు సూచనలు సలహాలు అందించారు. మంచి దిగుబడి సాధించినందుకు కుమార్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ హరికృష్ణ, ఎండిఓ వంశీ, శ్రీనివాస ఫర్టిలైజర్ డీలర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీలకు మణికంఠ

వరంగల్ ఈస్ట్, మార్చి 13 పెన్ పవర్: వరంగల్ కు చెందిన ప్రముఖ మార్షల్ ఆర్ట్స్ కోచ్ మణికంఠ గడదాసు, జపాన్ లో జరగనున్న ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్షిప్-2026కు ంపికయ్యారు. ఈ విషయాన్ని డబ్ల్యూఎఫ్ఎస్ కేఓ ఇండియా అధ్యక్షుడు హసన్ ఇస్మాయిల్, తెలంగాణ అధ్యక్షుడు చంద్రశేఖర్ ప్రకటించారు. జూలై 4, 5 తేదీల్లో జపాన్ లోని నకగావా నగరంలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మణికంఠను పలువురు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

రెండో దశ భద్రకాళి చెరువు పూడికతీత పనులు ప్రారంభం

వర్ధన్నపేట, మార్చి 13 పెన్ పవర్: వరంగల్‌లో రూ.20 కోట్లతో రెండో దశ భద్రకాళి చెరువు పూడికతీత పనులను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భద్రకాళి చెరువులో రోప్‌వే కోసం టెండర్‌ను పిలిచినట్లు చెప్పారు. వరంగల్, హనుమకొండ జిల్లాల అభివృద్ధికి అధికారులు, నాయకులు సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. చెరువులో 200 లారీల ద్వారా 24 గంటలు పూడికతీత పనులు జరుగుతున్నాయన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా నగరం ముంపునకు గురైనట్లు చెప్పారు. వర్షాకాలం నాటికి పూడికతీత పనులు పూర్తి చేసి, చెరువులో నీళ్లు నింపుతామని వెల్లడించారు.

చిల్పూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు

పరకాల, మార్చి 13 పెన్ పవర్: జనగామ జిల్లా చిల్పూర్ గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వరస్వామి పాలక మండలి ప్రమాణ స్వీకారం జరగనుంది. ఈ కార్యక్రమానికి హాజరుకానున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరికి బీఆర్ఎస్ కండువాలతో స్వాగతం పలకాలని ఆ పార్టీ పిలుపునిచ్చింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా పోలీసులు భారీగా మోహరించారు. అడుగడుగునా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకుంటున్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

నర్సంపేట, మార్చి 13 పెన్ పవర్: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు దుర్మరణం చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై కోటేశ్వరరావు కథనం ప్రకారం... మరిపెడ మండలం గాలివారిగూడేనికి చెందిన బల్లెం ఉదయ్ కిరణ్ (22), భిక్షం (21) చిన్ననాటి నుంచి స్నేహితులు. వీరిద్దరు ద్విచక్ర వాహనంపై ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా మరిపెడ మండలం లచ్చాతండా సమీపంలోని జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు.

స్కూల్లో గ్యాస్ లీక్.. తప్పిన పెను ప్రమాదం

ఆదిలాబాద్, మార్చి 13 పెన్ పవర్: ఆదిలాబాద్‌లోని మరాఠీ మీడియం పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనం తయారుచేస్తున్న సమయంలో గ్యాస్ సిలిండర్ లీక్ అయి మంటలు చెలరేగాయి. అదృష్టవశాత్తూ, వంట సిబ్బంది అప్రమత్తమై బయటకు రావడంతో ప్రాణనష్టం తప్పింది. పాఠశాల సిబ్బంది, కౌన్సిలర్ బోడిగం శ్రీకాంత్, పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సిలిండర్‌ను సురక్షితంగా బయటకు తరలించారు. డీఈవో కార్యాలయం ఆవరణలోనే ఈ సంఘటన జరగడంతో అందరూ ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు.

అడిషనల్ డీజీపీని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్, ఎస్పీ

నిర్మల్, మార్చి 13 పెన్ పవర్: నిర్మల్ జిల్లాలో అడిషనల్ డీజీపీ (బెటాలియన్) సంజయ్ కుమార్ జైన్‌ను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక అటవీశాఖ వసతి గృహంలో జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్, అడిషనల్ డీజీపీకి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ సాయికిరణ్, డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడేతో పాటు పలువురు అధికారులు కూడా పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

ముథోల్, మార్చి 13 పెన్ పవర్: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిర్మల్ పట్టణంలోని నాయుడువాడలో కౌన్సిలర్ సాదం స్వప్న అరవింద్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వాటర్ సప్లై, వీధి దీపాల సమస్యలను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, అధికారులు సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్, వార్డు ఆఫీసర్ కార్తీక్, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్మశాన వాటికలో సమస్యలు పరిష్కరిస్తాం

ఖానాపూర్, మార్చి 13 పెన్ పవర్: నిర్మల్ జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్ స్మశానవాటికలో పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పిస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి తెలిపారు. శుక్రవారం అధికారులతో కలిసి స్మశానవాటికను సందర్శించిన ఆయన, అంత్యక్రియల సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాలుగు రోజుల్లో నీటి సౌకర్యం, పారిశుద్ధ్యం మెరుగుపరుస్తామని, మూడు నెలల్లో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు.

మూడు కార్లు ఢీ.. ముగ్గురికి గాయాలు

బోథ్, మార్చి 13 పెన్ పవర్: నిర్మల్ పట్టణ శివారు సోఫినగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. పెళ్లికి వచ్చిన వారు షాపింగ్ కోసం నిర్మల్ వెళ్తుండగా, అకస్మాత్తుగా ఓ కారు రహదారిపైకి రావడంతో ఈ ప్రమాదం జరిగింది. వెనుక నుంచి అతివేగంగా వచ్చిన మరో కారు ఢీకొట్టడంతో మధ్యలో ఉన్న కారు ముందు, వెనుక భాగాలు నుజ్జునుజ్జు అయ్యాయి. ఈ ప్రమాదంలో 3 ఏళ్ల పాప మొహిరతో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన తీరు సీసీటీవీలో రికార్డ్ అయ్యింది.

నారాయణపూర్ గ్రామంలో ఉద్రిక్తత!

కరీంనగర్, మార్చి 13 పెన్ పవర్: కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ గ్రామంలో గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. తమ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రిజర్వాయర్ నిండితే తమ ఇళ్లు మునిగిపోతాయని, సర్వం కోల్పోతామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని పాలకులు విస్మరించారని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఐదుగురి మృతి.. విషాదంలో కుటుంబాలు

మానకొండూరు, మార్చి 13 పెన్ పవర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిన్న వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురు మృతి చెందారు. జమ్మికుంటలోని ఆర్‌వోబీ ఫ్లైఓవర్‌పై నుంచి దూకి రాం శివరాజ్(28), ధర్మారం మండలం నర్సింహులపల్లికి చెందిన శంకరయ్య (73), కోనాయిపల్లి శివారులో రాజూరి వీరాచారి(40), జమ్మికుంటకు చెందిన కర్రయ్యలు ఉరి వేసుకొని, మంథని మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గోబు తిరుపతి (30) మృతి చెందారు. ఈ సంఘటనలు జిల్లాలో విషాదాన్ని నింపాయి.

శ్రీవారి సేవలో వేములవాడ ఎమ్మెల్యే ఆది

వేములవాడ, మార్చి 13 పెన్ పవర్: వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కలియుగ దైవం తిరుమల తిరుపతి స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం నిరంతరాయంగా స్వామివారి కృపతో జరగాలని కోరుకున్నట్లు చెప్పారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా జరగాలని స్వామివారిని వేడుకున్నట్లు ఆయన మీడియాకు వెల్లడించారు.

బంగారు ఆభరణాలు విక్రయించే దుకాణాల్లో చోరీ

హుజూరాబాద్, మార్చి 13 పెన్ పవర్: జగిత్యాల జిల్లా కోరుట్ల, మెట్‌పల్లి పట్టణంలోని జ్యువెలరీ దుకాణాల్లో అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీ జరిగింది. గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు మెట్‌పల్లిలోని ఓ దుకాణంలో 30 గ్రాముల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. కోరుట్లలోని మరో దుకాణం షట్టర్ తలుపులు తెరుచుకోక పోవడంతో వెనుదిరిగారు. ఉదయం దుకాణ యజమానులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమస్యల పరిష్కారంపై వినతి

ఖమ్మం, మార్చి 13 పెన్ పవర్: శుక్రవారం, బూర్గంపాడు కృష్ణసాగర్ గ్రామ సర్పంచ్ తాటి వాణి, గ్రామస్థులతో కలిసి మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులకు టెండర్లను ప్రకటించాలి

చొప్పదండి, మార్చి 13 పెన్ పవర్: కరీంనగర్‌లో విలీనమైన గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం నగర పాలక సంస్థ టెండర్లు నిర్వహించి మూడు నెలలు అవుతున్నా.. వాటిని అధికారులు ప్రకటించకపోవడం ఏంటని మాజీ మేయర్ రవీందర్ సింగ్ పేర్కొన్నారు. కరీంనగర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది 87 అభివృద్ధి పనులకు రూ.50 కోట్ల నిధులు కేటాయించి ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం జీఓ జారీ చేసిందని చెప్పారు. ఈ ఏడాది జనవరిలో పనులకు టెండర్లు నిర్వహించిన అధికారులు.. మూడు నెలలు గడుస్తున్నా వాటిని ఓపెన్ చేయడం లేదన్నారు. ఇటీవల లెటర్ ఆఫ్ యాక్సెప్ట్ లేకుండానే అభివృద్ధి పనిని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎలా ప్రారంభించారని ప్రశ్నించారు. కాంగ్రెస్, భాజపాలు కుమ్మక్కై బేరసారాలకు పాల్పడుతూ టెండర్లు ఓపెన్ చేయకుండా అడ్డుకుంటున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించి నిలిపిన టెండర్లను ప్రకటించాలని కోరారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

ఆత్మవిశ్వాసంతోనే పరీక్షల్లో విజయం

హైదరాబాద్ పెన్ పవర్: ప్రతి విద్యార్థి విద్యా ప్రయాణంలో పదవ తరగతి బోర్డు పరీక్షలు అత్యంత కీలకమైన దశగా భావించబడతాయి. విద్యార్థి భవిష్యత్ విద్యా దిశను నిర్దేశించే ఈ పరీక్షలు కేవలం మార్కుల పోటీ మాత్రమే కాకుండా క్రమశిక్షణ, సమయ పాలన, మానసిక స్థైర్యం, శ్రద్ధ వంటి విలువలను కూడా పరీక్షిస్తాయి. ఈ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలంటే కేవలం చదువు మాత్రమే సరిపోదు. చదువు విధానం, సమయ నిర్వహణ, ప్రశ్నలకు సమాధానాలు రాయడంలో సరైన పద్ధతి, పరీక్ష అనంతరం సమాధానాలను పరిశీలించుకునే అలవాటు వంటి అంశాలు కూడా సమానంగా అవసరం. పరీక్షల సమయంలో చాలా మంది విద్యార్థులు ఆందోళన, భయం, ఒత్తిడి వంటి భావోద్వేగాలకు లోనవుతుంటారు. అయితే పరీక్షలను భయపడాల్సిన అవసరం లేదు. సరైన ప్రణాళికతో, క్రమబద్ధమైన చదువుతో, సమయపాలనతో ముందుకు సాగితే పరీక్షలు సులభంగా ఎదుర్కోవచ్చు. విద్యార్థులు ముందుగా పరీక్షలను ఒక బాధ్యతగా కాకుండా ఒక అవకాశంగా చూడాలి. తమ సామర్థ్యాన్ని నిరూపించుకునే వేదికగా భావిస్తే భయం తగ్గి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. పరీక్షలకు ముందు పునశ్చరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. పాఠ్యాంశాన్ని మొదటిసారి చదవడం ఒక దశ అయితే, దాన్ని మళ్లీ మళ్లీ పునశ్చరణ చేయడం ద్వారానే అది మనసులో స్థిరపడుతుంది. ముఖ్యమైన సూత్రాలు, నిర్వచనాలు, గణిత సమీకరణాలు, తేదీలు, చారిత్రక సంఘటనలు వంటి అంశాలను చిన్న నోట్ల రూపంలో రాసుకొని తరచుగా చదవడం చాలా ఉపయోగకరం. దీనివల్ల పరీక్షల సమయంలో త్వరగా గుర్తు చేసుకునే అవకాశం ఉంటుంది. పరీక్షల సమయంలో సమయ నిర్వహణ అత్యంత కీలకమైన అంశం. ప్రశ్నాపత్రం చేతికి వచ్చిన వెంటనే తొందరపడి రాయడం ప్రారంభించకుండా మొదట కొన్ని నిమిషాలు తీసుకొని మొత్తం ప్రశ్నా పత్రాన్ని పూర్తిగా చదవాలి. అందులోని ప్రశ్నల స్వభావం, మార్కుల విభజన, ఎంపిక ప్రశ్నలు వంటి అంశాలను అర్థం చేసుకోవాలి. తదనంతరం ఏ ప్రశ్నకు ఎంత సమయం కేటాయించాలో ముందుగానే నిర్ణయించు కోవాలి. సాధారణంగా ఎక్కువ మార్కులున్న ప్రశ్నలకు కొంత ఎక్కువ సమయం కేటాయించాలి. అయితే ఒక్క ప్రశ్నపైనే ఎక్కువ సమయం ఖర్చు చేయకుండా సమతౌల్యం పాటించడం అవసరం. విద్యార్థులు ముందుగా బాగా తెలిసిన ప్రశ్నలతో సమాధానాలు రాయడం ప్రారంభిస్తే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మొదటి కొన్ని సమాధానాలు సులభంగా రాయగలిగితే మిగిలిన ప్రశ్నలకు సమాధానాలు రాయడంలో కూడా ఉత్సాహం పెరుగుతుంది. తెలియని ప్రశ్నలపై ఎక్కువగా ఆలోచిస్తూ సమయాన్ని వృథా చేయకుండా, తాత్కాలికంగా వదిలి తరువాత ప్రయత్నించడం ఉత్తమం. సమాధానాలను రాయడంలో స్పష్టత, క్రమబద్ధత, సరళత ఎంతో ముఖ్యమైనవి. పరీక్షా పత్రాన్ని మూల్యాంకనం చేసే ఉపాధ్యాయులు సమాధానాలను సులభంగా అర్థం చేసుకునే విధంగా రాయాలి. అర్థం కాని రీతిలో పొడవుగా రాయడం కన్నా సూటిగా, స్పష్టంగా, పాయింట్ల రూపంలో రాయడం ఉత్తమం. ముఖ్యమైన పదాలను అండర్లైన్ చేయడం, ఉపశీర్షికలుగా విభజించడం, అవసరమైన చోట చార్టులు లేదా చిత్రాలు గీయడం ద్వారా సమాధానాన్ని మరింత స్పష్టంగా చేయవచ్చు.అక్షరాల స్పష్టత కూడా మంచి మార్కులు పొందడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కొంతమంది విద్యార్థులు త్వరగా రాయాలనే ఆలోచనతో అక్షరాలను గందరగోళంగా రాస్తారు. దీనివల్ల పరీక్షా పత్రాన్ని చదవడం మూల్యాంకనాధికారులకు కష్టమవుతుంది. అందువల్ల వేగం మరియు స్పష్టత మధ్య సమతౌల్యం పాటించాలి. ప్రతి పదం చదవడానికి సులభంగా ఉండేలా రాయడం మంచిది. గణిత శాస్త్రం మరియు విజ్ఞాన శాస్త్రాల వంటి విషయాల్లో ప్రతి దశను స్పష్టంగా చూపించడం చాలా ముఖ్యమైనది. కేవలం తుది సమాధానం రాయడం మాత్రమే సరిపోదు. సమస్యను పరిష్కరించే ప్రతి దశను క్రమపద్ధతిలో చూపిస్తే పూర్తి మార్కులు పొందే అవకాశం ఉంటుంది. అదే విధంగా విజ్ఞాన శాస్త్రంలో అవసరమైన చిత్రాలు, లేబుల్స్ సరిగా గీయడం కూడా మంచి మార్కులకు దోహదపడుతుంది. సమాధాన పత్రంలో తప్పులను తగ్గించడానికి విద్యార్థులు చివరి కొన్ని నిమిషాలను తప్పనిసరిగా సరి చూసుకోవడానికి కేటాయించాలి. తొందరలో రాసినప్పుడు కొన్ని చిన్న తప్పులు జరగడం సహజం. సంఖ్యలలో పొరపాట్లు, పదాల తప్పులు, ప్రశ్న నంబర్లలో గందరగోళం వంటి లోపాలు ఉండే అవకాశం ఉంటుంది. పరీక్ష సమయం ముగిసే ముందు సమాధాన పత్రాన్ని పూర్తిగా పరిశీలిస్తే ఈ తప్పులను సరిచేసుకునే అవకాశం ఉంటుంది. పరీక్షల సమయంలో మానసిక ప్రశాంతత కూడా అత్యంత అవసరం. ఒత్తిడిని తగ్గించడానికి విద్యార్థులు సరైన నిద్ర, సమతుల్య ఆహారం తీసుకోవాలి. రాత్రి పొద్దుపోయే వరకు చదివి అలసటకు గురికావడం కన్నా, క్రమబద్ధమైన విశ్రాంతి తీసుకోవడం ఉత్తమం. ఆరోగ్యకరమైన శరీరంలోనే చురుకైన మనస్సు ఉంటుంది అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.పరీక్షల ముందు రోజు కొత్త పాఠాలను చదవడం కన్నా ఇప్పటికే చదివిన విషయాలను పునశ్చరణ చేయడం మంచిది. కొత్త విషయాలను చదవడం వల్ల గందరగోళం పెరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల ఇప్పటికే నేర్చుకున్న అంశాలను మళ్లీ ఒకసారి గుర్తు చేసుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.పరీక్షా కేంద్రానికి సమయానికి ముందుగానే చేరుకోవడం కూడా చాలా ముఖ్యమైన అంశం. ఆలస్యంగా రావడం వల్ల తొందర, ఆందోళన పెరుగుతుంది. పరీక్ష ప్రారంభానికి కనీసం అరగంట ముందే కేంద్రానికి చేరుకుంటే మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. అవసరమైన హాల్ టికెట్, పెన్నులు, పెన్సిళ్లు, గణక యంత్రం (అనుమతి ఉన్నపక్షంలో) వంటి వస్తువులను ముందుగానే సిద్ధం చేసుకోవాలి. ఇతర విద్యార్థులతో పోల్చుకోవడం కూడా అనవసరమైన ఒత్తిడిని పెంచుతుంది. ప్రతి విద్యార్థికి తనకు తానుగా చదివే విధానం ఉంటుంది. ఇతరులు ఎంత చదివారనే విషయంపై ఆలోచించకుండా తాము ఎంత సమర్థంగా సిద్ధమయ్యామనే విషయంపై దృష్టి పెట్టాలి. ఆత్మవిశ్వాసం, పట్టుదల ఉంటే ఏ పరీక్షనైనా విజయవంతంగా ఎదుర్కోవచ్చు. తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల పాత్ర కూడా ఇక్కడ ముఖ్యమైనది. వారు విద్యార్థులపై అనవసర ఒత్తిడి లేకుండా ప్రోత్సహించాలి. విద్యార్థుల్లో నమ్మకం పెంచే విధంగా మాట్లాడాలి. పరీక్షలు జీవితంలో ఒక దశ మాత్రమే కానీ అంతిమ గమ్యం కాదని వారికి తెలియజేయాలి. మొత్తానికి పదవ తరగతి బోర్డు పరీక్షలు విద్యార్థి జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి. సరైన ప్రణాళిక, సమయపాలన, పునశ్చరణ, సమాధానాల స్పష్టత, మానసిక ప్రశాంతత వంటి అంశాలను పాటిస్తే మంచి ఫలితాలు సాధించడం కష్టం కాదు. క్రమశిక్షణతో చదివి, ఆత్మవిశ్వాసంతో పరీక్షలను ఎదుర్కొంటే విజయ ద్వారం విద్యార్థుల ముందు తప్పకుండా తెరుచు కుంటుంది. ఈ దశలో సాధించిన విజయమే వారి భవిష్యత్ విద్యా ప్రయాణానికి బలమైన పునాది అవుతుంది.

ప్రపంచ ప్రగతికి పునాది గణితం

హైదరాబాద్ పెన్ పవర్: అంతర్జాతీయ గణిత దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 14న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే విశిష్టమైన శాస్త్రీయ దినోత్సవం. ఈ తేదీని 3/14గా సూచించడం వల్ల గణిత శాస్త్రంలో అత్యంత ప్రసిద్ధమైన స్థిరాంకం అయిన ? (పై) విలువ 3.14కు గుర్తుగా ఈ రోజును ఎంపిక చేశారు. గణితం మనిషి ఆలోచనా శక్తిని పదును పెట్టే, విజ్ఞాన శాస్త్రాలన్నింటికీ పునాది వేసే ప్రాథమిక శాస్త్రం. అందుకే ప్రపంచ దేశాలు గణితశాస్త్ర ప్రాధాన్యాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలనే ఉద్దేశంతో ఈ దినోత్సవాన్ని విశేషంగా నిర్వహిస్తున్నాయి. విద్యా వ్యవస్థలో గణిత శాస్త్రం పాత్ర, పరిశోధనల్లో దాని ప్రాముఖ్యత, ఆధునిక సాంకేతిక అభివృద్ధిలో దాని పాత్రను గుర్తుచేసే సందర్భమే అంతర్జాతీయ గణిత దినోత్సవం. గణితం మనిషి నాగరికతతో పాటు అభివృద్ధి చెందిన శాస్త్రం. ప్రాచీన కాలంలోనే సంఖ్యల అవసరం ఏర్పడింది. వ్యవసాయం, వ్యాపారం, భూమి కొలతలు, కాల గణన వంటి అవసరాల కారణంగా గణితానికి రూపుదిద్దుకుంది. క్రీస్తు పూర్వం 3000 సంవత్సరాలకే ఈజిప్టు, బాబిలోనియా నాగరికతల్లో సంఖ్యా విధానాలు, గణన విధానాలు కనిపించాయి. భూమి కొలతలు, పిరమిడ్ నిర్మాణాలు వంటి పనుల కోసం గణిత సూత్రాలను ఉపయోగించినట్లు చారిత్రక ఆధారాలు వెల్లడిస్తున్నాయి. తరువాత గ్రీకు తత్వవేత్తలు గణితాన్ని శాస్త్రీయ పద్ధతిలో అభివృద్ధి చేశారు. పిథాగరస్, యూక్లిడ్, ఆర్కిమిడీస్ వంటి శాస్త్రవేత్తలు గణిత సూత్రాలను రూపొందించి శాస్త్రీయంగా స్థిరపరిచారు. భారతదేశం కూడా గణితశాస్త్ర అభివృద్ధికి అపారమైన కృషి చేసింది. వేద కాలంలోనే సంఖ్యా విధానం, శూన్యం (సున్నా), దశాంశ పద్ధతి వంటి భావనలు భారతీయుల ద్వారా ప్రపంచానికి పరిచయం అయ్యాయి. ఆర్యభటుడు, భాస్కరాచార్యులు, బ్రహ్మగుప్తుడు వంటి మహా గణిత శాస్త్రవేత్తలు గణితంలో అపూర్వమైన పరిశోధనలు చేశారు. ముఖ్యంగా శూన్యం అనే భావనను గణితంలో వినియోగించడం భారతదేశం ప్రపంచానికి ఇచ్చిన గొప్ప కానుకగా పరిగణించబడుతుంది. తరువాత అరబ్ దేశాల ద్వారా ఈ గణిత పద్ధతులు యూరప్‌కు చేరి ఆధునిక గణితానికి పునాది అయ్యాయి. గణితంలో (పై) అనే స్థిరాంకం ప్రత్యేక ప్రాముఖ్యత కలిగి ఉంది. వృత్తం పరిధి మరియు వ్యాసం మధ్య నిష్పత్తిని సూచించే ఈ విలువ సుమారు 3.14159గా ఉంటుంది. అయితే సాధారణంగా 3.14గా తీసుకుంటారు. ప్రాచీన గణిత శాస్త్రవేత్తలు వృత్తాల కొలతలు తెలుసుకునే ప్రయత్నంలో ఈ విలువను కనుగొన్నారు. ఈ విలువను మొదటగా అంచనా వేసిన వారిలో బాబిలోనియన్, ఈజిప్టు శాస్త్రవేత్తలు ఉన్నారు. తరువాత గ్రీకు శాస్త్రవేత్త ఆర్కిమిడీస్ దీనిని మరింత ఖచ్చితంగా లెక్కించేందుకు ప్రయత్నించాడు. ఆధునిక కంప్యూటర్ల సహాయంతో ? విలువను లక్షల కోట్ల దశాంశ స్థానాల వరకు లెక్కించారు. 2021 నాటికి ? విలువను 62.8 ట్రిలియన్ దశాంశ స్థానాల వరకు గణించారని పరిశోధనలు తెలిపాయి.

మార్చి 14ను మొదటగా "పై డే"గా అమెరికాలో జరుపుకోవడం ప్రారంభమైంది. 1988లో అమెరికాలోని శాస్త్ర మ్యూజియం శాస్త్రవేత్త ల్యారీ షా ఈ రోజును పై డేగా జరుపుకోవాలని సూచించాడు. తరువాత ఈ ఆలోచన ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. అమెరికా కాంగ్రెస్ కూడా 2009లో మార్చి 14ను అధికారికంగా "పై డే"గా గుర్తించింది. అనంతరం గణిత శాస్త్ర ప్రాముఖ్యతను ప్రపంచ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలనే ఉద్దేశంతో ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ అయిన యునెస్కో 2019లో మార్చి 14ను అంతర్జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించింది. 2020 నుండి ప్రపంచ దేశాలు అధికారికంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. అంతర్జాతీయ గణిత దినోత్సవం లక్ష్యం గణితాన్ని కేవలం పాఠ్యాంశంగా కాకుండా జీవన విధానంగా అర్థం చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించడం. గణితం లేకుండా ఆధునిక ప్రపంచం ఊహించలేం. భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, ఇంజినీరింగ్, ఆర్థిక శాస్త్రం, కంప్యూటర్ సైన్స్, అంతరిక్ష పరిశోధనలు వంటి అన్ని రంగాల పునాది గణితమే. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి గణిత శాస్త్రం ప్రధాన ఆధారం. ఉదాహరణకు కంప్యూటర్లలో ఉపయోగించే అల్గోరిథమ్‌లు, కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, క్రిప్టోగ్రఫీ వంటి రంగాలు పూర్తిగా గణిత సూత్రాలపై ఆధారపడి ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా సుమారు 190కి పైగా దేశాల్లో విద్యా సంస్థలు, విశ్వ విద్యాలయాలు, శాస్త్రీయ సంస్థలు ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. గణిత పోటీలు, సదస్సులు, ఉపన్యాసాలు, ప్రదర్శనలు, క్విజ్‌లు వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి పెంచే ప్రయత్నం జరుగుతోంది. యునెస్కో ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేక థీమ్‌ను ప్రకటించి దాని ఆధారంగా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల ద్వారా గణితం మన దైనందిన జీవితంలో ఎలా ఉపయోగపడుతుందో ప్రజలకు తెలియ జేస్తున్నారు. గణితశాస్త్రం కేవలం సంఖ్యల సమాహారం కాదు. అది ఒక ఆలోచనా విధానం. సమస్యలను విశ్లేషించి పరిష్కారాన్ని కనుగొనే శక్తిని గణితం పెంపొందిస్తుంది. గణిత శాస్త్రం మనిషిలో తర్కశక్తి, విశ్లేషణా సామర్థ్యం, నిర్ణయ సామర్థ్యాన్ని పెంచుతుంది. అందుకే ప్రపంచంలోని అత్యున్నత విద్యా వ్యవస్థలు గణితానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాయి. ప్రపంచ బ్యాంక్ మరియు యునెస్కో నివేదికల ప్రకారం సాంకేతిక రంగాల్లో పనిచేసే నిపుణుల్లో గణిత పటిమ ఉన్నవారి శాతం అత్యధికంగా ఉంటుంది. భారతదేశంలో కూడా గణిత దినోత్సవం విస్తృతంగా జరుపు కుంటున్నారు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాల్లో గణిత ప్రదర్శనలు, పోటీలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా భారత గణిత శాస్త్రవేత్తల కృషిని గుర్తుచేసే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భారతదేశంలో మరో ముఖ్యమైన గణిత దినోత్సవం డిసెంబర్ 22. ఇది ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జన్మదినం. భారత ప్రభుత్వం 2012 నుండి దీనిని జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించింది. రామానుజన్ చేసిన గణిత పరిశోధనలు ప్రపంచ గణిత శాస్త్రానికి అపూర్వమైన సేవగా నిలిచాయి.

ప్రపంచ ఆర్థిక అభివృద్ధిలో కూడా గణిత శాస్త్రం కీలక పాత్ర పోషిస్తోంది. బ్యాంకింగ్ వ్యవస్థ, స్టాక్ మార్కెట్, బీమా రంగం, ఆర్థిక విశ్లేషణలు అన్నీ గణిత గణాంకాలపై ఆధారపడి ఉంటాయి. పెద్ద కంపెనీలు వ్యాపార వ్యూహాలను రూపొందించేటప్పుడు గణిత నమూనాలను ఉపయోగిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా డేటా విశ్లేషణ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ రంగంలో గణిత శాస్త్రం కీలక సాధనంగా మారింది.అంతరిక్ష పరిశోధనలలో కూడా గణితం కీలక పాత్ర పోషిస్తోంది. ఉపగ్రహాల కక్ష్యలను నిర్ణయించడం, అంతరిక్ష నౌకల ప్రయాణ మార్గాలను లెక్కించడం, గ్రహాల గమనాన్ని అంచనా వేయడం వంటి పనులన్నీ గణిత సూత్రాలపై ఆధారపడి ఉంటాయి. అంతరిక్ష సంస్థలు ఉపయోగించే సమీకరణాలు, గణన పద్ధతులు గణిత శాస్త్రంలోనే పుట్టుకొచ్చాయి. అందువల్ల గణితం శాస్త్రీయ అభివృద్ధికి మార్గదర్శక శాస్త్రంగా నిలుస్తోంది.ఇప్పటి డిజిటల్ యుగంలో గణితానికి మరింత ప్రాముఖ్యత పెరిగింది. కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, బిగ్ డేటా విశ్లేషణ వంటి రంగాల్లో గణిత నమూనాలు విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా డేటా శాస్త్రవేత్తలు, గణాంక నిపుణుల అవసరం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు గణితాన్ని భయపడకుండా ఆసక్తితో నేర్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అంతర్జాతీయ గణిత దినోత్సవం గణిత శాస్త్ర ప్రాధాన్యాన్ని ప్రపంచానికి గుర్తుచేసే ముఖ్యమైన సందర్భం. గణితం మనిషి నాగరికతకు మూలస్తంభం. శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి అది మార్గదర్శి. మనిషి ఆలోచనలకు పరిమాణం ఇచ్చే శక్తి గణితం. అందువల్ల గణితాన్ని కేవలం పాఠ్యాంశంగా కాకుండా జీవన విధానంగా అర్థం చేసుకోవాలి. విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి పెంచి పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా విజ్ఞాన సమాజాన్ని నిర్మించవచ్చు. ఈ దిశగా అంతర్జాతీయ గణిత దినోత్సవం ఒక గొప్ప వేదికగా నిలుస్తోంది.

తిరుమలలో మరో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్

తిరుమల మార్చి 13 పెన్ పవర్:
టీటీడీ తిరుమలలో ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా మరో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని టీటీడీ నిర్ణయించింది. దేశవ్యాప్తంగా ఉన్న టీటీడీఆలయాలు, సత్రాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, కల్యాణ మండపాల భద్రతను పర్యవేక్షించేందుకు, భక్తుల భద్రత, నిఘా కోసం రూ.10.75 కోట్ల అంచనా వ్యయంతో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలనిపాలకమండలి సమావేశంలో నిర్ణయించారు. తిరుపతిలోని అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ఆవరణలో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు.తిరుమల మినహా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఆలయాలతో పాటుగా ఇతర సంస్థలు,సత్రాలు, కళ్యాణ మండపాల దగ్గర సీసీ కెమెరాలు ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు కనెక్ట్ చేస్తారు. ఇక్కడి నుంచి భద్రతాపరమైన అంశాలపై రియల్ టైమ్ రివ్యూ ఉంటుంది. తిరుపతిలోని టీటీడీ అడ్మినిస్ట్రేటివ్ భవనంలోడేటా సెంటర్ ఉంది.. దానికి పశ్చిమవైపు ఉన్న ఖాళీ స్థలంలో మూడు అంతస్తుల్లో ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ రాబోయే రోజుల్లో చాలా కీలకంగామారుతుందంటున్నారు.ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్ మొదటి అంతస్తులో సర్వర్ రూమ్‌తో పాటుగా యూపీఎస్ రూమ్, స్టోర్‌లు ఏర్పాటు చేస్తారు. రెండో అంతస్తులో టీటీడీ ఆలయాల కమాండ్ కంట్రోల్ సెంటర్ ఉంటుంది.మూడో అంతస్తులో టీటీడీ విద్యా సంస్థలు, సోషల్ మీడియా వంటి విభాగాల కమాండ్ కంట్రోల్ కోసం కేటాయిస్తారు. ప్రస్తుతానికి రూ.10.75 కోట్ల అంచనాతో టెండర్లు పిలవనున్నారు. భవన నిర్మాణానికి, మౌలివసతులకు కలిపి రూ.6.15 కోట్లు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఏసీ సౌకర్యం కోసం రూ.2.30 కోట్లు, యూపీఎస్, బ్యాటరీలకు: రూ.1.30 కోట్లు అవుతుందని భావిస్తున్నారు. త్వరలోనే డీపీఆర్ రెడీ చేసి
టెండర్లను పిలిచే అవకాశం ఉంది.తిరుమలలో ఇప్పటికే ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. గతేడాది సెప్టెంబర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సెంటర్‌న ప్రారంభించారు. తిరుమల శ్రీవారిదర్శనానికి వచ్చే భక్తుల ఇబ్బందులకు చెక్ పెట్టేలా వైకుంఠం-1 కాంప్లెక్స్‌లో దీనిని ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ ద్వారా భక్తుల రద్దీ నియంత్రణ, వసతి, భద్రతను పర్యవేక్షిస్తారు. ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను దాతల సహకారంతో ఏర్పాటు చేశారు.

స్టీల్ ప్లాంట్ కు వార్ ఎఫెక్ట్

విశాఖపట్టణం మార్చి 13, పెన్ పవర్:
పశ్చిమాసియాలో ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం ఇప్పుడు విశాఖ స్టీల్ ప్లాంట్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ యుద్ధ పరిస్థితుల వల్ల అంతర్జాతీయంగా ఇంధన సరఫరాలో మార్పులురావడం, మన దేశీయ అవసరాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఇప్పుడు విశాఖ ఉక్కు పరిశ్రమను ఇబ్బందుల్లో పడేస్తోంది. ఇప్పుడు విశాఖ ఉక్కు పరిశ్రమను నడపడానికి అత్యంత కీలకమైనఎల్పీజీ సరఫరా నిలిచిపోయే పరిస్థితి రావడంతో, మోర పది రోజుల్లో ఉత్పత్తి మొత్తం ఆగిపోయే ప్రమాదం ఏర్పడింది. ఈ సంక్షోభంపై స్టీల్ అధికారులు, కార్మిక సంఘాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని స్టీల్ మెల్టింగ్ షాప్ అత్యంత కీలకమైన విభాగం, ఇక్కడ తయారైన స్టీల్ బ్లూమ్స్ అవసరమైన పరిమాణంలో కట్ చేయడానికి ఎల్పీజీని వినియోగిస్తారు. ప్రతి రోజూ సుమారు నాలుగు వేల బ్లూమ్స్ కట్‌చేయాల్సి ఉంటుంది. ఈ బ్లూమ్స్ కట్ చేస్తే బెడ్ ఖాళీ అవుతుంది. తద్వారా నిరంతరం కాస్టింగ్ ప్రక్రియ ఇబ్బంది లేకుండా సాగుతుంది. ఈ కటింగ్ ప్రక్రియలో ఎల్పీజీకి వేరే ప్రత్యామ్నాయం ఏదీ అందుబాటులో లేదు. ఒకవేళ గ్యాస్ సరఫరా ఆగిపోతే కటింగ్ ఆపవలసి ఉంటుంది. దీంతో ప్లాంట్ మొత్తంలో ఉత్పత్తి ప్రక్రియ ఆగిపోయే ప్రమాదం ఉంది. దీని వల్ల ప్లాంట్ ప్రతి రోజూ ఉత్పత్తి చేసే పది వేల టన్నుల ఫినిష్డ్ స్టీల్ ఆగిపోతుంది. ఇదిసంస్థకు భారీ ఆర్థిక నష్టాన్ని మిగులుస్తుంది. ప్లాంట్‌లో పనులు కోసం రోజుకు సుమారు 13 టన్నుల ఎల్పీజీ అవసరం. ప్లాంట్‌లో మొత్తం 325 టన్నుల ఎల్పీజీని దాచుకునే సౌకర్యం ఉంది. ప్రస్తుతం ప్లాంట్‌లో నిల్వలుచాలా తక్కువగా ఉన్నాయి. ఒక అంచనా

ప్రకారం 156 టన్నుల గ్యాస్ మాత్రమే ఉంది. ఉన్న నిల్వలు ప్రస్తుత వినియోగం ప్రకారం మరో పది రోజులకు సరిపోతాయి. పది రోజుల తర్వాత గ్యాస్ రాకపోతే ప్లాంట్ మూతపడుతుందని అధికారులు చెబుతున్నారు. ఇలాంటి సంక్షోభం ఎదుర్కోవడం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఇది మొదటిసారి కాదు. 2022లో దేశంలో బొగ్గు సంక్షోభం వచ్చినప్పుడు కూడా నెల రోజుల పాటు ప్లాంట్‌కు
బొగ్గు అందలేదు. ఇప్పుడు అలాంటి పరిస్థితి మళ్లీ రిపీట్ అవుతోంది. పరిస్థితిని అధికారులు, కార్మిక సంఘాలు విశాఖ ఎంపీ భరత్‌కు వివరించారు. వెంటనే స్పందించిన భరత్ ఢిల్లీలోని కేంద్ర పెట్రోలియం శాఖఉన్నతాధికారులతో చర్చించారు. స్టీల్ ప్లాంట్‌కు గ్యాస్ సరఫరా నిలివేస్తే ఉత్పత్తి ఆగిపోతుందని వేల మందిపై ప్రభావం ఉంటుందని తెలియజేశారు. సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ విజ్ఞప్తికి అధికారులు సానుకూలంగా స్పందించినట్టు సమాచారం.

జువ్వలదిన్నె వద్ద ఫిషింగ్ హార్బర్

నెల్లూరు మార్చి 13పెన్ పవర్:
ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు వేదిక అయింది. దేశీయ సముద్ర సాంకేతికత , రక్షణ రంగ ఉత్పత్తిని బలోపేతం చేసే దిశగా, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌సమీపంలో ప్రపంచంలోనే మొట్టమొదటి అటానమస్ మారిటైమ్ షిప్‌బిల్డింగ్ అండ్ సిస్టమ్స్ సెంటర్ ఏర్పాటు కానుంది. సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో బోగోలు మండలం బంగాళాఖాతంతీరంలో ఈ కేంద్రాన్ని నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూమిపూజ నారా లోకేష్ చేతుల మీదుగా జరిగింది. దాదాపు 29.58 ఎకరాల విస్తీర్ణంలో మొదటి విడతగా చేపడుతున్న ఈ ప్రాజెక్టులో స్వయంప్రతిపత్తికలిగిన నౌకల నిర్మాణం , పరిశోధన మరియు అభివృద్ధి , షిప్ మెయింటెనెన్స్ అండ్ రిపేర్ వంటి అత్యాధునిక సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో ఉండనున్నాయి. ప్రధానంగా రక్షణ, వాణిజ్య , తీరప్రాంత భద్రతా అవసరాల కోసం మానవరహిత ఉపరితల నౌకలు, అటానమస్ అండర్ వాటర్ వెహికల్స్ డిజైన్ చేయడం, నిర్మించడంపై ఈ కేంద్రం దృష్టి సారించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెరైన్ రోబోటిక్స్ వంటి అధునాతనసాంకేతికతలను ఇక్కడ వినియోగించనున్నారు.ఈ కేంద్రం ఏర్పాటుతో రక్షణ రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా భారీ ఊతం లభించనుంది. దీని ద్వారా దాదాపు300 మందికి పైగా ఇంజనీర్లు, నేవల్ ఆర్కిటెక్టులు , ఇతర సాంకేతిక నిపుణులకు ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. అంతేకాకుండా, ఇక్కడి ఎంఆర్ఓ ఫెసిలిటీ వల్ల స్థానిక మత్స్యకారుల బోట్లు, కోస్ట్‌గార్డ్ , నేవీ నౌకల మరమ్మతులు వేగంగా జరిగి, పనిదినాల నష్టం తగ్గుతుంది. మత్స్యకారులకు రియల్ టైమ్ ఫిష్ లొకేషన్ మ్యాప్స్, శాటిలైట్ వెదర్ అలర్ట్స్ వంటి సాంకేతిక సాయం కూడా అందనుంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే నెల్లూరు జిల్లా అంతర్జాతీయ సముద్ర సాంకేతిక చిత్రపటంలో కీలక స్థానాన్ని ఆక్రమిస్తుంది. అత్యాధునికసెన్సార్ ఇంటిగ్రేషన్, నావిగేషన్ సిస్టమ్స్ మరియు రిమోట్ కంట్రోల్ టెక్నాలజీలతో రూపొందే ఈ నౌకలు సముద్ర నిఘా, మైన్ డిటెక్షన్ , లాజిస్టిక్స్ సపోర్ట్ వంటి కీలకమైన కార్యకలాపాల్లో దేశానికి రక్షణ కవచంలా మారనున్నాయి.

25 మంది ఎమ్మెల్యేల్లో కనిపించని మార్పు

గుంటూరు, మార్చి 13,పెన్ పవర్:
ప్రజాస్వామ్యంలో భారీ మెజార్టీ అనేది ఒక వరంలా కనిపించినప్పటికీ, సరైన నియంత్రణ లేకపోతే అది అధికార పార్టీకి శాపంగా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ ఎదుర్కొంటున్న అంతర్గత సవాళ్లు, చంద్రబాబు నాయుడు హెచ్చరికలు ఈ దిశగానే సాగుతున్నాయి 2024 ఎన్నికల్లో కూటమికి వచ్చిన అఖండ మెజార్టీ, క్షేత్రస్థాయిలో కొందరు ఎమ్మెల్యేలలో ఒక రకమైన అజాగ్రత్తను పెంచినట్లు కనిపిస్తోంది.ప్రతిపక్షం బలంగా లేకపోవడం, అసెంబ్లీకి రాకపోవడంతో, తిరుగులేని ఆధిపత్యం చూపిస్తూ మమ్మల్ని అడిగే వారే లేరు అనే ధోరణి కొందరిలో కనిపిస్తోంది. గతంలో చంద్రబాబు నాయుడు హెచ్చరించినట్లుగా, దాదాపు40 మంది ఎమ్మెల్యేల గ్రాఫ్ ఆశాజనకంగా లేకపోవడానికి ప్రధాన కారణం ఇదే. ప్రజలకు అందుబాటులో ఉండటం కంటే, ఇతర వ్యాపకాల్లో నిమగ్నమవ్వడం పార్టీకి దీర్ఘకాలికంగా నష్టం చేసే అంశం.చంద్రబాబు నాయుడుక్రమశిక్షణ విషయంలో ఎంత కఠినంగా మాట్లాడుతారో, రాజకీయ వ్యూహాల విషయంలో అంత వెయిట్ అండ్ వాచ్ విధానాన్ని అనుసరిస్తారు. ఎమ్మెల్యేల పనితీరుపై ఆయన నిరంతరం సర్వేలు చేయిస్తూ, లోపాలనుసరిదిద్దుకోవాలని హెచ్చరిస్తూనే ఉన్నారు. మొత్తం నలభై మంది గీత దాటారని హెచ్చరికలు జారీ చేశారు. వారిలో 15 మంది దారికి వచ్చినా, మిగిలిన 25 మందిలో మార్పు రాకపోవడం చంద్రబాబు నాయకత్వపటిమకు ఒక

పరీక్షగా మారింది. ఇనుమును నానబెడతారు కానీ చర్య తీసుకోరు అనే విమర్శ ఆయనపై పాతదే. నిర్ణయం తీసుకోవడంలో చేసే జాప్యం, తప్పు చేస్తున్న వారికి పరోక్షంగా వెసులుబాటుకల్పించినట్లవుతోందని టీడీపీ వర్గాలు అంటున్నాయి.బలమైన ప్రతిపక్షం ఉన్నప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేలు అప్రమత్తంగా ఉంటారు. ఎక్కడ తప్పు చేసినా ప్రతిపక్షం ఎండగడుతుందనే భయం ఉంటుంది. కానీఇప్పుడు ఏపీలో ప్రతిపక్షం యాక్టివ్‌గా లేకపోవడంతో, ఎమ్మెల్యేల ఆగడాలకు అడ్డులేకుండా పోతోందనే వాదన ఉంది. ఇసుక, భూ దందాలు లేదా స్థానిక వివాదాల్లో ఎమ్మెల్యేల ప్రమేయం పెరుగుతుండటం వల్ల ప్రభుత్వప్రతిష్ఠ మసకబారుతోంది. ప్రజలు ప్రతిపక్షాన్ని చూసి కాదు, అధికార పార్టీ ప్రవర్తనను చూసి తీర్పు ఇస్తారని నేతలు మర్చిపోతున్నారు. కనీసం నలుగురైదుగురు ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు తీసుకోవాలని చంద్రబాబుభావించడం వెనుక ఒక బలమైన సందేశం ఉంది. తప్పు చేస్తే ఎవరినీ వదిలిపెట్టను " అని నిరూపిస్తేనే మిగిలిన వారు దారికి వస్తారు. అయితే, కూటమి రాజకీయాల్లో ఒక ఎమ్మెల్యేపై చర్య తీసుకోవడం వల్ల స్థానికసమీకరణాలు మారుతాయనే భయం చంద్రబాబును వెనక్కి లాగుతున్నట్లుగా కనిపిస్తోంది. కేవలం హెచ్చరికలకే పరిమితమైతే.. జరగాల్సిన నష్టం జరిగిపోతుందని, వచ్చే ఎన్నికల నాటికి ప్రజల్లో వ్యతిరేకత తీవ్రస్థాయికిచేరుతుందన్న ఆందోళన ఆ పార్టీలో ఉంది. చరిత్రను పరిశీలిస్తే, గతంలో అత్యధిక సీట్లు సాధించిన ప్రభుత్వాలు తమ సొంత ఎమ్మెల్యేల అతివిశ్వాసం వల్లే పతనమైన సందర్భాలు ఉన్నాయి. ఎమ్మెల్యేలు ప్రజలకు దూరం కావడం అనేది ఒక అంటువ్యాధి లాంటిది. ఒకరిని చూసి మరొకరు అక్రమాలకు పాల్పడితే, అది మొత్తం వ్యవస్థను కుప్పకూల్చుతుంది. అధిక మెజార్టీ ఉంది కదా అని ఎమ్మెల్యేలను సరిగ్గా దారిలో పెట్టలేకపోతే, ఆమెజార్టీయే టీడీపీకి భవిష్యత్తులో అతిపెద్ద బలహీనతగా మారే అవకాశం ఉంది. చంద్రబాబు నాయుడు ఇప్పుడు సంధిగ్ధంలో ఉన్నారు. పార్టీ ప్రతిష్ఠను కాపాడుకోవడానికి కఠినంగా వ్యవహరించాలా లేక ఎమ్మెల్యేలనుబుజ్జగించి దారికి తెచ్చుకోవాలా అనే అంశంపై ఆయన ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని పార్టీ క్యాడర్ సలహాలు ఇస్తోంది.

వేటుకు సిద్ధమవుతున్న అధినేత

విజయవాడ, మార్చి 13, పెన్ పవర్: : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక దిశగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. నలుగురు ఎమ్మెల్యేలపై వేటు వేయడానికి చంద్రబాబు సిద్ధమవుతున్నారు. అయితే వేటు ఏ రూపంలో ఉంటుంది?ఎవరిపై ఉంటుందన్న చర్చ ఇప్పుడు తెలుగుదేశం పార్టీలో జోరుగా జరుగుతుంది. ఇటీవల చంద్రబాబు నాయుడు టీడీపీ ఎమ్మెల్యేల పనితీరుపై సమీక్షించారు. గతంలో నలభై మంది ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తినిచంద్రబాబు వ్యక్తం చేశారు. ఆ నలభై మంది ఎమ్మెల్యేలతో చంద్రబాబు పిలిచి వన్ టు వన్ మాట్లాడారు. పనితీరు మెరుగు పర్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ నేపథ్యంలో మరోసారి చంద్రబాబు నాయుడుఎమ్మెల్యేల పనితీరుపై సమీక్ష జరిపారు.మద్యం కేసుఎమ్మెల్యేలు ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లకపోవడం, కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం, తమ వ్యాపారాలకే
పరిమితం కావడంతో పాటు నియోజకవర్గంలో ఇసుక, మద్యం వంటి వాటిల్లో ఆరోపణలు ఎదుర్కొనడం వంటి వాటిపై కేంద్ర పార్టీ నుంచి మాత్రమే కాకుండా నిఘా వర్గాల ద్వారా నివేదికను తెప్పించుకున్నారు. ఎమ్మెల్యేలపనితీరు బాగా లేకపోతే, వారిపై ప్రజల్లో అసంతృప్తి పెరిగితే ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడం కష్టమని భావించి ఎమ్మెల్యేల పనితీరుపైనే చంద్రబాబు ఎక్కువ ఫోకస్ పెట్టారు. తన తెలుగుదేశం పార్టీకి చెందిన 130మందికి పైగా ఎమ్మెల్యేల్లో నలభై మందిపై ప్రజలు పెదవి విరుస్తున్నారని, ఆ నియోజకవర్గాల్లో ప్టీ ఇబ్బందులు ఎదుర్కొంటుందని గుర్తించారు.నష్ట నివారణ చర్యల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లయినాపార్టీ పనితీరును మార్చుకోని నలభై మంది ఎమ్మెల్యేలను గుర్తించి తిరిగి వారి పనితీరును సమీక్షించిన చంద్రబాబు అందులో నలుగురు మాత్రం పార్టీ లో ఉంటే ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువ అని భావిస్తున్నారు.దీంతో ఆ నలుగురిపై చర్యలు తీసుకోవాలని సిద్ధమయ్యారు. కోస్తా జిల్లా నుంచి ఇద్దరు, రాయలసీమ జిల్లా నుంచి ఒకరు, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి మరొకరు ఈ వేటు పడే వారిలో ఉన్నట్లు సమాచారం. వీరికి ఫైనల్‌వార్నింగ్ కూడా పూర్తి కావడంతో ఇక ఉపేక్షించి లాభంలేదని భావించిన చంద్రబాబు త్వరలోనే ఆ నలుగురిపై సస్పెన్షన్ వేటు వేసి, ఆ నియోజకవర్గాలకు పార్టీ ఇన్ ఛార్జులను నియమిస్తారన్న టాక్ పార్టీలో బాగానడుస్తుంది. ఆ నలుగురు ఎవరన్న దానిపైనే ఇప్పుడు టీడీపీలో ఉత్కంఠ నెలకొంది.

చందానగర్లో 'అను ఫర్నిచర్'లో భారీ అగ్ని ప్రమాదం

విజయవాడ, మార్చి 13, పెన్ పవర్: : చందానగర్లోని అను ఫర్నిచర్ షాపులో గురువారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. షాపులో ఒక్కసారిగా మంటలు ఎగసిపడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రాథమిక సమాచారం ప్రకారం షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించినట్లు అనుమానం వ్యక్తమవుతోంది. షాపులో ఉన్న ఫర్నిచర్ సామగ్రి మంటల్లో కాలిపోవడంతో భారీ నష్టం జరిగినట్లు తెలుస్తోంది.
సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

బొత్స కొడుకు Vs కూతురు.. ఇద్దరిలో చీపురుపల్లి ఎవరికి?

విజయవాడ, మార్చి 13, పెన్ పవర్: : వైసీపీ సీనియర్ నేత, మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ప్రస్తుతం విశాఖ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి బొత్స ఎమ్మెల్సీగా ఉన్నారు. ఈ పదవీకాలం వచ్చే ఏడాదితో పూర్తికావస్తోంది. మళ్లీ ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికయ్యే పరిస్థితులు దాదాపు కనిపించడం లేదని అంటున్నారు. ఇదే సమయంలో బొత్స ఆరోగ్యంపై నెలకొన్న సందిగ్ధత వల్ల ఆయన భవిష్యత్తులో రాజకీయాల్లో కొనసాగే పరిస్థితిపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ ఒత్తిడి కారణంగా బొత్స తరచూ అస్వస్థతకు గురవుతున్నారు. అంతేకాకుండా ఆయన వయసు కూడా ఏడు పదులు దాటుతోంది. దీంతో ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకోవాలని బొత్స ఆలోచిస్తున్నారని అంటున్నారు. ఈ కారణంగానే ఆయన తన వారసులుగా కుమారుడు డాక్టర్ సందీప్, కుమార్తె డాక్టర్ అనూషను రంగంలోకి దింపారని చెబుతున్నారు.
బొత్స ప్రస్తుతం విశాఖ కేంద్రంగా పనిచేస్తున్నారు. అయితే ఆయన సొంత నియోజకవర్గం విజయనగరంలోని చీపురుపల్లిపై పట్టు మాత్రం వదులుకోకూడదని భావిస్తున్నారని అంటున్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో ఆ నియోజకవర్గం నుంచి బొత్స వారసులుగా ఎవరు పోటీ చేస్తారనేది సస్పెన్స్ క్రియేట్ చేస్తోంది. బొత్స ఫ్యామిలీ నుంచి ఇప్పటికే అర డజను మంది క్రియాశీల రాజకీయాల్లో ఉన్నారు. ఆయన భార్య, సోదరులు, మేనల్లుడు, మేనకోడలి భర్త ఇలా అంతా గతంలో ఎమ్మెల్యే, ఎంపీ, జడ్పీ చైర్పర్సన్ వంటి పదవుల్లో ఉన్నారు. బొత్స సతీమణి ఝాన్సీలక్ష్మి గత ఎన్నికల్లో విశాఖ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. వచ్చే ఎన్నికల్లో చీపురుపల్లి నుంచి బొత్స పోటీ చేసే పరిస్థితి కనిపించడం లేదని అంటున్నారు. ఆయన బదులుగా చీపురుపల్లి నుంచి పోటీ చేయాలని భావించిన బొత్స మేనల్లుడు, విజయనగరం జడ్పీ చైర్ పర్సన్ మజ్జి శ్రీనివాసరావు అలియాస్ చిన్న శ్రీనును విశాఖ జిల్లాలోని భీమిలి ఇంచార్జిగా పంపించారు. చీపురుపల్లి నియోజకవర్గాన్ని తన వారసులకు కట్టబెట్టాలనే ఆలోచనతోనే చిన్నశ్రీనును చీపురుపల్లి నుంచి తప్పించారని చెబుతున్నారు. ఆయనను భీమిలి పంపడం ద్వారా బొత్స వారసులకు లైన్ క్లియర్ చేశారని చెబుతున్నారు.అయితే బొత్స ఇద్దరు పిల్లల్లో ఎవరు చీపురుపల్లి నుంచి పోటీ చేస్తారనేదే ఇప్పుడు సస్పెన్స్ క్రియేట్ చేస్తోంది. గత ఎన్నికల్లోనే బొత్స కుమారుడు సందీప్ చీపురుపల్లి నుంచి పోటీ చేస్తారని భావించారు. అయితే ఆయనకు వైసీపీ అధిష్టానం చాన్స్ ఇవ్వలేదు. ఇక ఎన్నికల తర్వాత బొత్స కుమార్తె అనూష రంగంలోకి దిగారు. ఇటీవల కాలంలో నియోజకవర్గంలో ఎక్కువగా అనూష పర్యటిస్తున్నారు. దీంతో చీపురుపల్లి సీటును ఆమె కూడా ఆశిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. దీంతో బొత్స ఇద్దరు పిల్లలు తండ్రి నియోజకవర్గాన్ని ఆశించడం, ఆ ఇద్దరిలో ఎవరికి బొత్స రైట్ చెబుతారనేది ఉత్కంఠగా మారిందని అంటున్నారు.2004లో చీపురుపల్లి నుంచి తొలిసారిగా బొత్స గెలిచారు. ఆ నియోజకవర్గంలో వ్యక్తిగతంగా ఓటు బ్యాంకు పెంచుకున్నారు. 2014, 2024 ఎన్నికల్లో బొత్స ఓడినప్పటికీ వ్యక్తిగత చరిష్మా కారణంగా నియోజకవర్గంలో వేరొకరి జోక్యాన్ని బొత్స సహించలేరని అంటున్నారు. ఈ కారణంగా కుటుంబంలోనే ఇతరులను నియోజకవర్గం నుంచి దూరం పెట్టారని అంటున్నారు. అయితే అదే నియోజకవర్గం కోసం ఇప్పుడు కూతరు, కొడుకు పోటీ పడటమే ఆసక్తి రేపుతోందని అంటున్నారు. ఇద్దరిలో బొత్స మద్దతు ఎవరికి ఉంటుంది? ఆయన ఎలా సర్దుబాటు చేస్తారనేది చూడాల్సివుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

ఇరాక్‌లో కుప్పకూలిన అమెరికా రీఫ్యూయలింగ్ విమానం

హైదరాబాద్ పెన్ పవర్: అమెరికా వాయుసేనకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కేసీ-135 ట్యాంకర్ ఉత్తర ఇరాక్‌లో గురువారం కుప్పకూలింది. అయితే ఈ ప్రమాదంలో ఎంతమంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారో అమెరికా అధికారులు ప్రకటించలేదు. సహాయ కార్యక్రమాలు చేపట్టినట్లు చెబుతున్నారు. ఈ ఘటనపై అమెరికా సెంట్రల్ కమాండ్ ఓ ప్రకటన విడుదల చేసింది. రెండు సైనిక ట్యాంకర్ విమానాలు ల్యాండ్ అవుతుండగా ఈ ఘటన జరిగినట్లు వెల్లడించింది. రెండో విమానం సురక్షితంగా దిగినట్లు పేర్కొంది.మరోవైపు ఇరాక్‌కు చెందిన ఇస్లామిక్ రెసిస్టెన్స్ రెబల్ గ్రూప్ తామే అమెరికా విమానాన్ని కూల్చేసినట్లు ప్రకటించింది. ఈ గ్రూప్ ఇరాన్‌కు అనుకూలంగా పనిచేస్తోంది. ఆ సంస్థ అధికారిక టెలిగ్రామ్ ఛానెల్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. అయితే ఈ ప్రకటనను అమెరికా సెంట్రల్ కమాండ్ తోసిపుచ్చింది. శత్రువుల దాడి లేదా ఫ్రెండ్లీ ఫైర్‌లో ఇది కూలిపోలేదని వెల్లడించింది. ఈ ఘటనలో ఆరుగురు సిబ్బంది చనిపోయినట్లు ఇరాన్ మీడియా చెబుతోంది. కేసీ-135 స్ట్రాటోట్యాంకర్‌లో కనీసం ముగ్గురు సిబ్బంది ఉండాల్సి ఉంటుంది. వీరిలో పైలట్, కోపైలట్, ఆపరేటర్ ఉంటారు. వీరితోపాటు నేవిగేటర్, మిషన్ ఆధారంగా అదనపు సిబ్బందిని తరలిస్తుంటారు.ఇరాన్ యుద్ధంలో తీవ్రమైన పనిఒత్తిడి ఉన్న కార్యక్రమం విమానాలకు గాల్లో ఇంధనం నింపడమే. వందల సంఖ్యలో అమెరికా, ఇజ్రాయెల్ విమానాలు దాడులకు వెళుతుండటంతో ట్యాంకర్ విమానాల అవసరాలు గణనీయంగా పెరిగాయి.

పెషావర్ కాన్సులేట్‌ను మూసివేస్తున్న అమెరికా

హైదరాబాద్ పెన్ పవర్: పాకిస్థాన్‌లోని పెషావర్‌లో ఉన్న కాన్సులేట్‌ను శాశ్వతంగా మూసివేయాలని అమెరికా విదేశాంగశాఖ నిర్ణయించింది. అఫ్గానిస్థాన్‌కు అత్యంత సమీపంలో ఉన్న అమెరికా దౌత్య కార్యాలయం ఇదే. 2001లో అఫ్గానిస్థాన్‌పై అమెరికా దాడి ప్రారంభానికి ముందు, తరువాత ఈ కాన్సులేట్ కీలక ఆపరేషన్లు, లాజిస్టిక్స్‌కు కేంద్రంగా పని చేసింది. ఈ వారంలో కాంగ్రెస్‌కు పంపిన నోటిఫికేషన్‌లో కాన్సులేట్‌ను మూసివేయాలనే ఉద్దేశాన్ని అమెరికా విదేశాంగశాఖ తెలియజేసింది. దీనివల్ల ఏటా సుమారు 7.5 మిలియన్ డాలర్లు ఆదా అవుతాయని, పాకిస్థాన్‌లో అమెరికా జాతీయ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడంలో ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదని పేర్కొంది. ఇది ఇరాన్ యుద్ధం నేపథ్యంలో తీసుకున్న నిర్ణయం కాదని, దాదాపు ఏడాదికిపైగా పరిశీలనలో ఉందని అధికారులు తెలిపారు. ఇరాన్‌పై యుద్ధానికి వ్యతిరేకంగా పాకిస్థాన్‌లోని కరాచీ, పెషావర్ నగరాల్లో నిరసనలు జరిగిన సమయంలో అమెరికా కాన్సులేట్లు తాత్కాలికంగా కార్యకలాపాలు నిలిపివేశాయి. ఇకపై అమెరికన్ పౌరులకు సంబంధించిన సేవలను ఇస్లామాబాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయం నిర్వహించనుంది.

మొజ్తాబా ఓ కీలుబొమ్మ : నెతన్యాహు

హైదరాబాద్ పెన్ పవర్: ఇరాన్ తో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతాన్యహు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీని విమర్శలు చేస్తూ షాకింగ్ కామెంట్స్ చేశారు.ఆయన రెవల్యూషనరీ గార్డ్స్ కీలుబొమ్మ అంటూ ధ్వజమెత్తారు. బయటకు కూడా రాలేకపోతున్నాడని పరువు తీశారు బెంజమిన్ నెతాన్యహు. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ కు చెందిన టాప్ న్యూక్లియర్ సైంటిస్ట్ మరణించారని స్పష్టం చేశారు. ఇక ఇరాన్ ప్రజలు స్వేచ్ఛ మార్గం వైపు అడుగులు వేసే సమయం వచ్చిందని వివరించారు. మేము వారికి అండగా ఉంటామని ప్రకటించారు. కానీ మార్పు మాత్రం వారి చేతుల్లోనే ఉందని స్పష్టం చేశారు బెంజమిన్ నెతాన్యహు. ఇది ఇలా ఉండగా దివంగత ఇరాన్ సుప్రీం నాయకుడు అలీ ఖమేనీ సతీమణి ఇంకా బతికే ఉన్నారని తాజాగా ఇరాన్ రాష్ట్ర మీడియా వెల్లడించింది. ఫిబ్రవరి 28వ తేదీన అలీ ఖమేనీ నివాసంపై 30 బాంబులు వేసింది ఇజ్రాయెల్. ఈ సంఘటనలో అలీ ఖమేనీ అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు కూడా మరణించారు. ఈ సంఘటనలో గాయపడిన ఆయన భార్య చనిపోయినట్లు ముందు వార్తలు వచ్చాయి. అయితే తాజాగా ఆమె బతికే ఉన్నట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది.

బెంగాల్‌ను ప్రేమించే వారినే బెంగాల్ ప్రేమిస్తుందని సీఎం మమత వ్యాఖ్య

హైదరాబాద్ పెన్ పవర్: పశ్చిమ బెంగాల్ 22వ గవర్నర్‌గా ఆర్.ఎన్. రవి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆయనతో తొలిసారి సంభాషిస్తూ ఒక కీలక సందేశాన్ని ఇచ్చారు.మీరు బెంగాల్‌ను ప్రేమిస్తే, బెంగాల్ కూడా మిమ్మల్ని ప్రేమిస్తుంది అని ఆమె రవికి సూచనప్రాయంగా తెలిపారు.ప్రమాణ స్వీకారం ముగిశాక, మమతా బెనర్జీ కొత్త గవర్నర్‌కు మెడలో శాలువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెంగాల్‌లో అన్ని భాషల ప్రజలు కలిసిమెలిసి శాంతియుతంగా ఉంటారు. కానీ, బెంగాల్‌ను ప్రేమించే వారిని బెంగాలీలు కూడా ప్రేమిస్తారన్నది ముఖ్యం. ఇది బెంగాలీల నైజం అని వివరించారు. దీనికి గవర్నర్ రవి స్పందిస్తూ పశ్చిమ బెంగాల్ దేశానికి మేధో, సాంస్కృతిక రాజధాని అనేది నిజం అని అన్నారు.మమత చేసిన ఈ వ్యాఖ్యల వెనుక బలమైన రాజకీయ సందేశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా లేదా రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించేలా రాజ్ భవన్ నుంచి ఎలాంటి చర్యలు ఉండకూడదనేది ఆ సందేశం సారాంశం అని విశ్లేషిస్తున్నారు. గతంలో గవర్నర్‌గా పనిచేసిన జగ్‌దీప్ ధన్‌ఖడ్, ఆ తర్వాత వచ్చిన సి.వి. ఆనంద బోస్‌ల హయాంలోనూ రాష్ట్ర ప్రభుత్వానికి, రాజ్ భవన్‌కు మధ్య తీవ్రమైన ఘర్షణ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో మమత వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఇరాన్ యుద్ధంతో తీవ్రమైన వంటగ్యాస్ కొరత

హైదరాబాద్ పెన్ పవర్: దేశంలో నెలకొన్న వంటగ్యాస్ కొరతను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో గృహ వినియోగదారులకు ఎల్పీజీ సిలిండర్ రీఫిల్ బుకింగ్ మధ్య వ్యవధిని 45 రోజులకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణ, నగర ప్రాంతాల్లో మాత్రం 25 రోజుల నిబంధన కొనసాగుతుందని స్పష్టం చేసింది.ఇప్పటివరకు దేశవ్యాప్తంగా రెండు సిలిండర్ల బుకింగ్ మధ్య 25 రోజుల గ్యాప్ ఉండగా, ఇకపై ఈ నిబంధన కేవలం పట్టణ, నగర ప్రాంతాలకే పరిమితం కానుంది. గ్రామీణ ప్రాంతాల్లోని వినియోగదారులు మాత్రం ఒక సిలిండర్ బుక్ చేశాక, తదుపరి సిలిండర్ బుకింగ్ కోసం 45 రోజులు ఆగాల్సి ఉంటుంది.ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ఎల్పీజీ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో దేశంలో గ్యాస్ కొరత తీవ్రమైంది. దీంతో చాలామంది వినియోగదారులు ముందుజాగ్రత్తగా సిలిండర్లను బ్లాక్‌లో నిల్వ చేసుకోవడం మొదలుపెట్టారు. ఇదే సమయంలో హైదరాబాద్ సహా పలు నగరాల్లో హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి డిమాండ్ పెరగడంతో కమర్షియల్ సిలిండర్లను ఏజెన్సీలు రెట్టింపు ధరకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.కాగా, గ్రామీణ ప్రాంతాల్లో సరఫరా వ్యవస్థను క్రమబద్ధీకరించి, అందరికీ గ్యాస్ అందుబాటులో ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం పేర్కొంది.

ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన మొజ్తబా ఖమేనీ

హైదరాబాద్ పెన్ పవర్: ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు స్వీకరించిన మొజ్తబా ఖమేనీ, తన తొలి సందేశంలోనే తీవ్ర స్వరంతో మాట్లాడారు. హార్ముజ్ జలసంధిని మూసి ఉంచుతామని, తమ అమరవీరుల మరణానికి కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటామని ఆయన గురువారం ప్రతినబూనారు. తండ్రి అలీ ఖమేనీ హత్య తర్వాత దేశాధినేతగా బాధ్యతలు చేపట్టిన మొజ్తబా, దేశ ప్రజలకు తన తొలి సందేశాన్ని పంపారు.ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్‌లో ఒక మహిళా ప్రజెంటర్, మొజ్తబా రాసిన లిఖితపూర్వక సందేశాన్ని చదివి వినిపించారు.అమరవీరుల రక్తాన్ని వృథా పోనివ్వం. దానికి ప్రతీకారం తీర్చుకోకుండా ఇరాన్ నాయకత్వం వెనకడుగు వేయదు. హార్ముజ్ జలసంధిని మూసి ఉంచే సాధనాన్ని కాపాడుకోవాలి. అవసరమైతే ఇతర రంగాల్లోనూ పోరాటానికి దిగుతాం అని ఆ సందేశంలో హెచ్చరించారు.అదే సమయంలో, పొరుగు దేశాలతో స్నేహపూర్వక సంబంధాలనే ఇరాన్ కోరుకుంటుందని స్పష్టం చేశారు. తమపై దాడులకు కేంద్రంగా ఉన్న స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటామని తెలిపారు. అయితే, ఇస్లామిక్ రిపబ్లిక్ మూడో సుప్రీం లీడర్‌గా భావిస్తున్న మొజ్తబా ఎక్కడున్నారు, ఆయన ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందనే వివరాలు మాత్రం ఈ సందేశంలో వెల్లడి కాలేదు.ఇటీవల ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో మరణించిన సుప్రీం లీడర్ అలీ ఖమేనీ రెండో కుమారుడే ఈ మొజ్తబా ఖమేనీ. 1969లో జన్మించిన ఆయన, పాశ్చాత్య దేశాల పట్ల మొదటి నుంచి కఠిన వైఖరితో ఉన్నారు. అధికారికంగా ఏ పదవిలోనూ లేనప్పటికీ, సీనియర్ మత పెద్దలు, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఉన్న సన్నిహిత సంబంధాల ద్వారా తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నారు. ఈయన తన తండ్రికి అనధికారిక ప్రతినిధిగా వ్యవహరించినందుకు 2019 నుంచే అమెరికా ఆంక్షలను ఎదుర్కొంటున్నారు.ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా టెహ్రాన్‌తో పాటు ఇతర నగరాలపై ఆకస్మిక వైమానిక దాడులు చేశాయి.

ఫరూక్ అబ్దుల్లాపై హత్యాయత్నం

హైదరాబాద్ పెన్ పవర్: జమ్మూకశ్మీర్: జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లాపై జమ్మూ శివార్లలో హత్యాయత్నం జరిగింది. ఒక వివాహ వేడుకలో పాల్గొన్న ఆయనపై పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్పులు జరిపేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. అయితే భద్రతా సిబ్బంది, అక్కడి ప్రజలు అత్యంత అప్రమత్తతతో వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. జమ్మూ శివార్లలోని ఒక ప్రముఖ హోటల్‌లో బుధవారం జరిగిన వివాహ వేడుకకు ఫరూక్ అబ్దుల్లా హాజరు అయ్యారు. ఆయనతో పాటు జమ్మూ కాశ్మీర్ ఉప ముఖ్యమంత్రి సురీందర్ ఛౌదరి కూడా ఉన్నారు. అయితే వేడుకలో అందరితో కలిసి నవ్వుతూ మాట్లాడుతున్న సమయంలో.. ఒక వ్యక్తి వెనుక నుంచి అకస్మాత్తుగా వచ్చి ఫరూక్ అబ్దుల్లాపై తుపాకీ గురిపెట్టాడు. నిందితుడు ట్రిగ్గర్ నొక్కేలోపే అక్కడే ఉన్న సెక్యూరిటీ సిబ్బంది, స్థానికులు అతడిని చుట్టుముట్టి కిందకు నెట్టేశారు. అనంతరం అతడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది. నిందితుడు జమ్మూకి చెందిన 63 ఏళ్ల కమల్ సింగ్ జమ్వాల్‌గా పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా.. విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. తాను గత 20 ఏళ్లుగా ఫరూక్ అబ్దుల్లాను చంపాలని ఎదురు చూస్తున్నట్లు నిందితుడు పోలీసులతో చెప్పాడు. ఇది తన వ్యక్తిగత అజెండా అని.. దీని వెనుక ఎలాంటి సంస్థల హస్తం లేదని పేర్కొన్నాడు. కాల్పులకు ప్రయత్నించిన సమయంలో అతను మద్యం మత్తులో ఉన్నాడని, ఆ తుపాకీకి లైసెన్స్ కూడా ఉందని పోలీసులు ధృవీకరించారు.

చమురు నిల్వలపై కేంద్రం కీలక ప్రకటన

హైదరాబాద్ పెన్ పవర్: న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడులతో చమురు సంక్షోభం తలెత్తిన విషయం తెలిసిందే. గల్ఫ్ దేశాల నుంచి క్రూడాయిల్ దిగుమతులు నిలిచిపోయ్యాయి. దీంతో పలు దేశాల్లో ఇందన నిల్వలు తగ్గుముఖంపట్టాయి. ఈక్రమంలో రెండో విడత బడ్జెట్ పార్లమెంట్ సమావేశాల్లో గ్యాస్, చమురు నిల్వలపై చర్చ పెట్టాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. పార్లమెంట్ మకర ద్వారం వద్ద మూడు రోజులు నిరసన ప్రదర్శనలు చేపట్టాయి. ప్రతిపక్షాల ఆందోళనలకు తలొగ్గిన బీజేపీ ప్రభుత్వం కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి పార్లమెంట్‌లో కీలక ప్రకటన చేశారు.ఇండియాలో ఇంధన కొరత లేదని, తగినన్ని క్రూడాయిల్ నిల్వలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం, సహజ తెలిపారు. పెట్రోల్, డీజిల్, విమాన ఇంధన సరఫరాలో ఎలాంటి కొరత లేదని చెప్పారు. దేశీయ రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని అన్నారు. ప్రజలు ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయవద్దని కోరారు. హర్మూజ్ సంక్షోభంతో భారత్‌కు సంబంధం లేదు. హర్మూజ్ జలసంధి భారత్‌కు తెరిచారు. ప్రధానమంత్రి చర్చలతో పరిస్థితులు సర్దుకుంటున్నాయి'

అని హర్దీప్ సింగ్ తెలిపారు. ఎలాంటి సంక్షోభం తలెత్తినా ఎదుర్కునేందుకు కూడా కేంద్రం సిద్ధంగా ఉందని చెప్పారు. డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని మంత్రి వివరించారు. సిలిండర్ల సరఫరాలో ఆసుపత్రులు, విద్యాసంస్థలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. సిలిండర్ బుకింగ్‌కు నగరాల్లో 25 రోజుల వ్యవధి, గ్రామాల్లో 45 రోజుల వ్యవధి అమలు చేస్తున్నట్టు చెప్పారు.

అయ్యర్ వర్సెస్ థరూర్

హైదరాబాద్ పెన్ పవర్: కాంగ్రెస్ సీనియర్ నేతలు మణిశంకర్ అయ్యర్, శశిథరూర్ బహిరంగ లేఖల రూపంలో తాజాగా పరస్పరం తీవ్ర విమర్శలు గుప్పించుకున్నారు. థరూర్‌తో సంబంధాలను పూర్తిగా తెంచేసుకుంటున్నట్లు అయ్యర్ పేర్కొనగా.. ఆయన తీరును థరూర్ తీవ్రంగా తప్పుబట్టారు. థరూర్‌కు అయ్యర్ రాసిన బహిరంగ లేఖ ఓ మ్యాగజీన్‌లో ఇటీవల ప్రచురితమైంది. ఈ నెల 6న థరూర్ ఓ టీవీ ఛానల్‌తో మాట్లాడుతూ ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం గురించి చేసిన వ్యాఖ్యలు తనను విస్మయానికి గురిచేశాయని అందులో పేర్కొన్నారు. "నేను నిద్ర కూడా పోలేనంత తీవ్రంగా కలత చెందాను. తెల్లవారుజామున మూడు గంటలకు లేచి మీకు (థరూర్‌కు) ఈ బహిరంగ లేఖ రాస్తున్నా. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో.. నా రాజకీయ భవిష్యత్తును పణంగా పెట్టి మరీ మీకు ఓటేశాను. తర్వాత కూడా మీకు పార్టీలో సముచిత ఉన్నత స్థానమివ్వాలని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేతో వాదనకు దిగాను. అప్పట్నుంచి గాంధీలు, ఖర్గే నన్ను కలవడానికి సుముఖత చూపలేదు. కానీ ఇప్పుడు మీ వ్యవహార శైలి చూస్తుంటే.. నేను చేసింది సరైంది కాదనిపిస్తోంది. స్థాయీసంఘం ఛైర్మన్‌గా

ఉన్న మీరు.. విదేశాంగ విధానంపై నిర్ణయాలను పూర్తిగా ప్రభుత్వ ఇష్టానికే వదిలేశారు. అలాం టప్పుడు మీరు ఛైర్మన్‌గా ఉండటంలో అర్థమేముంది? శబరి మల ఆలయంలోకి అందరు మహిళలకూ ప్రవేశం కల్పిం చాలన్న సుప్రీంకోర్టు తీర్పును మీలాంటి మేధావి, ఆధునిక భావజాలమున్న వ్యక్తి తప్పుబట్టడం నమ్మలేకపోయా. మీరు మాలో ఒకరు కాదని ఈ పరిణామాలతో అర్థమైంది. అందుకే మీతో సంబంధాలు తెంచేసుకుంటున్నా" అని థరూర్‌ను ఉద్దేశించి అయ్యర్ పేర్కొన్నారు.

స్పీకర్‌పై వీగిపోయిన విపక్షాల అవిశ్వాస తీర్మానం

హైదరాబాద్ పెన్ పవర్: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. సభలో స్పీకర్ పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు తొలి విడత బడ్జెట్ సమావేశాల చివరలో అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చిన సంగతి తెలిసిందే.ఈ అంశంపై మంగళవారం నుంచి సుదీర్ఘంగా చర్చ జరగ్గా.. బుధవారం ఓటింగ్ నిర్వహించారు. మూజువాణి ఓటులో అభిశంసన వీడిపోవడంతో స్పీకర్ ఓం బిర్లా గురువారం నుంచి సభకు హాజరుకా?న్నారు. ఇక, చర్చలో విపక్షాల విమర్శలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. మొదటి విడత బడ్జెట్ సమావేశాల చివరిలో స్పీకర్ అభిశంసనకు కాంగ్రెస్ పార్టీ నోటీసు ఇవ్వగా.. 118 మంది ఎంపీలు సంతకాలు చేశారు.ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై అమిత్ షా చేసిన విమర్శలకు ప్రతిపక్ష సభ్యుల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమయ్యాయి. అమిత్'అన్ పార్లమెంటరీ' లాంగ్వేజ్‌ను ఉపయోగించారని ఆరోపించారు. "వారు ప్రవర్తన గురించి మాట్లాడుతున్నారు. వారి నాయకుడు స్వయంగా కన్నుగీటి, దగ్గరకు వెళ్లి ప్రధాన మంత్రిని కౌగిలించుకుని, ఫ్లయింగ్ కిస్ ఇచ్చినప్పుడు అది రొచ్చగొట్టడం కాదా?" అని షా అన్నారు. దీనిపై హోం మంత్రి క్షమాపణ చెప్పాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేయడంతో సభలో గందరగోళం నెలకుంది. తన వ్యాఖ్యల్లో అభ్యంతరకరమైన పదాలు ఉంటే రికార్డుల నుంచి తొలగించాలని అమిత్ షా కోరారు.స్పీకర్ అంకితభావాన్ని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయని, వారు నిబంధనలు ఉల్లంఘిస్తేనే సభాపతి రంగంలోకి దిగారని అమిత్ షా మండిపడ్డారు. మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ హయాంలోనే పార్లమెంట్ నిబంధనలు రూపొందించారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ రూపొందించిన ఈ నిబంధనలపై తాము చర్చకు సిద్ధమని, పార్టీలకు అతీతంగా సభాపతి వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

గ్యాస్, ఇంధన కొరతపై పని ప్రదేశాల్లో నిరసనలు

హైదరాబాద్ పెన్ పవర్: అమెరికా ప్రయోజనాలకు లొంగిపోతూ, దూరదృష్టి లేకుండా కేంద్రంలోని మోడీ సర్కార్ దేశాన్ని అవాంఛనీయ సంక్షోభం వైపునకు నెడుతోందని సీఐటీయూ విమర్శించింది. దేశంలో ప్రస్తుతం తీవ్రంగా ఎల్‌పీజీ- ఎన్ఎన్‌జీ సరఫరా సంక్షోభం నెలకొందని, ఫలితంగా అనేక రంగాల్లో పారిశ్రామిక ఉత్పత్తికి ఆటంకం కలుగుతోందని, గ్యాస్ సిలిండరు ధర వెయ్యి రూపాయలకు చేరి వేలాది కుటుంబాలు ఆందోళనలో వున్నాయని పేర్కొంది. కేంద్రప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని, సాధారణ పరిస్థితిని తీసుకురావాలని డిమాండ్ చేస్తూ పని ప్రదేశాల్లో ప్రదర్శనలు నిర్వహిం చాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చింది. ఈ మేరకు సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎలమరం కరీం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఇటువంటి పరిస్థితుల్లో సుస్థిర వాతావరణాన్ని నెలకొల్పేలా చర్యలు తీసుకోవడానికి బదులుగా అంతర్జాతీయ ఎల్ఎన్‌జీ మార్కెట్లపై అతిగా ఆధారపడుతోందని విమర్శించింది. అమెరికా సామ్రాజ్యవాదానికి దారుణంగా లొంగిపోయిన మోడీప్రభుత్వం దేశ ప్రయోజనాలను నిస్సిగ్గుగా తాకట్టు పెట్టిందని విమర్శించింది. చమురు, గ్యాస్ సంక్షోభం నేపథ్యంలో వాణిజ్య సిలిండర్ల కొరతతో హోటళ్ల పరిశ్రమలు, సిరామిక్స్ పరిశ్రమ వంటివి బాగా దెబ్బతిన్నాయని తెలిపింది. వీధుల్లో అంగళ్లు పెట్టుకుని జీవనోపాధి పొందే అసంఘటిత రంగ కార్మికులు కూడా వారి ఉపాధులను కోల్పోతున్నారని పేర్కొంది. సమస్యలను పరిష్కరించి, వాతావరణాన్ని చక్కదిద్దేందుకు నిర్దిష్ట చర్యలు తీసుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం పరిస్థితి తమ అదుపులోనే వుందంటూ ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని విమర్శించింది.

ధరలను పెంచిన ఆడి ఇండియా

ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడి ఇండియా తన కార్ల ధరలను పెంచుతున్నట్టు గురువారం ప్రకటించింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అన్ని కార్ల ధరలను 2 శాతం వరకు పెంచనున్నట్లు తెలిపింది. వాహనాల తయారీలో కీలకమైన ఇన్‌పుట్ ఖర్చులు పెరగడం, కరెన్సీ హెచ్చుతగ్గుల ప్రభావాన్ని పాక్షికంగానైనా భర్తీ చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు కంపెనీ వివరణ ఇచ్చింది. ధరల పెంపు విధానం కారు మోడల్, వేరియంట్‌ను వేర్వేరుగా ఉంటుందని, కార్ల ఎక్స్-షోరూమ్ ధరలపై ఈ పెంపు అమలవుతుందని ఆడి ఇండియా డైరెక్టర్ బల్బీర్ సింగ్ దిల్లో స్పష్టం చేశారు. ఇప్పటికీ కస్టమర్లపై ఖర్చుల భారం తగ్గించేందుకు కట్టుబడి ఉంటామని ఆయన పేర్కొన్నారు.

3.21 శాతానికి పెరిగిన రిటైల్ ద్రవ్యోల్బణం

దేశ రిటైల్ ద్రవ్యోల్బణం స్వల్పంగా పెరిగింది. ఈ ఏడాది ఫిబ్రవరి నెలకు సంబంధించి వినియోగదారుల ధరల ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం(సీపీఐ) 3.21 శాతానికి చేరుకుంది.దీనికి ప్రధానంగా అంతర్జాతీయంగా వాణిజ్య, భౌగోళిక రాజకీయ పరిణామాల ప్రభావంతో పాటు కీలక ఆహారపదార్థాలు, దుస్తులు, వినియోగ వస్తువుల ధరలు పెరగడమే కారణం. ఈ మేరకు కేంద్ర గణాంక కార్యాలయం(ఎన్ఎస్ఓ) గురువారం డేటాను విడుదల చేసింది. కొత్త 2024 బేస్ ఇయర్ సిరీస్ ప్రకారం.. జనవరిలో 2.75 శాతంగా నమోదైన రిటైల్ ద్రవ్యోల్బణం, గత నెలలో 47 బేసిస్ పాయింట్లు పెరిగింది. అయితే, ఇప్పటికీ సీపీఐ ద్రవ్యోల్బణం భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) 4 శాతం లక్ష్యం కంటే తక్కువగానే ఉంది. ఎన్ఎస్ఓ డేటా ప్రకారం, ముఖ్యంగా రిటైల్ ద్రవ్యోల్బణం పెరిగేందుకు ఆహార పదార్థాల, బంగారం, వెండి లాంటి విలువైన లోహాల ధరలు పెరగడం, ఇదే సమయంలో మధ్యప్రాచ్యంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు పుంజుకోవడం వంటి అంశాలు ప్రభావితం చేశాయి. ఫిబ్రవరిలో కూరగాయలు, తృణ ధాన్యాల ధరలు పెరగడంతో ఆహార ద్రవ్యోల్బణం 3.75 శాతానికి చేరింది. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే నగరాల్లో ధరల ఒత్తిళ్లు కొంచెం ఎక్కువగా ఉండటంతో పట్టణ ద్రవ్యోల్బణం 3.32 శాతంగా, గ్రామీణ ద్రవ్యోల్బణం 3.07 శాతంగా నమోదైంది.

ఆగని స్టాక్ మార్కెట్ల నష్టాలు

భారతీయ ఈక్విటీ మార్కెట్లలో నష్టాలు కొనసాగుతున్నాయి. పెరుగుతున్న చమురు ధరలు, బలహీన గ్లోబల్ మార్కెట్లు, విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాలు కొనసాగుతుండటంతో ఈక్విటీలపై ఒత్తిడి పెరిగింది.ఫలితంగా గురువారం మరోసారి బెంచ్‌మార్క్ సూచీలు అధిక నష్టాలను చూశాయి. ప్రధానంగా మధ్యప్రాచ్యంలో యూఎస్-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ముదురుతుండటం వల్ల ముడి చమురు ధరలు మళ్లీ 100 డాలర్లకు చేరాయి. ఇది గ్లోబల్ ఇన్వెస్టర్లతో మన మదుపర్ల సెంటిమెంట్‌ను కూడా బలహీనపరిచింది. క్రూడ్ ధరల ప్రభావం మనదేశంపై ఎక్కువగా ఉంటుంది. ఇది ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను పెంచుతాయని, కరెంట్ ఖాతా లోటును పెంచుతాయనే ఆందోళనలు నెలకొన్నాయి. దీంతో మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 829.29 పాయింట్లు క్షీణించి 76,034కు, నిఫ్టీ 227.70 పాయింట్లు నష్టపోయి 23,639 వద్ద ముగిశాయి. కీలక ఆటో, బ్యాంకింగ్, కేపిటల్ గూడ్స్ రంగాలలో అనేక కీలక కంపెనీల స్టాక్‌లలో అమ్మకాలు కనిపించాయి. దీనివల్ల ఇన్వెస్టర్లు ఒక్కరోజే రూ. 5.63 లక్షల కోట్లు నష్టపోయారు. బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ. 436.27 లక్షల కోట్లకు చేరుకుంది. అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ. 92.22 వద్ద ఉంది.

ఒరాకిల్‌లో ఉద్యోగాల కోత!?

బృంద సభ్యుల సామర్థ్యాలను పెంచడంలో కృత్రిమ మేధ (ఏఐ)కు క్రెడిట్ ఇవ్వడంతో పాటు, డేటా కేంద్రాల్లోకి ప్రవేశించేందుకు నిధులు సమకూర్చుకోవడానికి ఒరాకిల్ సిద్ధమైంది. ఇందులో భాగంగా రాబోయే నెలల్లో ఉద్యోగులను తగ్గించడానికి సన్నాహాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. లారీ ఎల్లిసన్ స్థాపించిన ఈ డేటాబేస్ గ్రూప్ పునర్నిర్మాణ వ్యయాల కోసం, అదనంగా 500 మిలియన్ డాలర్ల (సుమారు రూ.4,600 కోట్ల)ను కేటాయించినట్లు ఇటీవల త్రైమాసిక ఆదాయ నివేదిక తర్వాత యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌కు సమాచారమిచ్చింది. దీంతో ఆర్థిక సంవత్సరానికి దాని పునర్నిర్మాణ నిధులు 2.1 బిలియన్ డాలర్ల
(సుమారు రూ.19,320 కోట్ల)కు చేరాయి. ఇది మునుపటి సంవత్సరాల కంటే చాలా ఎక్కువ. దీని ప్రకారం చూస్తే ఒరాకిల్ వేల మంది ఉద్యోగులను తగ్గించొచ్చని అంచనాలు వెలువడుతున్నాయి. భారీ ఏఐ డేటా కేంద్రాలను నిర్మించే ప్రణాళికలపై ఒరాకిల్, పెట్టుబడిదార్ల నుంచి ఒత్తిడి ఎదుర్కొంటోంది. దీనికి రుణాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వచ్చే త్రైమాసికంలో ఉద్యోగుల సంఖ్యను తగ్గించకుండా ఒరాకిల్ పునర్నిర్మాణ ప్రణాళిక పరిధిని 500 మిలియన్ డాలర్లకు పెంచలేదని ఆర్‌బీసీ విశ్లేషకుడు రిషి జలూరియా అభిప్రాయపడ్డారు. తరచుగా ఉద్యోగుల తొలగింపులకు కోడ్‌గా ఉండే పునర్నిర్మాణం ఈ ఆర్థిక సంవత్సరం ముందు కంటే విస్తృతంగా ఉండొచ్చని ఒరాకిల్ సంకేతాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. గత ఏడాది ఆగస్టు-సెప్టెంబరు మధ్య ఒరాకిల్ అమెరికా, కెనడా, భారత్‌లలో 3,000 మందికి పైగా ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. సేల్స్, మార్కెటింగ్‌లో మధ్య స్థాయి ఉద్యోగులను తొలగించిందని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు తెలిపాయి. తాజా లేఆఫ్‌లు ఏ విభాగంలో ఉండనున్నాయి? ఎంత మందిని తొలగించే అవకాశం ఉంది. తదితర వివరాలు తెలియాల్సి ఉంది. వేలమంది ఉద్యోగులను తొలగించడానికి ఒరాకిల్ ప్రణాళిక సిద్ధం చేస్తోందని బ్లూమ్‌బెర్గ్ వెల్లడించింది. ఒరాకిల్ దీనిపై స్పందించలేదు.

రూ.49,999 కే టీవీఎస్ ఎలక్ట్రిక్ స్కూటర్

టీవీఎస్ మోటార్ కంపెనీ తన సరికొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ టీవీఎస్ ఆర్బిటర్ ద్వారా భారత ఈవీ మార్కెట్లో సరికొత్త విప్లవానికి తెరలేపింది. పెట్రోల్ ధరల భారం పెరుగుతున్న తరుణంలో, సామాన్యుడికి అందుబాటులో ఉండేలా బ్యాటరీ-యాజ్-ఏ-సర్వీస్ అనే వినూత్నమైన సబ్‌స్క్రిప్షన్ మోడల్‌ను ప్రవేశపెట్టింది. దీనివల్ల వినియోగదారులు స్కూటర్ కొనేటప్పుడు బ్యాటరీ ధరను చెల్లించాల్సిన అవసరం లేదు. ఫలితంగా, టీవీఎస్ ఆర్బిటర్ వీ1 బేస్ వేరియంట్‌ను కేవలం ?49,999 (ఎక్స్‌షోరూమ్, ఢిల్లీ) ప్రారంభ ధరకే సొంతం చేసుకోవచ్చు. ఒకవేళ మీరు బ్యాటరీని కూడా కొనుగోలు చేయాలనుకుంటే, ఈ స్కూటర్ ధర ?84,500 గా ఉంటుంది. ఈ స్కీమ్ కింద బ్యాటరీ కోసం నెలకు కేవలం రూ. 862 నుండి ప్రారంభమయ్యే అద్దె ప్లాన్లను కంపెనీ ఆఫర్ చేస్తోంది. దీనివల్ల స్కూటర్ కొనుగోలు చేసేటప్పుడు అయ్యే ప్రారంభ పెట్టుబడి గణనీయంగా తగ్గుతుంది. సాంకేతిక వివరాల్లోకి వెళితే, టీవీఎస్ ఆర్బిటర్ ప్రధానంగా రెండు వేరియంట్లలో అందుబాటులో ఉంది. ఆర్బిటర్ వీ1 మోడల్ 1.8 ఎచిష్ట బ్యాటరీతో వస్తుంది. ఇది ఒకసారి ఛార్జ్ చేస్తే 86 కిలోమీటర్ల (ఎఆఅ) రేంజ్ ఇస్తుంది. ఇక ప్రీమియం మోడల్ అయిన ఆర్బిటర్ వీ2 ధరను కంపెనీ 99,900 గా నిర్ణయించింది. ఇందులో అమర్చిన 3.1 ఎచిష్ట భారీ బ్యాటరీ ద్వారా ఏకంగా 158 కిలోమీటర్ల మేర ప్రయాణించవచ్చు. ఈ రెండు స్కూటర్లలోనూ 34 లీటర్ల విశాలమైన 'అండర్ సీట్ స్టోరేజీ' ఉంది, ఇది రెండు హెల్మెట్లు పెట్టుకోవడానికి వీలుగా డిజైన్ చేయబడింది. అదనంగా, ఈ స్కూటర్లకు 5 ఏళ్లు లేదా 70,000 కిలోమీటర్ల వరకు బ్యాటరీ వారంటీని కంపెనీ అందిస్తోంది. వినియోగదారులకు బ్యాటరీ లైఫ్, అలాగే నిర్వహణపై పూర్తి భరోసాను ఇస్తుంది. ఈ స్కూటర్ కేవలం బడ్జెట్ ధరకే పరిమితం కాకుండా, అత్యున్నత సాంకేతిక ఫీచర్లతో నిండి ఉంది. ఇందులో 5.5 అంగుళాల ఎల్‌సీడీ క్లస్టర్ ఉంది. ఇది స్మార్ట్‌కనెక్ట్ యాప్ ద్వారా బ్లూటూత్ కనెక్టివిటీని అందిస్తుంది. దీని ద్వారా కాల్, ఎస్సెమ్మెస్ అలర్ట్‌లు, టర్న్ బై టర్న్ నావిగేషన్ వంటి సదుపాయాలను రైడర్ పొందవచ్చు. అన్నిటికంటే ముఖ్యంగా, టీవీఎస్ ఇందులో వాట్సప్ ద్వారా పేరెంట్ కంట్రోల్ అనే ప్రత్యేక ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. దీని ద్వారా తల్లిదండ్రులు తమ పిల్లలు స్కూటర్ నడిపేటప్పుడు వారి ప్రయాణాన్ని పర్యవేక్షించవచ్చు. హిల్ హోల్డ్ అసిస్ట్, క్రూయిజ్ కంట్రోల్, రివర్స్ పార్క్ అసిస్ట్ వంటి ఫీచర్లు నగర ట్రాఫిక్‌లో ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తాయి.

ఫుడ్ డెలివరీలపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఎల్‌పీజీ సంక్షోభం

పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల ప్రభావం క్రమంగా పెరుగుతోంది. ఇప్పటికే రెస్టారెంట్లు, చిన్న చిన్న హోటళ్లు ఎల్‌పీజీ గ్యాస్ కొరత వల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.ఈ పరిస్థితి కొన్ని రంగాలలో ధరలు పెరుగుదల, తక్కువ ఉత్పత్తి లాంటి ఆందోళనలను రేకెత్తిస్తోంది. అయితే, ఈ సంక్షోభం ఫుడ్ డెలివరీ రంగంపైనా ఎక్కువగా ఉందని, పూర్తిగా ఈ రంగం కార్యకలాపాలు దెబ్బతినేల ఉన్నాయని గిగ్ వర్కర్స్ యూనియన్ చెబుతోంది. దీనికి సంబంధించి గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ సర్వీస్ వర్కర్స్ యూనియన్(జీఐపీఎస్‌డబ్ల్యూయూ) సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఎల్‌పీజీ గ్యాస్ కొరత ఎక్కువ సమస్యను సృష్టించింది. దీనివల్ల డెలివరీ ఏజెంట్లకు పనుల్లేవని పేర్కొంది. రెస్టారెంట్లు, ధాబాలు, క్లౌడ్ కిచెన్‌లు, క్యాటరింగ్ సేవలు, స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులు తమ దుకాణాలను మూసేయాల్సి వచ్చింది. ఇప్పటికే జొమాటో, స్విగ్గీ లాంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో ఆర్డర్లు 50-60 శాతం క్షీణించాయి. డెలివరీ ఏజెంట్ల నుంచి తమకు పెద్ద ఎత్తున ఎంక్వైరీలు వస్తున్నాయి. రోజుకు 30 డెలివరీలు చేసే ఉద్యోగులు కూడా ఇప్పుడు 5-10 మాత్రమే చేస్తున్నారు. డెలివరీలు తగ్గిపోవడం వల్ల కంపెనీలు కూడా ఏజెంట్ల ఐడీలను ఇన్-యాక్టివ్ చేసే ప్రమాదం ఉంది. దీని పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నామని యూనియన్ తెలిపింది. గిగ్ కార్మికులకు స్థిరమైన వేతనాలు, సామాజిక భద్రతా ప్రయోజనాలు లేవని, సరఫరా షాక్‌లు, ఆర్థిక అంతరాయాల సమయంలో వారు ఎక్కువ ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి అత్యవసర జోక్యం కోరుతూ కేంద్ర కార్మిక శాఖకు లేక రాశామని యూనియన్ పేర్కొంది. అందులో ప్రధానంగా ఆహార వ్యాపారాలకు 24 గంటల ఎల్‌పీజీసీ సరఫరా, జొమాటో, స్విగ్గీ, ఇతర ప్లాట్‌ఫారమ్‌లు డెలివరీ ఏజెంట్లకు రూ. 10,000 తక్షణ పరిహారం చెల్లించాలని, వారి ఐడీలపై 3 నెలల మారటోరియం, రోజువారీ ప్రోత్సాహకాలు, సామాజిక భద్రత కోడ్-2020 కింద పూర్తి గిగ్ వర్కర్ కవరేజ్ ఇవ్వాలని డిమాండ్ చేసింది.

నేపాల్‌లో కొత్త ప్రభుత్వం బాలేంద్ర షా నేతృత్వంలో ఏర్పాటుకు రంగం సిద్ధం

నేపాల్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్నది. తాజా పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్ఎస్పీ) భారీ విజయాన్ని సాధించి చరిత్ర సృష్టించింది. మొత్తం 165 ప్రత్యక్ష స్థానాల్లో 125 సీట్లను గెలుచుకొని దాదాపు మూడింటా రెండు వంతుల మెజారిటీని సాధించిన విషయం విదితమే. దీంతో ఈ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. ఖాట్మండు మాజీ మేయర్ అయిన బాలేంద్ర షా దేశ తదుపరి ప్రధాని అయ్యే అవకాశం దాదాపు ఖాయమైంది. ఈనెల 5న నేపాల్‌లో ఎన్నికలు జరిగాయి. ఇందులో ఆర్ఎస్పీకి స్పష్టమైన ప్రజా మద్దతు లభించింది. ఆ పార్టీ నాయకుడు శిశిర్ ఖనాల్ మాట్లాడుతూ.. పార్టీ పార్లమెంటరీ నేతగా బాలేంద్ర షానే ఎంపికవుతారని చెప్పారు. ఆయననే ప్రధాన మంత్రిగా ప్రకటిస్తామని చెప్పారు. నేపాల్‌లో జరిగిన ఎన్నికలు కొత్త చరిత్రను సృష్టించాయి. మాజీ ప్రధాని కె.పి. ఓలీ సహా పలువురు ప్రముఖులు ఓటమిని చవి చూశారు. ఇది నేపాల్‌లో ఒక భారీ రాజకీయ మార్పుగా విశ్లేషకులు చెప్తున్నారు. ఈ ఎన్నికల్లో యువత ప్రభావం స్పష్టంగా కనిపించింది. అవినీతికి వ్యతిరేకంగా జరిగిన జెన్-జెడ్ ఉద్యమం తర్వాత నేపాల్‌లోని పాత రాజకీయ పార్టీలపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దీంతో అక్కడ ప్రభుత్వం కూలిపోవడం, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో బాలేంద్ర షా నేతృత్వంలోని ఆర్ఎస్పీ భారీ విజయాన్ని నమోదు చేసుకోవడం జరిగాయి. ఇక్కడ ప్రజలు కొత్త నాయకత్వాన్ని కోరుకున్నారనీ, అందుకే ఓటర్లు ఆర్ఎస్పీకి భారీ మద్దతు పలికారని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. ఇక్కడి ఎన్నికల్లో నేపాలి కాంగ్రెస్ పార్టీ రెండో అతిపెద్ద పార్టీగా నిలిచినా? దాని ప్రముఖ యువ నాయకుడు గగన్ థాపా కూడా ఎన్నికల్లో ఓడిపోయారు.

గల్ఫ్‌పై దాడులు ఆపండి

గల్ఫ్ దేశాలపై తక్షణమే దాడులను ఆపాలని ఇరాన్‌కు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సూచించింది. అయితే దీనిపై ఇరాన్ స్పందిస్తూ తమ భూభాగంపై అమెరికా, ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను భద్రతా మండలి పట్టించుకోవడంలేదని ఆరోపించింది. గల్ఫ్ దేశాలపై దాడులను నిలిపివేయాలని కోరుతూ భద్రతా మండలిలో బహ్‌రైన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని 13 దేశాలు సమర్థించాయి. రష్యా, చైనాలు ఓటింగుకు దూరంగా ఉన్నాయి. ఇరాన్‌పై జరుగుతున్న దాడులను తీర్మానంలో ప్రస్తావించలేదని ఆ దేశాలు విమర్శించాయి. గల్ఫ్ దేశాలైన బహ్‌రైన్, కువైట్, ఒమన్, ఖతార్, ద
సౌదీ అరేబియా, యూఏఈ, జోర్డాన్‌లను లక్ష్యంగా చేసుకోవడం, అంతర్జాతీయ నౌకా మార్గాల్లో జోక్యం చేసుకోవడం వంటి చర్యలకు ఇరాన్ స్వస్తి చెప్పాలని తీర్మానం డిమాండ్ చేసింది.హర్మూజ్ జలసంధి సహా మధ్యప్రాచ్యంలోని సముద్ర మార్గాల్లో నౌకల రవాణాకు ఆటంకం కలిగించవద్దని హెచ్చరించింది. బహ్‌రైన్ తీర్మానాన్ని ఐరాసలోని 135 దేశాలు సమర్థించాయి. బహ్‌రైన్ తీర్మానాన్ని ఐరాసలో ఇరాన్ రాయబారి
అమిర్ సయీద్ ఇరావనీ ఖండించారు. ఇది రాజకీయ దురుద్దేశంతో కూడినదని విమర్శించారు. అమెరికా, ఇజ్రాయిల్‌ల రాజకీయ అజెండాలను అమలు చేసేందుకు భద్రతా మండలి నియమాలను దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు.

ఇరాన్ నాయకత్వం స్థిరంగా ఉంది

యుద్ధం కారణంగా ఇరాన్‌కు ఎదురుదెబ్బలు తగులుతున్నప్పటికీ దాని నాయకత్వం స్థిరంగా, దేశమంతా వారి నియంత్రణలోనే ఉన్నదని అమెరికా ఇంటెలిజెన్స్ అంచనా వేసింది. దీంతో ఇప్పుడప్పుడే ఘర్షణలు సమసిపోయేలా కన్పించడం లేదు. ఇరాన్‌లో నాయకత్వం కూలిపోయే అవకాశాలు లేవని అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాలు తెలిపాయి. ఇరాన్ నాయకత్వానికి వచ్చిన ప్రమాదమేమీ లేదని, ఇరాన్ ప్రజలపై దాని పట్టు సడలలేదని తేల్చి చెప్పాయి. 2003 తర్వాత తాము చేపట్టిన అతి పెద్ద సైనికచర్యకు త్వరలోనే ముగింపు పలుకుతామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనలో పసలేదని ఇంటెలిజెన్స్ నివేదిక స్పష్టం చేస్తోంది. సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీని హత మార్చడంతో ఇరాన్ మత నాయకత్వం కుదేలైపోయిందని అమెరికా నేతలు తప్పుడు అంచనాలు వేశారు. అయితే వాటిలో వాస్తవంలేదని తాజా ఇంటెలిజెన్స్ నివేదిక చెబుతోంది. యుద్ధం కారణంగా ఇరాన్‌లోని మత ప్రభుత్వం కుప్పకూలిపోతుందని చెప్పలేమని ఇజ్రాయిల్ అధికారులు కూడా అంగీకరించారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అస్పష్టంగా ఉన్నాయని ఓ అధికారి వ్యాఖ్యానించారు. యుద్ధం మొదలైనప్పటి నుంచి గగనతల రక్షణ వ్యవస్థలు, అణు స్థావరాలు, సీనియర్ నేతలు సహా ఇరాన్ లక్ష్యాలపై అమెరికా- ఇజ్రాయిల్ దాడులు చేస్తున్నాయి. ఖమేనీతో పాటు అనేక మంది సీనియర్ అధికారులను హతమార్చాయి. అయినప్పటికీ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ), ఇరాన్ నాయకత్వం దేశంపై పూర్తి నియంత్రణ సాధించాయని అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాలు తెలిపాయి. భూతల దాడులతోనే ఇరాన్‌ను దారికి తెచ్చుకోవడం సాధ్యపడుతుందన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ఇరాక్‌లో ఉన్న కుర్దు వేర్పాటు వాదులు ఇటీవలే అమెరికాను సంప్రదించారు. ఇరాన్ పశ్చిమ ప్రాంతంలో ఉన్న భద్రతా దళాలపై ఎలా దాడి చేయాలన్న విషయంపై మంతనాలు జరిపారు. కాగా ఇరాన్ ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచడానికి అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. భూతల దాడులు జరిపితే ఇరాన్ ప్రజలు ప్రభుత్వం పై తిరుగుబాటు చేయవచ్చునని అమెరికా అంచనా వేస్తోంది.

సమ్మర్‌లో బాడీని కూల్‌గా ఉంచుకోవాలా?

మార్చి ప్రారంభంతో వేసవి మొదలైంది. సమ్మర్ స్టార్టింగ్‌లోనే మాడు పడిగే ఎండలు దంచికొడుతున్నాయి. ఈ వేడిని తట్టుకోవాలంటే మన బాడీని హైడ్రేట్‌గా ఉంచుకోవడం చాలా ముఖ్యం. లేదంటే ఉష్ణోగ్రత పెరిగేకొద్దీ, డీహైడ్రేషన్, హీట్ స్ట్రోక్, అలసట వంటి సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. కాబట్టి ఇలాంటి పరిస్థితుల్లో శరీరాన్ని చల్లగా ఉంచడానికి కొన్ని పండ్లు మనకు ఎంతో సహాయపడుతాయి. ఇవి నిర్జలీకరణాన్ని నివారించడమే కాకుండా శరీరాన్ని చల్లగా ఉంచడంలో కూడా సహాయపడుతాయి. వేసవిలో బాడీని హైడ్రెట్‌గా ఉంచుకోవాలంటే మనం తినాల్సిన పండు ఏవో చూద్దాం. ముందుగా పుచ్చకాయ, పుచ్చకాయలో దాదాపు 92% నీరు ఉంటుంది, ఇది శరీరాన్ని హైడ్రేట్ చేయడంలో సహాయపడుతుంది. ఇది చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది, అలాగే నిర్జలీకరణాన్ని నివారిస్తుంది. అలాగే పుచ్చకాయలో యాంటీఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరాన్ని రక్షిస్తాయి. కాబట్టి ఈ పండు ఈ వేసవిలో మనకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. దానిమ్మ: వేసవిలో దానిమ్మ ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఇందులో ఇనుము పుష్కలంగా ఉంటుంది, ఇది రక్తహీనతను నివారిస్తుంది. ఈ పండులో నీటి శాతం పుష్కలంగా ఉంటుంది, ఇది శరీరానికి హైడ్రేషన్ అందిస్తుంది. అదనంగా, దానిమ్మ మలబద్ధకం, కడుపు నొప్పి, వేసవిలో సాధారణంగా వచ్చే ఇతర జీర్ణ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. వడదెబ్బను నివారించడానికి, దానిమ్మ, దానిమ్మ రసం తీసుకోవడం చాలా ఉత్తమం. నారింజ, ద్రాక్ష: నారింజ పండ్లు రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. వీటిలో ఉండే విటమిన్ సి శరీరానికి వ్యాధులతో పోరాడే శక్తిని ఇస్తుంది. నారింజ పండ్లు తినడం వల్ల అలసట తగ్గి శరీరానికి ఉత్తేజం లభిస్తుంది. వేసవిలో శరీరంలో నీటి కొరతను తొలగించడానికి ఇది సహాయపడుతుంది. అలాగే తీపి, పుల్లని రుచి కలిగి ఉండే ద్రాక్షను వేసవిలో తీసుకోవడం కూడా చాలా మంచిది. ద్రాక్షలో 70 శాతం కంటే ఎక్కువ నీరు ఉంటుంది, ఇది శరీరానికి హైడ్రేషన్ అందిస్తుంది. హీట్ స్ట్రోక్‌ను నివారించడంలో సహాయపడుతుంది. అలాగే శరీరాన్ని సహజంగా చల్లబరచడానికి, హైడ్రేట్ చేయడానికి కొబ్బరి నీరు కూడా ఉత్తమ మార్గం. ఇందులో ఎలక్ట్రోలైట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ వేడి వాతావరణంలో అలసట నుండి ఉపశమనం కలిగిస్తాయి. ఇది శరీరాన్ని నిర్విషీకరణ చేయడానికి కూడా సహాయపడుతుంది.

దోసకాయ, కొబ్బరి నీరు: వేసవిలో శరీరాన్ని చల్లగా ఉంచడానికి దోసకాయ తినడం కూడా ఉత్తమ మార్గం. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, నిర్జలీకరణాన్ని నివారిస్తుంది. అలాగే, దోసకాయలోని ఎలక్ట్రోలైట్లు శరీరాన్ని చల్లగా ఉంచడంలో సహాయపడతాయి.

బొప్పాయి, లిచీ: బొప్పాయి జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది, అలాగే శరీరాన్ని చల్లగా ఉంచుతుంది. ఇందులో శరీరాన్ని ఉత్తేజపరిచే యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి, ఇవి వేసవిలో శరీరాన్ని చల్లగా ఉంచుతాయి.

ఇల్లంతా హోలీ రంగులు పడ్డాయా?

హోలీ పండుగ ఆనందం, రంగుల పండుగతో నిండి ఉంటుంది. కానీ, ఆ తర్వాత ఇంటిని శుభ్రం చేయడం అంటే పెద్ద యుద్ధం చేసినట్టే అవుతుంది. ముఖ్యంగా నేలపై ఉన్న మొండి రంగు మరకలను తొలగించడం చాలా కష్టం. అవి ఇంటి అందాన్ని పాడుచేస్తాయి. సరిగ్గా శుభ్రం చేయకపోతే, ఈ మరకలు చాలా కాలం పాటు ఉంటాయి. అందువల్ల, మీ ఇంటి ఫ్లోర్, గోడలపై పడ్డ హోలీ రంగులన్నీ పోయి తిరిగి కొత్త మెరుపును తీసుకురావాలంటే.. కొన్ని సింపుల్, ఎఫెక్టివ్ టిప్స్ తెలుసుకోవడం ముఖ్యం. హోలీ ఆడటం అందరికీ ఇష్టం. కానీ ఆడిన తర్వాత నేలపై చెల్లాచెదురుగా ఉన్న రంగులను చూసి చాలా మంది భయపడతారు. ముఖ్యంగా ఖరీదైన పాలరాయి, టైల్స్‌పై, రంగు మరకలు అంత తేలికగా పోవు. కొన్నిసార్లు ఈ రంగులను తొలగించడానికి కఠినమైన కెమికల్ ఆధారిత క్లీనర్స్, కెమికల్స్‌ని ఉపయోగిస్తారు. ఇది టైల్స్, పాలరాయి ఫైనింగ్‌ని దెబ్బతీస్తుంది. కానీ, ఇప్పుడు మీరు చింతించాల్సిన అవసరం లేదు. పాలరాయి, టైల్స్ నుండి హోలీ రంగులను సులభంగా తొలగించడానికి కొన్ని సింపుల్, ఎఫెక్టీవ్ టిప్స్ ఇక్కడ ఉన్నాయి. హోలీ రంగులు ఎంత అందంగా కనిపిస్తాయో, అవి అంతే మొండి మరకలను వదిలివేస్తాయి. ముఖ్యంగా మొండి రంగులు, గులాల్ లేదా రంగు నీరు నేలమీద పడినప్పుడు వాటిని శుభ్రం చేయడం ఒక పెద్ద సవాలుగా మారుతుంది. కొన్నిసార్లు, సాదా నీటితో ఎన్ని సార్లు తుడిచినా కూడా మరకలు వదలవు. పైగా నేల నిస్తేజంగా, మరకగా కనిపిస్తుంది. అయితే, కొన్ని సాధారణ గృహ ఉపాయాలతో మీరు మొండి హోలీ మరకలను సులభంగా తొలగించవచ్చు. ఇందుకోసం ముందుగా మరక ఎండిపోవడానికి ముందుగానే శుభ్రం చేయండి. పెయింట్ ఇంకా తడిగా ఉంటే, దానిని వెంటనే పొడి గుడ్డ లేదా టిష్యూతో సున్నితంగా తుడవండి.

చాలా గట్టిగా రుద్దడం చేయకూడదు. ఎందుకంటే దీంతో రంగు మరింత వ్యాపిస్తుంది. తరువాత, కొద్దిగా లిక్విడ్ డిష్ వాషింగ్ లిక్విడ్ లేదా ఫ్లోర్ క్లీనర్‌ను గోరువెచ్చని నీటితో కలిపి తుడుచుకోండి. తేలికపాటి మరకలను తొలగించడానికి ఇది సరిపోతుంది. మరక మొండిగా ఉంటే, బేకింగ్ సోడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. మరక ఉన్న ప్రదేశంలో బేకింగ్ సోడా చల్లి, కొద్దిగా నీరు కలిపి పేస్ట్ లా చేయండి. 10 నుండి 15 నిమిషాలు అలాగే ఉంచండి. తరువాత మృదువైన బ్రష్ లేదా స్పాంజితో సున్నితంగా రుద్దండి. దీని తరువాత, శుభ్రమైన నీటితో తుడుచుకోండి. బేకింగ్ సోడా మరకను వదిలిస్తుంది. నేలకు హాని కలిగించదు.

వడదెబ్బ తగలకుండా ఉండాలంటే..

వేసవిలోకి పూర్తిగా ప్రవేశించకుండానే భానుడి తన విశ్వరూపాన్ని చూపిస్తున్నారు. మార్చి మొదటి వారంలోనే మాడు పగిలే ఎండలు జనాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అయితే రాబోయే ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రతలు మరింత రికార్డ్ స్థాయిలో నమోదవుతాయని వాతావరణ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మనం ఎండ ప్రభావానికి గురికాకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. ఎండతీవ్రతకు గురికాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన కొన్ని ముఖ్యమైన ముందస్తు జాగ్రత్తలు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వివరించారు. ఇంటి వాతావరణం చల్లదనం కోసం ఇంటి పైకప్పులపై వైట్ పెయింట్, కూల్ రూఫ్ టెక్నాలజీ, క్రాస్ వెంటిలేషన్, థర్మోకోల్ ఇన్సులేషన్ ను వంటివి ఏర్పాటు చేసుకోవాలన్నారు. మేడపైన, ఇంట్లో మొక్కలు పెట్టుకోవాలని, ఇవి ఇంటిని చల్లగా ఉంచడంతో సహాయపడుతాయని, అలాగే ఉష్ణతాపాన్ని తగ్గించడంలోనూ ఇవి సహాయపడుతాయని తెలిపారు. అందుకే ఇంటి పరిసరాల్లో మొక్కలు పెంచుకోవాలని సూచిస్తున్నారు. వంటగది తలుపులు, కిటికీలను తీసివుంచితే తగినంత గాలి వచ్చేవిదంగా చూసుకోవాలన్నారు. ఇక నుంచి మధ్యాహ్న సమయంలో బయటికి వెళ్లాలంటే తప్పకుండా గొడుగులు వెంట తీసుకెళ్లాలన్నారు. తెలుపు రంగు, పలుచటి కాటన్ వస్త్రాలు ధరించడం, కర్చీఫ్ కట్టుకోవడం , టోపి పెట్టుకోవడం, కళ్ళ రక్షణ కోసం నాణ్యమైన సన్ గ్లాసెస్ ఉపయోగించడం వంటి చిన్న చిన్న జాగ్రత్తలు ఖచ్చితంగా పాటించాలన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు వీలైనంత వరకు ఇంట్లోనే జాగ్రత్తగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. డీహైడ్రేట్ కాకుండా ఉండటానికి లాఖీ , ఇంట్లో తయారుచేసిన పానీయాలైన లస్సీ, నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు మొదలైనవి త్రాగాలి. మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. విపత్తుల నిర్వహణ సంస్థ తగు చర్యలు తీసుకుని ఎప్పటికప్పుడు ఎండ తీవ్రతపై ముందస్తుగా హెచ్చరికలు జారీ చేస్తుందన్నారు. జిల్లాయంత్రాంగం సమన్వయ చర్యలతో ప్రాణనష్టాన్ని తగ్గించగలుగుతుందన్నారు.

ఎండ తీవ్రత అంచనాల నేపథ్యంలో జిల్లా అధికారులు దృష్టి సారించాలని ఇప్పటికే సూచనలు జారీ చేశామన్నారు. విపత్తుల నిర్వహణ సంస్థలోని స్టేట్ ఎమర్జన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి ఎప్పటికప్పుడు అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పులపై పర్యవేక్షిస్తామన్నారు. జిల్లా యంత్రాంగానికి రెండు రోజుల ముందుగానే ఉష్ణోగ్రత వివరాలు, వడగాల్పులు, ఎండ తీవ్రతపై సూచనలు జారీచేయనున్నట్లు చెప్పారు. రియల్ టైమ్ లో ఎండ ప్రభావం చూపే మండల అధికారులను, ప్రజలను అప్రమత్తం చేయనున్నట్లు తెలిపారు.

బల్లుల సమస్యకు నేచురల్ టిప్స్

ఎండాకాలం మొదలు కాగానే బల్లులు, చీమలు, ఈగలు వంటి కీటకాల బెడద పెరుగుతుంది. ఈ చిరాకు కలిగించే కీటకాలను ఇంటి నుండి దూరం చేయడానికి సహజమైన, సులభమైన పద్ధతులున్నాయి. కర్పూరం వాసన చీమలు, బల్లులను తరిమికొడుతుంది. అలాగే, ఉల్లిపాయ, వెల్లుల్లి రసం స్ప్రే చేయడం వల్ల ఈగలు, ఇతర కీటకాలు ఇంట్లోకి రావు. ఎండాకాలం మొదలైంది.మార్చి మొదటి వారంలోనే వాతావరణం వేడెక్కింది. ఉదయం నుంచే సూర్యుడి భగ్గుమంటూ వెలుగుతున్నాడు. ఋతువులు మారుతున్న కొద్దీ, మన చుట్టూ కొన్ని మార్పులు కూడా జరగడం ప్రారంభిస్తాయి. వాటిలో ఒకటి వేసవిలో బల్లి పిల్లలు, చీమలు, ఈగలు ఇంటి చుట్టూ ఎక్కువగా తిరుగుతూ ఉంటాయి. కొన్నిసార్లు ఇంట్లో కూడా బల్లి కనిపించినప్పటికీ, వేసవిలో దాని పిల్లలు కూడా తిరుగుతుంటాయి. దీంతో చాలా మంది చిరాకు, కంపరానికి గురవుతుంటారు. మీరు దీన్ని నివారించాలనుకుంటే మీ ఇంట్లో బల్లులు తిరగకుండా ఉండాలనుకుంటే, కొన్ని ఉపాయాలు పాటించటం మంచిది. కర్పూరం వాసన మనకు ఆకర్షణీయంగా అనిపించినప్పటికీ, చీమలు దానిని అస్సలు ఇష్టపడవు. అందువల్ల, కర్పూరం సహాయంతో, చీమలను ఇంటి నుండి తరిమికొట్టవచ్చు. రోజుకు కనీసం ఒక్కసారైనా కిటికీ లేదా తలుపు దగ్గర కర్పూరం కాల్చండి. ఇది బయటి నుండి చీమలు, బల్లి పిల్లలు వంటివి మీ ఇంట్లోకి ప్రవేశించకుండా నిరోధిస్తుంది. అలాగే, మీ ఇంట్లో చీమలు, బల్లులు ఎక్కువగా కనిపించే ప్రదేశాలలో కర్పూరం మాత్రలను ఉంచండి. ఇది మీకు బెస్ట్ ఉపాయం. మీ ఇంటి నుండి ఈగలను శాశ్వతంగా వదిలించుకోవడానికి ఉల్లిపాయ, వెల్లుల్లి కూడా చాలా ప్రభావవంతంగా ఉంటాయి. ఈ నివారణను పాటించటం కోసం 8 నుండి 10 వెల్లుల్లి రెబ్బలు, 1 మధ్య తరహా ఉల్లిపాయను మిక్సర్‌లో రుబ్బుకోవాలి. ఆ తరువాత, వాటిని సన్నని గుడ్డ ద్వారా వడకట్టి దాని రసాన్ని తీయండి. ఈ రసాన్ని స్ప్రే బాటిల్‌లో నింపి వారానికి ఒకసారి చీమలు, బల్లులు కనిపించే ప్రదేశాలపై, అలాగే కిటికీ, తలుపు ఫ్రేములపై పిచికారీ చేయండి. ఉల్లిపాయ, వెల్లుల్లిలో ఉండే సల్ఫర్ కీటకాలను దూరంగా ఉంచుతుంది. మీరు ఈ రసంలో కొంచెం మిరియాల పొడిని కూడా కలపొచ్చు. సల్ఫర్ వాసనతో పాటు, మిరియాల ఘాటు చీమలు, బల్లులకు మరింత చికాకు కలిగిస్తుంది.

నానబెట్టిన కిస్‌మిస్‌తో బెనిఫిట్స్?

నానబెట్టిన ఎండు ద్రాక్ష శక్తివంతమైన పోషకాల గని. వీటిని రాత్రి నానబెట్టి, ఉదయం ఖాళీ కడుపుతో తినడం వలన జీర్ణశక్తి, గుండె ఆరోగ్యం మెరుగుపడతాయి. ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల మలబద్ధకం తగ్గుతుంది, శక్తి పెరుగుతుంది. చర్మ ఆరోగ్యం, రోగనిరోధక శక్తిని పెంచడంలో తోడ్పడతాయి. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందించే ఈ చిన్న పండ్లను మీ దినచర్యలో భాగం చేసుకోండి. ద్రాక్షలు.. చూసేందుకు చాలా చిన్నసైజు పండ్లు.. కానీ, ఇది శక్తివంతమైన పోషకాలతో నిండినవి. ఎండు ద్రాక్ష తినడం వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు పొందుతారు. ఇందులో ఫైబర్, విటమిన్స్, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. వాటిని రాత్రి నీటిలో నానబెట్టి, ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో తినడం ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తుంది. నిపుణుల ప్రకారం, నానబెట్టిన ద్రాక్షలను తినడం వల్ల శరీరంలో డిటాక్సిఫికేషన్ జరుగుతుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. శక్తి పెరుగుతుంది. నానబెట్టి కిస్‌మిస్ తినడం వలన జీర్ణశక్తి పెరుగుతుంది, గట్ హెల్త్ మెరుగవుతుంది. ఇందులో వాటర్ కంటెంట్, ఫైబర్ సమృద్ధిగా ఉండటం వలన మలబద్ధకం వంటి సమస్యలు కూడా తగ్గుతాయి. నానబెట్టిన కిస్‌మిస్‌లో పొటాషియం,ఇతర సూక్ష్మ పోషకాలు అధికంగా ఉంటాయి. దీని వలన గుండె పనితీరు మెరుగవుతుంది. నానబెట్టిన ద్రాక్షల్లో యాంటీ ఆక్సిడెంట్స్, ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. ఇవి బ్లడ్ ప్రెషర్, కొలెస్ట్రాల్ లెవెల్స్ నియంత్రణలో సహాయపడతాయి. దీనివల్ల హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. నానబెట్టిన ద్రాక్షలు రుచి మాత్రమే కాకుండా ఫైబర్ కారణంగా కడుపును సక్రమంగా ఉంచి, పేగు సమస్యలు, కడుపు నిండినట్లు అనిపించడంలో సహాయపడతాయి. మలబద్ధకం సమస్యను నివారించడంలో ఇది ఫలవంతంగా పని చేస్తుంది. నానబెట్టిన ఎండుద్రాక్షలో నేచురల్ షుగర్స్‌తో పాటు ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటం వలన తక్షణ ఎనర్జీ లభిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ నానబెట్టిన ఎండు ద్రాక్ష తినడం వలన శరీరానికి సమృద్ధిగా లభిస్తాయి. స్కిన్ హెల్త్ మెరుగవుతుంది. నానబెట్టిన ఎండు ద్రాక్ష తినడం వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికీ మితంగా తీసుకోవడం ఎంతో ముఖ్యం. నానబెట్టిన ద్రాక్షలు శరీరంలో ఫ్రీ రాడికల్స్‌ను తగ్గించి, చర్మం, జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. వీటిలో విటమిన్లు, ఖనిజాలు ఉండటంతో ఇమ్యూనిటీ పెరుగుతుంది. ప్రతిరోజు ఖాళీ కడుపుతో నానబెట్టిన ద్రాక్షలు తినడం వల్ల శరీరానికి తక్షణ శక్తి అందుతుంది. ఉద్యోగ, చదువులు లేదా వ్యాయామంలో అలసట తక్కువగా ఉంటుంది. అదనంగా, ఇది బోన్లు, దంతాల ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. రక్తంలో షుగర్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ప్రతి రోజు రాత్రి నానబెట్టి, ఉదయం 5?10 ద్రాక్షలు తినడం, శక్తివంతమైన, ఆరోగ్యకరమైన అలవాటు. ఇది శరీరానికి, చర్మానికి, హృదయానికి, జీర్ణక్రియకు, ఇమ్యూనిటీకి ఎంతో మేలు చేస్తుంది.

బొప్పాయిని ఏ టైమ్‌లో తినాలి..?

ప్రకృతి ప్రసాదించిన అద్భుతమైన పండ్లలో బొప్పాయి ఒకటి. విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లకు నిలయమైన ఈ పండును పోషకాల గని అని పిలిచినా ఆశ్చర్యం లేదు. ముఖ్యంగా ఈ వేసవి కాలంలో శరీరాన్ని చల్లబరచడానికి చాలా మంది బొప్పాయిని తింటుంటారు. సరైన సమయం ఏది?: బొప్పాయిలో కార్బోహైడ్రేట్లు, ఫైబర్, ప్రోటీన్‌తో పాటు విటమిన్ ఎ, సి, బి-కాంప్లెక్స్, ఇ, కె వంటి ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. వీటిని శరీరం పూర్తిస్థాయిలో గ్రహించాలంటే.. బొప్పాయిని ఉదయం ఖాళీ కడుపుతో లేదా అల్పాహార సమయంలో తీసుకోవడం అత్యంత ఉత్తమం. ఇది రోజంతా జీర్ణవ్యవస్థను చురుగ్గా ఉంచి, మిమ్మల్ని శక్తివంతంగా ఉంచుతుంది.రాత్రి సమయంలో: పేగులను డిటాక్సీఫై చేయడానికి రాత్రిపూట కూడా తినవచ్చు. కానీ భోజనం చేసిన వెంటనే పండ్లు తినకూడదు. భోజనానికి, పండు తినడానికి ధ్య కనీసం 3 నుండి 4 గంటల విరామం ఉండాలి.జీర్ణక్రియకు అమృతం: బొప్పాయిలో ఉండే పపైన్ అనే ఎంజైమ్ ప్రోటీన్లను జీర్ణం చేయడంలో అద్భుతంగా పనిచేస్తుంది. మలబద్ధకం, గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలతో బాధపడేవారికి ఇది ఒక సహజ ఔషధం. ఇందులో పుష్కలంగా ఉండే విటమిన్ సి శరీరానికి రోగనిరోధక కవచంలా పనిచేస్తుంది. వైరల్ ఇన్‌ఫెక్షన్లు, జలుబు వంటి సమస్యల నుండి రక్షణ కల్పిస్తుంది.బరువు తగ్గాలనుకునే వారికి: బొప్పాయిలో కేలరీలు తక్కువ, ఫైబర్ ఎక్కువ. ఇది తిన్న తర్వాత కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తుంది, తద్వారా అతిగా తినడాన్ని అరికట్టి బరువు తగ్గడానికి సహకరిస్తుంది. గుండె ఆరోగ్యం – మెరిసే చర్మం: ఇందులోని యాంటీఆక్సిడెంట్లు చర్మంపై ముడతలు, మొటిమలు, నల్లటి మచ్చలను తగ్గిస్తాయి. క్రమం తప్పకుండా తింటే చర్మానికి సహజమైన మెరుపు వస్తుంది. అంతేకాకుండా పొటాషియం, ఫైబర్ సమృద్ధిగా ఉండటం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. ఇది రక్తపోటును తగ్గించి గుండె జబ్బుల ముప్పును నివారిస్తుంది.

ప్రపంచకప్ జట్టులోని సంజు శాంసన్ ఫోటోని తొలగించిన టీమిండియా కెప్టెన్..

హైదరాబాద్ పెన్ పవర్: టీ20 వరల్డ్ కప్ 2026 విశ్వవిజేతగా టీమిండియా నిలిచింది. మార్చి8వ తేదీన అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ పై 96 పరుగుల తేడాతో గెలిచి మూడోసారి పొట్టి కప్ ని ముద్దాడింది. ఈ ప్రపంచకప్ గెలవడంలో సంజూ శాంసన్ కీలక పాత్ర పోషించాడు. సూపర్--8లో వెస్టిండీస్ పై 97 పరుగులు, సెమీఫైనల్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ పై 89 రన్స్ తో పాటు ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ పై 89 పరుగులు చేశాడు. దీంతో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును కూడా సంజు శాంసన్ కైవసం చేసుకున్నాడు. ఇండియన్ టీమ్ టీ20 వరల్డ్ కప్‌ను గెలవడంతో టెస్టు, వన్డే కెప్టెన్ అయిన శుభ్‌మన్ గిల్ సోషల్ మీడియా వేదికగా భారత జట్టుకి శుభాకాంక్షలు చెప్పాడు. టీమిండియా ప్రపంచ కప్ ట్రోఫీని అందుకునే సమయలో దిగిన ఫోటోను తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్టు చేశాడు. కానీ ఇప్పుడు ఈ ఫోటో పైనే తీవ్ర వివాదం కొనసాగుతుంది. గిల్ పోస్ట్ చేసిన ఫోటోలో సంజూ శాంసన్ కనిపించడం లేదని క్రికెట్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కావాలనే ఫోటోలో శాంసన్‌ను గిల్ తీసివేశాడని కామెంట్స్ చేస్తున్నారు. టీమ్ లో గిల్ స్థానంలో సంజు శాంసన్ కి చోటు దక్కడం వలన కోపంతో ఉన్న టీమిండియా వన్డే, టెస్టుల కెప్టెన్ గిల్ ఇలా పగ తీర్చుకున్నాడుని తెలుస్తుంది. ఇక అదే రోజు సూర్యకుమార్ యాదవ్ పోస్ట్ చేసిన ఫోటోలో సంజూ శాంసన్ కనిపించడాన్ని ప్రస్తావిస్తున్నారు. అదే ఫోటోను గిల్ ఎడిట్ చేసి పోస్ట్ చేశాడా? అని క్వశ్చన్ చేస్తున్నారు. వాస్తవానికి శుభ్‌మన్ గిల్.. సంజు శాంసన్ ను ఫోటో నుంచి తొలగించే ఛాన్స్ లు చాలా తక్కువగా ఉన్నాయి. ఎందుకంటే టీ20 వరల్డ్ కప్ 2026 వేడుకల రోజున తీసిన చాలా ఫోటోలు సోషల్ మీడియాలో దర్శనమిస్తున్నాయి. యశస్వి జైస్వాల్ కూడా టీమిండియాకు అభినందలు తెలుపుతూ చేసిన ఫోటోలోనూ సంజూ కనిపించలేదు..

అన్ని టీమ్స్ ఈ రూల్స్ పాటించాల్సిందే.. ఐపీఎల్ ప్రారంభానికి ముందు బీసీసీఐ కఠిన ఆంక్షలు..

హైదరాబాద్ పెన్ పవర్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL) 2026లో జరిగే 19వ ఎడిషన్ మరి కొద్ది రోజుల్లోనే ప్రారంభం కానుంది. మార్చి 28వ తేదీన బెంగళూరులోని ఎం.చిన్నస్వామి స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB) వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) మధ్య మ్యాచ్‌తో మెగా టోర్నమెంట్ స్టార్ట్ అవుతుంది. మెగా టోర్నమెంట్ ప్రారంభానికి కేవలం రెండు వారాల సమయం మాత్రమే ఉండటంతో, భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI) 10 ఫ్రాంచైజీలు అనుసరించాల్సిన కొన్ని కీలక సూచనలను జారీ చేసింది.క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం.. ఏ జట్టు కూడా ప్రత్యర్థి జట్టు ఉపయోగించిన అదే పిచ్‌పై ప్రాక్టీస్ చేయకూడదు, ఒకేసారి రెండు జట్లకు ప్రాక్టీస్ సెషన్‌లలు నిర్వహించొద్దు.. ప్రతి జట్టుకు కేటాయించిన ప్రాక్టీస్ సెషన్ కోసం కొత్త నెట్‌లు తప్పనిసరిగా అందించాలని బీసీసీఐ ఫ్రాంచైజీలకు సూచించింది. అన్ని ఫ్రాంచైజీ తన తొలి హోమ్ మ్యాచ్‌కు నాలుగు రోజుల ముందు నుంచి స్టేడియంలోని ప్రధాన పిచ్‌పై ప్రాక్టీస్ చేయకూడదని వెల్లడించింది. ఈ కాలంలో ప్రాక్టీస్ చేయడానికి ప్రత్యామ్నాయ మైదానాన్ని సంబంధిత రాష్ట్ర క్రికెట్ బోర్డు ఫ్రాంచైజీకి ఎలాంటి ఖర్చు లేకుండా అందించాలని తెలిపింది.ఐపీఎల్ సీజన్ కోసం పిచ్‌ను సిద్ధం చేయడానికి, సంబంధిత ఫ్రాంచైజీ యొక్క తొలి హోమ్ మ్యాచ్‌కు ముందు నాలుగు రోజులలో ప్రధాన పిచ్ పై ఎటువంటి ప్రాక్టీస్ సెషన్‌లు లేదా ప్రాక్టీస్ మ్యాచ్‌లు జరగకూడదు అని బీసీసీఐ పేర్కొనింది. ఈ కొత్త మార్గదర్శకాలు ఫ్రాంచైజీలకు సమయాన్ని సకాలంలో వినియోగించుకునేలా, పిచ్ పరిస్థితులను రక్షించడానికి రూపొందించబడ్డాయి.

సన్‌రైజర్స్ లీడ్స్ జట్టులో పాక్ ప్లేయర్.. బీసీసీఐ రియాక్షన్ ఇదే!

హైదరాబాద్ పెన్ పవర్: ఇంగ్లాండ్ లో జరగనున్న 'ది హండ్రెడ్' లీగ్ వేలంలో భాగంగా పాకిస్తాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌ను సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు రూ.2.34 కోట్లకు దక్కించుకున్న విషయం తెలిసిందే. దీనిపై భారత్ లో తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. ఓ భారతీయ ఫ్రాంచైజీ పాక్ ప్లేయర్‌ను కొనుగోలు చేయడంపై క్రికెట్ ఫ్యాన్స్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేలంలో సన్‌రైజర్స్ సీఈవో కావ్య మారన్, హెడ్ కోచ్ డానియల్ వెట్టోరి పాల్గొన్నారు. దీంతో ఐపీఎల్ 2026లో కూడా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆడే మ్యాచ్‌లను బాయ్‌కాట్ చేయాలంటూ సోషల్ మీడియాలో ఫ్యాన్స్ పోస్టులు పెడుతున్నారు. దీంతో ఎట్టకేలకు ఈ వివాదంపై బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా రియాక్ట్ అయ్యారు. ఇది ఐపీఎల్‌కు సంబంధించిన విషయం మాత్రం కాదు.. విదేశీ లీగ్‌లో జరిగిన వ్యవహారం.. అందువల్ల ఈ అంశంపై బీసీసీఐ జోక్యం చేసుకునే ఛాన్స్ లేదన్నారు. అది ఆ ఫ్రాంచైజీదే తుది నిర్ణయం అని స్పష్టం చేశారు. గతేడాది ఆపరేషన్ సింధూర్ సమయంలో అబ్రార్ ఇండియన్ ఆర్మీని విమర్శిస్తూ మైదానంలోనే రెచ్చిపోయాడు. అలాంటి సదరు పాక్ ప్లేయర్‌ను సన్‌రైజర్స్ లీడ్స్ ఫ్రాంచైజీ కొనుగోలు చేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు కొనసాగుతున్నాయి. టీమిండియా వర్సెస్ -పాకిస్తాన్ మధ్య రాజకీయ ఉద్రిక్తతలతో 2008 తర్వాత ఇప్పటి వరకు పాక్ కి చెందిన ఏ అంతర్జాతీయ ఆటగాడు కూడా ఐపీఎల్ టోర్నీలో ఆడలేదు. కానీ ప్రపంచంలోని ఇతర టీ20 లీగ్‌లలో మాత్రం ఐపీఎల్ యాజమాన్యంలోని జట్లు పాకిస్థాన్ ప్లేయర్స్ ని తీసుకున్న విషయం తెలిసిందే.

'రామాయణ 2'.. నితేష్ తివారీ ధీమా వెనుక అసలు కథేంటి?

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ఒక భారీ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్తుందంటేనే ఎన్నో లెక్కలు ఉంటాయి. అలాంటిది పార్ట్ 1 విడుదల కాకముందే, రెండో భాగం షూటింగ్ మొదలుపెట్టడం అనేది మామూలు విషయం కాదు. గతంలో రాజమౌళి 'బాహుబలి'కి, మణిరత్నం 'పొన్నియిన్ సెల్వన్'కు ఇలాంటి సాహసమే చేశారు. ఇప్పుడు నితేష్ తివారీ తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'రామాయణ' విషయంలో అదే బాటలో పయనిస్తున్నారు. అసలు మొదటి భాగం ఫలితం తెలియకుండానే రెండో భాగంపై ఇంతటి ధీమా చూపించడం వెనుక ఉన్న రహస్యం ఏంటనేది ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ?దీనికి ప్రధాన కారణం లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ఒక ప్రత్యేక స్క్రీనింగ్ అని తెలుస్తోంది. పార్ట్ 1 కి సంబంధించిన రఫ్ కట్‌ను అక్కడ ప్రదర్శించగా, విజువల్స్ కథా గమనం చూసి మేకర్స్ షాక్ అయ్యారట.

హాలీవుడ్ స్థాయి టెక్నికల్ వాల్యూస్‌తో సినిమా అద్భుతంగా వచ్చిందనే నమ్మకం కలగడంతో, ఏమాత్రం ఆలస్యం చేయకుండా పార్ట్ 2 పనులను వేగవంతం చేశారు. రన్బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా ఇప్పటికే తమ పాత్రల్లో పరకాయ ప్రవేశం చేయడంతో, అదే ఫ్లోలో లంక ప్రయాణానికి సంబంధించిన కీలక ఘట్టాలను కూడా పూర్తి చేయాలని దర్శకుడు భావిస్తున్నారు.?ఇలా రెండు భాగాలను ఏకకాలంలో ప్లాన్ చేయడం వెనుక ఒక బలమైన ప్లస్ పాయింట్ ఉంది. నటీనటుల లుక్స్ వారి బాడీ లాంగ్వేజ్‌లో ఎటువంటి తేడా రాకుండా జాగ్రత్త పడవచ్చు. ముఖ్యంగా రామాయణం లాంటి ఇతిహాసాన్ని వెండితెరపై చూపిస్తున్నప్పుడు కంటిన్యూటీ చాలా ముఖ్యం. లంక వైపు సాగే ప్రయాణం, హనుమంతుడిగా సన్నీ డియో ఎంట్రీ వంటి కీలక సీన్లు పార్ట్ 2 లోనే ఎక్కువగా ఉంటాయి. అందుకే ఒక షెడ్యూల్ పూర్తి కాగానే వెంటనే రెండో భాగం సెట్స్‌ను సిద్ధం చేసి, షూటింగ్ గ్యాప్ లేకుండా చూసుకుంటున్నారు.?అయితే ఇందులో రిస్క్ కూడా లేకపోలేదు. సుమారు రూ. 4000 కోట్ల భారీ పెట్టుబడితో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌లో పార్ట్ 1 ఫలితంపైనే పార్ట్ 2 భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ఒకవేళ మొదటి భాగానికి ఆశించిన స్పందన రాకపోతే రెండో భాగం పరిస్థితి ఏంటనే ప్రశ్న సహజంగానే వస్తుంది. కానీ రామాయణంకు ఉండే బజ్ వేరు, దాన్ని సరైన పద్ధతిలో విజువల్ వండర్‌గా చూపిస్తే ప్రేక్షకులు ఖచ్చితంగా ఆదరిస్తారనేది మేకర్స్ నమ్మకం. పైగా యాష్ లాంటి స్టార్ రావణుడిగా నటిస్తుండటం సినిమాకు పాన్ ఇండియా స్థాయిలో పెద్ద క్రేజ్‌ను తెచ్చిపెడుతోంది.?ప్రస్తుతం ముంబైలో జరుగుతున్న షెడ్యూల్‌లో రాముడి వనవాసం తర్వాత జరిగే కీలక ఘట్టాలను చిత్రీకరిస్తున్నారు. సీతమ్మ అపహరణ తర్వాత రాముడిలోని అలజడి, ఆపై హనుమంతుడిని కలవడం వంటి భావోద్వేగ సీన్లతో పాటు భారీ యుద్ధ సన్నివేశాలను కూడా ఈ షెడ్యూల్‌లో ప్లాన్ చేశారు. టెక్నాలజీ పరంగా కూడా ఎక్కడా రాజీ పడకుండా, అంతర్జాతీయ సాంకేతిక నిపుణుల సలహాలతో విజువల్ ఎఫెక్ట్స్‌ను రూపొందిస్తున్నారు. 2026 దీపావళికి మొదటి భాగం విడుదల చేసేలా మేకర్స్ పక్కా ప్రణాళికతో ఉన్నారు. 'రామాయణ' టీమ్ చేస్తున్న ఈ సాహసం భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టు ఎక్కించేలా కనిపిస్తోంది. మరి 2027లో రాబోయే రెండో భాగం నాటికి మొదటి భాగం ఎటువంటి అంచనాలను క్రియేట్ చేస్తుందో వేచి చూడాలి.

పెద్ది పట్ల తనకున్న ప్రేమను వ్యక్తం చేసింది వేదవికా

అద్భుతమైన ఎత్నిక్ లుక్‌తో సంయుక్తా మీనన్ తలదాచుకుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965